www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 15 సంచిక : 45 మంగళవారం, నవంబర్ 11, 2025, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

# ఢిల్లీ ఎర్రకోట వద్ద భారీ పేలుడు

- కారులో పేలుడు పదార్థాలను రిమోట్‌తో పేల్చివేత
- 8మంది మృతి..పలువురికి గాయాలు
- ఢిల్లీలో రెడ్ అలర్ట్ ప్రకటించిన పోలీసులు
- ముమ్మరంగా గాలింపు చర్యలు




2లో



## నేడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

**పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి**

**పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది**

**డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ**

హైదరాబాద్, నవంబర్ 10: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో మొత్తం 4 లక్షల 1,365 మంది ఓటర్లు ఉన్నారు. 58 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఎన్నికల కోసం 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నాలుగు ఈవీఎంలను ఏర్పాటు చేశారు. మిగతా2లో...



## నేడు బీహార్‌లో రెండోదశ ఎన్నికలు


**122 స్థానాలకు రెండో దశలో పోలింగ్**

**అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం**

పాట్నా, నవంబర్ 10: బీహార్‌లో రెండో దశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొదటి దశలో 121 స్థానాల్లో పోలింగ్ జరుగగా.. మిగిలిన 122 స్థానాలకు రెండో దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ దశలో మొత్తం 1302 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని పరీక్షించుకోను న్నారు. సుమారుగా 4 కోట్ల మంది ఓటర్లు వారి గెలుపోట ములను నిర్ధారించనున్నారు. రెండో దశలో భాగంగా పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామర్హి, మధుబని, సుపౌల్, అరేరియా, కిషన్‌గంజ్ తదితర జిల్లాల్లో పోలింగ్ జరుగనుంది. పోలింగ్ నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. మొత్తం 4 లక్షల మంది పోలీసులు, పారా మిలిటరీ బలగాలను ఇందుకు వినియోగించారు. మిగతా2లో...

## మాయమైన మనిషి అందెశ్రీ

- తిరిగిరాని లోకాలకు వెళ్లిన తెలంగాణ గొంతుక
- అస్వస్థతతో తెల్లవారు జామున కన్నుమూత
- తెలంగాణ గొంతుకగా పాటలతో ఉత్తేజ పరిచిన స్వరం
- తెలంగాణ గీతంగా అందెశ్రీ జయ..జయహే తెలంగాణ
- తీవ్ర విచారం వ్యక్తం చేసిన రేవంత్, కెసిఆర్, చంద్రబాబు
- పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం


2లో

## ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం

**గడువులోగా విచారించని స్పీకర్**

**మరోమారు సుప్రీం గడప తొక్కిన బిఆర్ఎస్**

న్యూఢిల్లీ,నవంబర్10: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఫిరాయింపు ఎమ్మెల్యే అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ముగిసినా, ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను త్వరగా విచారణకు స్వీకరించాలని అభ్యర్థించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై జూలై 31న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని మిగతా2లో...



## అత్యాధునికంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

- శంషాబాద్ విమానాశ్రయం తరహాలో ఆధునీకరణ
- రూ.715 కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు
- స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఏర్పాటు
- రైల్వేస్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం
- ప్రత్యేకంగా 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు ఏర్పాటు
- ఆధునీకరణ పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 10: శంషాబాద్ విమానా శ్రయం మాదిరిగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దు తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అత్యాధునిక సౌకర్యా లతో అధునాతనంగా రూపుదిద్దుకోబోఓతోందని అన్నారు. వచ్చే ఏడాది డిసెంబర్‌లోగా ఆధునీకరణ పూర్తవుతుందని అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం.. మీడియాతో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను మెట్రో మార్గంతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. రూ.715 కోట్లతో మిగతా2లో...



## ఎర్రకోట వద్ద పేలుడు ఘటన

**- ఆరా తీసినా ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ, నవంబర్ 10: ఎర్రకోట సమీపంలో చోటుచేసుకున్న పేలుడు ఘటనపై ప్రధాని మోదీ ఆరా తీశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మరోవైపు, ఈ పేలుడు ఘటనకు సంబంధించిన వివరాలను దిల్లీ పోలీస్ కమిషనర్ వెల్లడించారు. సాయంత్రం 6.52 గంటలకు ఓ వాహనం ఎర్రకోట సమీపంలోని రెడ్ సిగ్నల్ వద్ద వచ్చి మిగతా2లో...

## అందెశ్రీ మృతికి పవన్ కళ్యాణ్ సంతాపం



అమరావతి,నవంబర్10: ప్రముఖ తెలుగు సాహితీవేత్త, గేయ రచయిత అందెశ్రీ మరణం బాధాకరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ జననీ మిగతా2లో...

## విద్యారంగానికి పునాదులు వేసిన మౌలానా

**- ఆజాద్ జయంతి సందర్భంగా స్మరించుకున్న రేవంత్**

హైదరాబాద్, నవంబర్ 10:భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కే దక్కుతుందని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. మౌలానా జయంతి సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. మహనీయుడి జయంతి రోజునే నవంబరు 11న జాతీయ విద్యా దినోత్సవం

మిగతా2లో...



## జూబ్లీహిల్స్‌లో విచ్చలవిడిగా మద్యం..డబ్బుల పంపిణీ

**ఆధారాలతో ఇసికి ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్**

**చర్యలు తీసుకోవాలన్న ఎమ్మెల్యే హరీష్ రావు**

హైదరాబాద్, నవంబర్ 10: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇష్టారాజ్యంగా మద్యాన్ని ప్రవహింపజేస్తూ, విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేస్తుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. లక్షకు పైగా చీరలు, మిక్సీ గ్రైండర్లను పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. వీటన్నింటికీ సంబంధించిన ఫొటోలు, వీడియో ఆధారాలను ఎలక్షన్ కమిషన్‌కు సమర్పించామని తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని



# ఢిల్లీ ఎర్రకోట వద్ద భారీ పేలుడు

**న్యూఢిల్లీ, నవంబర్ 10:** దేశ రాజధాని దిల్లీలో భారీ పేలుడు సంభవించింది. ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద పార్కింగ్ స్థలంలో నిలిపి ఉంచిన ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందగా 24 మంది గాయ పడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. పేలుడు ధాటికి మృతదేహాలు ఛిద్రమయ్యాయి. సోమవారం సాయంత్రం 6.55 గంటలకు పేలుడు సమాచారం అందినట్లు అగ్నిమాపక శాఖ ప్రకటించింది. ప్రమాదం అనంతరం ఏడు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. పేలుడు నేపథ్యంలో దిల్లీలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. దిల్లీ పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం సహా క్లూస్ టీమ్ ఘటనా స్థలికి చేరుకున్నాయి. ప్రమాదం అనంతరం స్థానికంగా భీతావహ వాతావరణం నెలకొంది. పేలుడు ధాటికి చుట్టుపక్కనే ఉన్న పలు కార్లు, ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. కారులో ఉంచిన పేలుడు పదార్థాలను దూరం నుంచి ఎవరైనా రిమోట్ కంట్రోల్ సాయంతో పేల్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ప్రతి సోమవారం దిల్లీలోని పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లకు సెలవు కావడంతో ప్రమాదం తీవ్రత తక్కువగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ పేలుడు జరిగినప్పుడు నేను గురుద్వారా వద్ద ఉన్నాను. భారీ శబ్దం వినిపించింది. అదేంటో మాకు అర్థంకాలేదు. అంత పెద్దగా వినిపించింది. ఆ వాహనానికి సమీపంలో ఉన్న మరికొన్ని వాహనాలూ పూర్తిగా దగ్ధమయ్యాయ అని ఓ ప్రత్యక్ష సాక్షి వెల్లడించారు. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. 7 ఫైరిరజన్ల సహాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఫోర్స్ కూడా ఘటనా స్థలికి చేరుకుంది. పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. దిల్లీ పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం సంఘటనా స్థలానికి చేరుకుంది.

# మాయమైన మనిషి అందెశ్రీ





**హైదరాబాద్, నవంబర్ 10:** మనిషిన్న వాడు మాయమై పోయాడు. మానవ్వం ఉన్న చోటుకు తిరిగి రాకుండా పోయారు. పల్లె అన్నీ నేర్పిందన్న ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ కన్నుమూశారు. 64 ఏండ్ల అందెశ్రీ కొతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం రాత్రి లాలాగూడలోని తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ' పాటను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గేయంగా గుర్తించింది. 1961, జూలై 18న ఉమ్మడి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తిలో అంటే ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఉన్న రేబర్తిలో అందెశ్రీ జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లన్న. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. 'మాయమై పోతున్నడమ్మ మనిషన్నవాడు' అనే పాటతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అశు కవిత్వం చెప్పడంలో దిట్ట అయిన అందెశ్రీ.. ప్రజాకవి, ప్రకృతి కవిగా ప్రసిద్ధి చెందారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తన పాటలతో ప్రజలను ఉత్తేజితులను చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'తోపాటు ఎన్నో పాటలు రాశారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2006లో గంగ సినిమాకు నంది పురస్కారం అందుకున్నారు. 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కరం, లోక్‌నాయక్ పురస్కారం అందుకున్నారు.అందెశ్రీ ఆకస్మిక మృతిపట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందన్నారు. అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేసుకున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గీతం కొత్త స్వరాలతో రూపకల్పన చేసుకున్నామన్నారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందంటూ సీఎం సంతాపం వ్యక్తం చేశారు. కవి,రచయిత అందెశ్రీ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు. తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటు అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అందెశ్రీ మృతి పట్ల స్పీకర్ ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీ మృతి పట్ల భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతితి వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధన సాంస్కృతిక ఉద్యమంలో అందెశ్రీ పాల్గొన్నారని గుర్తుచేశారు. తన పాటలతో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని పేర్కొన్నారు. అందెశ్రీ మృతిపట్ల భారత రాష్ట్ర సమితి నేతలు కేటీఆర్, హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీకి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

# అత్యాధునికంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

(మొదటి పేజీ తరువాయి)

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు సాగుతున్నాయి. స్టేషన్‌ను 1.65 లక్షల చ.మీ మేర కొత్తగా నిర్మిస్తున్నాం. ఈ స్టేషన్‌కు నిత్యం 1.97లక్షల ప్రయాణికులు వస్తుంటారు. 2.70లక్షల మంది ప్రయాణికుల అవసరాలకు తగినట్లు నిర్మిస్తున్నాం. నడుస్తున్న రైళ్లు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పనులు చేయాల్సి వస్తోంది. ఈ స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఉంటాయి. రైల్వేస్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోందని కిషన్ రెడ్డి తెలిపారు. 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు కూడా ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే ఏడాది డిసెంబర్‌లోపు ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆధునిక సికింద్రాబాద్ స్టేషన్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాంఅని కిషన్‌రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పునర్నిర్మిస్తున్నట్లు కిషన్ రెడ్డి ప్రకటించారు. దక్షిణ భారత దేశంలోనే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని ఆయన పేర్కొంటూ.. అమృత్ భారత్ పథకం కింద రూ. 714 కోట్లతో ఈ స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నామని, ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం 1,97,000 మంది ప్రయాణికులు రోజువారీగా ఈ స్టేషన్‌కు వస్తున్నారని, ప్రతి గంటకు సుమారు 23 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ.. పనుల వేగం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నూతన నిర్మాణాలలో భాగంగా సౌత్ మెయిన్ బిల్డింగ్, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, ట్రావెలర్ తో కూడిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. సౌత్ సైడ్ బ్లాక్ నిర్మాణం రాబోయే నాలుగు నెలల్లో పూర్తి అవుతుందని, మొత్తం పునర్నిర్మాణ పనులను 13 నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ స్టేషన్‌ను 3 ఎకరాల విస్తీర్ణంలో 3 వేల మంది కూర్చునే విధంగా నిర్మిస్తున్నామని.. ఇది శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మాదిరిగా అత్యాధునికంగా ఉండనుందని ఆయన పేర్కొన్నారు. నవీకరించబడిన స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు అందుబాటులోకి రానున్నాయి. అంతేకాకుండా, రెండు సబ్ స్టేషన్లు, అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ సిస్టమ్, 5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఎలాంట్, 5 లక్షల లీటర్ల సీవేజ్ ట్రీట్‌మెంట్ ఎలాంట్ వంటి సదుపాయాలు ఉండనున్నాయి. రోజుకు 2,70,000 మంది ప్రయాణికులు వచ్చినా సేవలు అందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరించారు.

# జూబ్లీహిల్స్‌లో విచ్చలవిడిగా మద్యం..డబ్బుల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల కమిషన్‌ను కోరామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి డబ్బులు పంపిణీ చేయడంపై హైదరాబాద్ బీఆర్కే భవన్‌లో సీఈవో సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. కొంతమంది పోలీసులు, ఇతర అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారిపోయారని విమర్శించారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. అధికార పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా జూబ్లీహిల్స్ ఓటర్లు తెలివైన వారు అని.. తగిన రీతిలో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని అన్నారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న అన్ని విషయాలను ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలను ఈసీకి అందజేసి.. ఆయా బూత్‌ల్లో కేంద్ర బలగాలను పెట్టాలని కోరామన్నారు. ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లను నియమించి, లోపలికి వెళ్లే ఓటర్ల ఐడెంటిటీని గుర్తించాలని.. ఆ తర్వాతే వారిని పోలింగ్ బూత్‌లోకి అనుమతించాలని కోరామని తెలిపారు. ఓటర్ ఐడీ గుర్తించకుండా ఓటర్లను పోలింగ్ బూత్‌లకు పంపించకూడదని సూచించారు. మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఈసీని కోరామని హరీశ్‌రావు తెలిపారు.

# అందెశ్రీ మృతికి పవన్ కళ్యాణ్ సంతాపం

(మొదటి పేజీ తరువాయి)



జయ కేతనం' రచించి తెలంగాణ చరిత్రలో ఆయన చిరస్మరణీయంగా నిలిచారని కొనియాడారు. అందెశ్రీ మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అందెశ్రీ గారి ఆత్మకు శాంతి చేకూరా లని ప్రార్థించారు. అందెశ్రీ హఠాన్మరణం దిగ్భ్రాంతి కలిగించిందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఆయన రచనా ప్రస్థానం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకొంటుం దని తెలిపారు. గొర్రెల కాపరిగా, భవన నిర్మాణ కూలీగా జీవితం మొదలుపెట్టి అక్షర యాత్ర చేశారని అన్నారు.

# నేడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలింపు ప్రక్రియ మొదలైంది. సిబ్బందికి ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రిని అధికారులు పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం కల్లా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు తరలించనున్నారు. 3 వేల మంది పోలింగ్ సిబ్బంది, 2 వేల మంది పోలీసులతో కలిపి మొత్తం 5 వేల మంది పోలీసులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల విధుల్లో ఉన్నారు. మొత్తం 407 పోలింగ్ కేంద్రాల్లో 226 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. ఈసారి డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ జరుగనుంది. 103 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి.లయ్యాయి. సమస్యత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో భద్రత కట్టుదిట్టం చేయనున్నారు. 45 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 230 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశారు. ఎంసీసీ నిబంధనలు అతిక్రమించిన 27 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా.. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉపఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపినాథ్ భార్య మాగంటి సునీత బరిలో ఉండగా.. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పోటీలో ఉన్నారు.

# నేడు బీహార్‌లో రెండోదశ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే సిబ్బంది పోలింగ్‌కు అవసరమైన సామాగ్రితో సంబంధిత బూత్‌లకు చేరుకున్నారు.తొలి దశలో మాదిరిగా ఈ దిశలో కూడా నితీశ్ సర్కారులోని పలువురు మంత్రులు, ముఖ్య నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకో నున్నారు. ఈ ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్, ఎన్డీయే కూటమిల మధ్యనే ప్రధాన పోటీ నెలకొని ఉంది. వీరితోపాటు కొత్తగా ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ, లాలూ యాదవ్ పెద్దకుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ నేతృత్వంలోని జన్‌శక్తి జనతాదళ్ పార్టీ బరిలో నిలిచాయి.

# ఎర్రకోట వద్ద పేలుడు ఘటన

(మొదటి పేజీ తరువాయి)

ఆగిందని, ఆ వెంటనే పేలుడు సంభవించిందని తెలిపారు. పేలుడు ధాటికి పలు వాహనాలకు మంటలు అంటుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా.. మరికొంత మంది గాయపడినట్లు చెప్పారు. దేశ రాజధాని నగరం దిల్లీలో ఎర్రకోట సమీపంలోని ఓ కారులో జరిగిన పేలుడు ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన దిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. పేలుడు ఘటన వివరాలను అమిత్ షాకు కమిషనర్ వివరించారు. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌ను హోంమంత్రి ఆరా తీస్తున్నారు. మరోవైపు, ఈ ఘటన తీవ్ర బాధాకరమని కాంగ్రెస్ పేర్కొంది. దీనిపై సమగ్రమైన, వేగవంతమైన దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. మరోవైపు, ఈ దుర్ఘటనపై దిల్లీ మాజీ సీఎం, ఆప్ అధినేత అర్వింద్ కేజీవ్రాల్ స్పందించారు. పేలుడు జరిగి కొందరు మృతిచెందినట్లు వస్తున్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది చాలా బాధాకరమంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ పేలుడు ఎలా జరిగిందో, దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనేదానిపై పోలీసులు, ప్రభుత్వం వెంటనే దర్యాప్తు చేయాలని కోరారు.

# మరో పది కార్పోరేషన్లకు డైరెక్టర్లు

**• ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**

ఒక్కో కార్పొరేషన్‌కు దాదాపు 15 మంది చొప్పున డైరెక్టర్లను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. తెదేపాతోపాటు జనసేన, భాజపా నేతలకు కార్పొరేషన్ డైరెక్టర్లుగా ప్రాధాన్యత ఇచ్చిం ది. ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు, ఎస్సీ కమిషన్, మైనార్టీ కమిషన్, లేబర్ వెల్ఫేర్‌బోర్డు, కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కోమటి/కళింగ, వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డు, దాసరి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ, ముదలియర్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నాగవంశం వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్, సగర/ఉప్పర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం జాబితాను విడుదల చేసింది.

# విద్యారంగానికి పునాదులు వేసిన మౌలానా

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించుకుంటున్నామని చెప్పారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా, వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, 14 సంవత్సరాల్లోపు బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్య, వృత్తి శిక్షణలతో పాటు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటు వంటి విభిన్న విధానాలతో దేశంలో విద్యారంగాభివృద్ధికి ఆజాద్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. మౌలానా ఆజాద్ స్ఫూర్తితో విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. అందులో భాగంగానే గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేశామని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఉపాధ్యాయులు, లెకర్చర్ల నియామకంతో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పాటుపడుతున్నామని పేర్కొన్నారు. జాతీయోద్యమంలో పాల్గొనడంతో పాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించారని సీఎం కొనియాడారు.

# ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ తన పిటిషన్‌లో గుర్తుచేసింది. అక్టోబర్ 31వ తేదీ లోపు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించిందని తెలిపింది. అత్యున్నత స్థానం ఇచ్చిన గడువు ముగిసినప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొంది. దీంతో ఇంకా ఫిరాయింపు నేతలు ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నారని చెప్పింది. అందుకే మరోసారి అత్యున్నత స్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని చెప్పింది. ఈ విషయంలో ప్రొసీడింగ్స్ ఆలస్యం చేస్తే.. వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవచ్చని సుప్రీంకోర్టు గతంలోనే చెప్పిందని బీఆర్ఎస్ తెలిపింది. ఇంకా ప్రొసీడింగ్స్ ఎవిడెన్స్ స్టేజిలోనే ఉన్నాయని బీఆర్ఎస్ పార్టీ తరఫు న్యాయవాదులు తెలిపారు. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి రిటైర్ అయ్యేంతవరకు ఈ ప్రక్రియను సాగదీయాలని చూస్తున్నారని ఆరోపించారు.

## పోగొట్టుకున్న బాధితునికి తన చరవాణిని అప్పగిస్తున్న ఎస్ఐ బోరగాల అశోక్



**ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 10( పీపుల్స్ న్యూస్):** రెండు నెలల క్రితం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలోని మెట్టుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు యార రవికుమార్ తన చరవాణిని పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకొని మొగుళ్ళపల్లి పోలీసులను సంప్రదించాడు. కాగా ఎస్ఐ బోరగాల అశోక్ ఆదేశాల మేరకు సీఈఐఆర్ పోర్టల్ ఆపరేటర్ జ్యోతి చరవాణి యొక్క ఐఎంఈఐ నెంబర్ సహాయంతో ట్రేస్ చేసి చరవాణిని కనుగొన్నారు. కాగా మొగుళ్ళపల్లి ఎస్ఐ బోరగాల అశోక్ చరవాణిని పోగొట్టుకున్న కాంగ్రెస్ నాయకుడు యార రవికుమార్ ను సోమవారం పోలీస్ స్టేషన్ కు పిలిపించి..చరవాణిని తనకు అప్పగించారు. చాకచక్యంతో ట్రేస్ చేసి చరవాణిని కనుగొన్న సీఈఐఆర్ పోర్టల్ ఆపరేటర్ జ్యోతిని ఈ సందర్భంగా ఎస్ఐ బోరగాల అశోక్ అభినందించారు.

## చేప పిల్లలు నాణ్యత లేదని చెప్పి పంపించిన మత్స్య కారులు










**ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 10 ( పీపుల్స్ న్యూస్):**ములుగు జిల్లాలోని నాణ్యత లేని చేప పిల్లలు పంపిణీ పై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రభుత్వం 100% సబ్సిడీపై అందిస్తున్న చేప పిల్లలు చిన్న సైజులో నాణ్యత లేకుండా ఉన్నాయని రెండు నెలలు ఆలస్యంగా పంపించి పంపిణీ చేస్తారని మత్స్యకారులు ఆరోపించారు దీంతో చేప పిల్లలు లోడును వెనక్కి పంపించారు మత్స్యకార శాఖ ఈ విషయంలో విఫలమై విమర్శలు వెల్లువెత్తాయి

## ఎలుకల మందు తాగి మహిళా సూసైడ్



**ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 10 ( పీపుల్స్ న్యూస్):**ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నర్సాపూర్ గ్రామంలో సోమవారం వెలుకల మందు తాగి వివాహితీ ఆత్మహత్య చేసుకుంది భర్త అటికే పరమేష్ మూడువేలు ఆన్లైన్లో షాపింగ్ చేయగా భార్యా దివ్య అతని మందలించి అనంతరం భక్త పని నిమిత్తం బయటకు వెళ్ళగా దివ్య ఇంట్లో ఉన్న ఎలకల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది దీంతో గ్రామంలో విషాదం నెలకొంది

## స్వర్ణ జ్యోతి గ్రామైక సంఘం ఆద్వర్యం లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం.....





**ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 10 (పీపుల్స్ న్యూస్ ):**ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామంలో స్వర్ణ జ్యోతి గ్రామైక సంఘం ఆద్వర్యం లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను ప్రారంబించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిసి బీమా నాయక్,గ్రామ వివో లు బల్ల నాగరాణి, మంతెన రమ, మహిళా సంఘం అధ్యక్షులు బండి కోమల,కార్యదర్శి పోలుదాసరి లలిత,బుక్ కీపింగ్ బల్ల రాధిక, మహిళా సంఘం సభ్యులు ఇటికాల సుమలత, ఇటికాల సుకన్య, బండి నందిని,సాధ అనిత, రామగిరి శ్రావ్య మహిళా సంఘం సభ్యులు,రైతుల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది.నల్లగుంట గ్రామ మహిళా సంఘ సీసీ భీమా నాయక్ మాట్లాడుతూ రైతులందరూ మీరు పండించిన పంటను ప్రభుత్వ ఇచ్చే గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని మహిళా సంఘాలకు వరి ధాన్యం అమ్ముకొని లాభం పొందాలని కోరారు.దళారులను నమ్మి వరి ధాన్యం అమ్ముకొని మోసపోవద్దని తెలిపారు.ప్రతి రైతు సన్న వడ్ల కు ప్రభుత్వం ఇచ్చే బోనసును పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు మాజీ ఉప సర్పంచ్ భూక్యా శంకర్, మండల మధుకర్ రెడ్డి, పిన్ రెడ్డి భూమిరెడ్డి,పులి మధుసూదన్ రెడ్డి, పిన్ రెడ్డి రాజిరెడ్డి,బండి సాంబయ్య,పిన్ రెడ్డి సంజీవరెడ్డి,బల్ల చంద్రయ్య,సాద రమేష్, మెరుగు మల్లయ్య, హమాలి ఇతర రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అందేశ్రీ మరణం ఎంతో బాధాకరం

**-బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్**




**మొగుళ్ళ పల్లి ప్రతినిధి నవంబర్ 10 (పీపుల్స్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర గీతమైన "జయ జయహే తెలంగాణ" రచయిత అందెశ్రీ ఆకస్మిక మరణం ఎంతో బాధాకరమని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన రాసిన గీతం ప్రజలలో చైతన్యాన్ని రగిలించి, అందరినీ ఒక్కతాటి మీదకు తీసుకువచ్చిందన్నారు. ఆయన సాహితీ కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర గీతంగా "జయ జయహే తెలంగాణ" ప్రకటించిన రోజున అందెశ్రీ కళ్లలో కనిపించిన ఆనందం, ఉద్విగ్నత నేటికీ తారసపడుతోందన్నారు. సాహితీ వనంలో మహావటవృక్షం కూలిపోయినంత బాధ ఈ రోజు మనందరిదని, ఈ సందర్భంగా అందెశ్రీ కుటుంబ సభ్యులకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయనకు స్వర్గలోక ప్రాప్తిరస్తు కలగాలని ఆ భగవంతుణ్ని వేడుకుంటున్నట్టు మహేందర్ గౌడ్ తెలిపారు.

# సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించాలి

**పత్తి పంటను పాత పద్ధతుల్లో కొనుగోలు చేయాలి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు. ఎం నారాయణ ములుగు కలెక్టర్ గారికి వినతి పత్రం. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం.**






**ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 10( పీపుల్స్ న్యూస్):** ములుగు జిల్లాలో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో పాత పద్ధతిలో కొనుగోలు చేయాలని. ములుగు జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం.జరిగినది వినతి పత్రం అనంతరం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ములుగు జిల్లాలో తక్షణమే సిసిఐని ప్రారంభించాలని ములుగు జిల్లా రైతాంగమును పత్తి రైతులను వెంటనే ఆదుకోవాలని. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని తేమ శాతాన్ని 12 నుండి 20 శాతానికి పెంచాలని ఎల్ వన్ ఎల్ టు ఎల్ త్రీ పద్ధతిని రద్దు చేయాలని. కిసాన్ కాపాస్ యాప్ ను రద్దు చేయాలని. ఎకరానికి 12 కింటాల పత్తిని కొనుగోలు చేయాలని. కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం కావాలని పత్తి రైతులను నిండా దోపిడీ చేయడం కొరకు పత్తి పంటను అమెరిక నుండి దిగుమతి చేసుకొని 11% దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడం జరిగిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రైతాంగాన్ని అప్పుల పాలు చేసి. ఆత్మహత్యలు చేసుకునే విధంగా ప్రయత్నం చేస్తుందన్నారు. కావున ఇప్పటికైనా సిసిఐ కేంద్రాన్ని ప్రారంభించి రైతుల వద్ద పాత పద్ధతిలో కొనుగోలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసినారు ఈ సందర్భంగా వినతి పత్రం కలెక్టర్ కు ఇవ్వడం జరిగింది.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజాద్ పాషా. హనంకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎం రాజారాం ములుగు జిల్లా రైతు సంఘం నాయకులు సంపత్. సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే..రాజమార్గం

**-సమాజ శ్రేయస్సుకై..సత్వర న్యాయం**
**-15న నేషనల్ లోక్ అదాలత్**
**-సద్వినియోగం చేసుకోవాలని మొగుళ్ళపల్లి ఎస్ఐ బోరగాల అశోక్ పిలుపు**



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి నవంబర్,10 (పీపుల్స్ న్యూస్) :** రాజీమార్గమే రాజమార్గమని, సమాజ శ్రేయస్సుకై సత్వర న్యాయం జరగాలంటే ఈనెల 15న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టులో నిర్వహించబోయే నేషనల్ లోక్ అదాలత్ ను మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులకు సంబంధించిన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలని మొగుళ్లపల్లి ఎస్ఐ బోరగాల అశోక్ పిలుపునిచ్చారు. సోమవారం తన చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్ లో న్యాయ శాస్త్ర కోవిదులు, అధికార, అనధికార ప్రముఖుల సమక్షంలో..స్నేహపూరితమైన వాతావరణంలో. .ఉభయ పక్షాలకు ఆమోదయోగ్యమైన తీర్పు ద్వారా మీకు ఉండబడినటువంటి కేసులలో తుది పరిష్కారం పొందవచ్చన్నారు. వ్యయ ప్రయాసాలు లేని సత్వర న్యాయం పొందాలంటే లోక్ అదాలత్ వ్యవస్థను వినియోగించుకోవాలన్నారు. చిరకాలంగా కోర్టులందు అపరిష్కృతంగా నిలిచిపోయిన కేసులను తక్కువ వ్యవధిలో..ఖర్చు లేకుండా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. భార్యాభర్తల మధ్య గల వివాహ సంబంధమైన వివాదములు, మనోవర్తి, విడాకులు, అత్తింటి వారి ఆరాళ్ళ పిల్లల మనోవర్తి, అన్ని రకాల సివిల్ కేసులు, భూ వివాదాలు, చట్టరీత్యా రాజీకీ ఆమోదయోగ్యమైన అన్ని రకాల క్రిమినల్ కేసులు మరియు చెక్ బౌన్స్ మొదలైన కేసులను లోక్ అదాల ద్వారా..శాశ్వతమైన, అంగీకార యోగ్యమైన, సత్వర పరిష్కార మార్గాలను పొందవచ్చన్నారు. పలుమార్లు కోర్టుల చుట్టూ తిరగవలసిన పని లేకుండా సహృద్భావ వాతావరణంలో..అప్పీలు లేని, న్యాయబద్ధమైన అంతిమ తీర్పు పొందాలంటే..లోక్ అదాలత్ లను వినియోగించుకోవాలన్నారు. కలహించుకునే కక్షిదారులు..కదిలి వచ్చి..కలిసి పోవాలన్నారు. మొగుళ్లపల్లి మండలంలో ఎవరివైనా కేసులు కోర్టులో పెండింగ్ లో ఉంటే ఎస్ఐ బోరగాల అశోక్ ఫోన్ నెంబర్ 8712658126, కోర్టు కానిస్టేబుల్ సుమలత ఫోన్ నెంబర్ 9603396097, పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8712658147ల ద్వారా సంప్రదించాలని ఎస్ఐ కోరారు.


# రాష్ట్రంలో ధాన్యం రవాణా, దిగుమతిలో లేబర్ కొరత రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

**రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.**









**ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 10 (పీపుల్స్ న్యూస్):**సోమవారం డా బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి ధాన్యం, మొక్కజొన్న, సోయా, పత్తి కొనుగోళ్లపై అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార, మార్కెట్, రవాణా శాఖలు, పౌర సరఫరాల సంస్థ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కార్యదర్శి స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 8,452 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 6,838 కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. మిగిలిన 1,614 కేంద్రాలను అత్యవసరంగా ప్రారంభించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఏడాది 8 లక్షల 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందని పేర్కొన్నారు. రవాణా, గోదాముల నిర్వహణ, కార్మికుల లభ్యతలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ పంటల కొనుగోలులో నవంబర్, డిసెంబర్ ముఖ్యమని రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు ప్రక్రియ జరగాలని స్పష్టం చేశారు. మొంథా తుఫాను ప్రభావంతో 1.10 లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోయాయని, రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వారికి అన్ని విధాల అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. రైతుకు నష్టం లేకుండా, కొనుగోలు కేంద్రాల్లో తొందరగా, పారదర్శకంగా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌలు రైతులకు మ్యాపింగ్, ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేసి, క్లిష్టత లేకుండా సౌకర్యవంతంగా చేయాలని స్పష్టం చేశారు. సీఎస్ రామ కృష్ణారావు మాట్లాడుతూ రైతు కష్టానికి ఫలితం వచ్చే సమయని ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీగా కొనుగోలు చేయాలని సూచించారు. చెల్లింపులు త్వరగా జరగడానికి వీలుగా తక్షణమే ట్యాబ్ ఎంట్రీలు చేయాలని ఆదేశించారు. తుఫానుకు తడిసిన పంటలు కొనుగోలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామనిరైతులు తేమ శాతం తగ్గించుకొని కొనుగోలు కేంద్రాలకు వెళితే ఇబ్బందులు ఎదురవకుండా ఉంటుందని తెలిపారు. తడిచినకాటన్, సోయా కొనుగోలు చేయాలని సిసిఐ ని కోరుతామని తెలిపారు. రైతులకు సౌకర్యంగా ఉండే విధంగా కొనుగోలు కేంద్రాలకు దగ్గరలో మిల్లులు మ్యాపింగ్ చేయాలనీ 48 గంటలలో రైతులకు డబ్బు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.పాల్గొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, డి ఆర్ డి ఓ శ్రీనివాస్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి షా ఫైజల్ హుస్సేనీ, డీఎం రాంపతి, జిల్లా సహకార అధికారి సర్దార్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేపాకలో సాధనాశూరుల ప్రదర్శన..

**ప్రజలను ఆకట్టుకున్న విన్యాసాలు.**

**రేగొండ,నవంబర్ 10(పీపుల్స్ న్యూస్):**తెలంగాణలోని అరుదైన ఆశ్రిత కళాకారుల్లో ఒకరైన సాధనశూరులు సోమవారం రాత్రి రేపాక గ్రామంలో పద్మశాలి కుల సంఘం ఆధ్వర్యంలో ఇంద్రజాల ప్రధానమైన కళారూపాలను ప్రదర్శించారు. సాధనశూరులచే రేపాక గ్రామంలో ముఖ్య కూడలి వద్ద వారు ప్రదర్శించిన అన్యాసాలు ప్రజలను విశేషంగా సాధనశూరుల ప్రదర్శించిన విన్యాసాల్లో ఉన్నది లేనట్టు,లేనిది ఉన్నట్టు చూపి కండ్లముందే కనికట్టు చేయడమే వీరి ప్రత్యేకత. రాళ్లను దేవతామూర్తులుగా మార్చి,అవే విగ్రహాలను పసుపు బియ్యంగా, పులిహోరగా మార్చేయడంతో పాటు కాగితాలను,దారాలను కాల్చి తిరిగి సృష్టించడం, రెండు చేతులతో కర్రసాము చేయడం,గుండెలపై రాళ్లు పెట్టుకొని సుత్తితో పగలగొట్టించుకోవడం,తలపై పొయ్యి పెట్టి పూరీలు చేసుకొని తినటం,మంటలో సలసలా కాల్చిన ఇనుప వస్తువులను చేతితో పట్టుకోవడం వంటి ప్రదర్శనలను ప్రజల ముందే చేసి చూపించారు. రెండు గంటల పాటు సాగిన ఈ ప్రదర్శనను ప్రజలంతా ఆసక్తిగా చూస్తూ అవాక్కయ్యారు. తమకు వారసత్వంగా సంక్రమించిన కళ, కాలగర్భంలో కలిసిపోకుండా కాపాడుతున్నామని, దీనికి తెలుగు ప్రజలంతా అండగా ఉండాలని సాధనాశూరుల పెద్ద మనుషులు గంజి కృష్ణ,గంజి శ్రీహరి,గంజి శ్రీనివాస్,గంజి చక్రపాణిలు,గంజి రంజిత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పద్మశాలి కుల పెద్ద మనుషులు పోరండ్ల రాజయ్య,వెల్దండి యాదగిరి,మాజీ కుల పెద్ద మనుషులు వెంగల కుమార స్వామి,పోరండ్ల సమ్మయ్య తో పాటు పద్మశాలి కులస్తులు,గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుండా ఉంటే చర్యలు తప్పవు

### బాలానగర్ ఇంచార్జ్ డీసీపీ కోటి రెడ్డి.






**సైబరాబాద్, క్రైమ్ బ్యూరో, నవంబర్ 10 , (పీపుల్స్ న్యూస్ ) :** రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని బాలానగర్ ఇంచార్జ్ డీసీపీ కోటి రెడ్డి హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇటీవల జగద్గిరిగుట్టలో రౌడీషీటర్ దారుణ హత్య దృశ్య సైబరాబాద్ సిపి అవినాష్ మొహంతి ఆదేశాల మేరకు నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా బాలానగర్ ఇంచార్జ్ డీసీపీ కోటి రెడ్డి, బాలానగర్ డివిజన్ పరిధిలోని సుమారు 20 మంది యాక్టీవ్ రౌడీ షీటర్లకు బాలానగర్ ఏసీపీ కార్యాలయంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలానగర్ ఇంచార్జ్ డీసీపీ కోటి రెడ్డి మాట్లాడుతూ రౌడీ షీటర్లు అల్లర్లు, అలజడులకు పాల్పడితే సిపి అవినాష్ మొహంతి సూచనల మేరకు చట్టపరమైన చర్యలు నగర బహిష్కరణ, పీడీ యాక్ట్ నమోదు చేయటంతోపాటు, బైండోవర్ చేయనున్నట్టు, పాత నేరాలలో పొందిన బెయిల్ ను రద్దుచేయనున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మంచి ప్రవర్తనతో ఉంటే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని, దానితో పాటు సమాజంలో గుర్తింపు పెరుగుతుందని సూచించారు. రౌడీ షీటర్లు అల్లర్లు, అలజడులకు, నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. చెడు నడత కలిగిన రౌడీ షీటర్లపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. రౌడీ షీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత స్టేషన్లలో సంతకాలు చేస్తూ ఉండాలన్నారు. బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా 20 మంది రౌడీ షీటర్లను డీసీపీ కోటి రెడ్డి ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. అనంతరం బాండ్ పేపర్‌పై రౌడీ షీటర్ల చట్ట వ్యతిరేక పనులు చర్యలు చేపట్టబోమని లిఖిత పూర్వకంగా హామీ తీసుకొని, రు. 2 లక్షల సొంతపూచి కత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, జగద్గిరిగుట్ట సీఐ వెంకటేశం, జీడిమెట్ల డిఎస్ఐ శ్యామ్ బాబు తదితరులు పాల్గొన్నారు

## మహిళల, చిన్నారుల భద్రత విషయంలో రాజీపడేదే లేదు

### -హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్.







**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో, నవంబర్ 10, (పీపుల్స్ న్యూస్ )** మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో రాజీపడేదే లేదని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని ఐసీసీసీ ఆడిటోరియంలో సోమవారం మహిళా భద్రత విభాగం పనితీరుపై సీపీ వీసీ సజ్జనర్, సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళల భద్రత, రక్షణ అనేది సామాజిక బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. ఆ విభాగంలోని మహిళా పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులను ఆరా తీశారు. షీటీమ్స్, భరోసా, యాంటీ హుమన్ ట్రాఫికింగ్, జువైనల్, తదితర విభాగాల పోలీస్ అధికారులతో మాట్లాడి.. వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళా భద్రత విషయంలో వ్యవహారించాల్సిన తీరుపై దిశానిర్దేశం చేశారు. మహిళలు బాధతో పోలీస్ స్టేషన్లకు వస్తారని, వారితో మానవత దృక్పథం వ్యవహారించాలని సూచించారు. అన్యాయం జరిగిందని వచ్చే బాధిత మహిళకు తాము అండగా ఉన్నామనే భరోసా కల్పించాలన్నారు. కేవలం కేసులు నమోదు చేసి వదిలేయొద్దని, సమగ్రంగా దర్యాప్తు చేయాలన్నారు. పోక్సో, అత్యాచార కేసుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళా భద్రతపై అవగాహన కల్పించాలని, చిన్నపిల్లలకు గుడ్ టచ్ %-% బ్యాడ్ టచ్, స్వీయరక్షణ విషయాలు నేర్పాలని సూచించారు. ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ అప్పుడే కాకుండా మిగతా సమయాల్లోనూ వీధి బాలలు, వెట్టిచాకిరి, పరిశ్నమల్లో మగ్గుతున్న బాలకార్మికులను రక్షించాలని ఆదేశించారు. ఆడపిల్లల జోలికి వస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, నిందితులపై హిస్టరీ షీట్స్ తెరుస్తామని హెచ్చరించారు. వారికి పాస్‌పోర్ట్ మంజూరు కాదని, ప్రభుత్వ ఉద్యోగాలు రావని స్పష్టం చేశారు.

## ఇంద్రమ్మ పథకానికి నోచుకోని గాంధీ నగర్

### రెండవ విడతలోనైనా అర్హులకు ఇల్లు అందేనా.?



**రేగొండ,నవంబర్ 10(పీపుల్స్ న్యూస్):**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంద్రమ్మ ఇళ్ల పథకంలో అర్హులకు మొదటి విడత లో ఇల్లులు మంజూరు అవుతున్న...అర్హులు ఉన్న గాంధీనగర్ గ్రామంలో ఏ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందక రెండవ జాబితా కోసం అర్హులైన వారు ఎదురుచూస్తున్నారు. భూపాలపల్లి నియోజకవర్గం లోని నూతన గోరి కొత్తపల్లి మండలం గాంధీనగర్ గ్రామంలో మొదటి విడత జాబితాలో ఏ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు నోచుకోలేదని అర్హులైన వారు వాపోతున్నారు. మండలంలోని గాంధీనగర్ చిన్న గ్రామపంచాయతీ గా గత ఐదేళ్ల కింద రూపుదిద్దుకోగా గ్రామం అభివృద్ధిలో వెనుకబడి పోవడంతో పాటు ప్రభుత్వ పథకాలు అందకా, ఈ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నైనా అర్హులైన వారికి ఇల్లు మంజూరు అవుతుందని ఆశగా ఎదురుచూసిన వారికి నిరాశ మిగిలిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గాంధీనగర్ గ్రామంలో 100 కుటుంబాలు ఉండగా, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన వారు సుమారు 20 నుంచి 30 వరకు గ్రామంలో పూరి గుడిసెల్లో కుటుంబాలను వెల్లదీసుకుంటున్నారు. అర్హులైన వారికి మొదటి జాబితాలో ఎవరికి రాకపోవడంతో గాంధీనగర్ గ్రామంలో అధికార పార్టీ కార్యకర్తలు, నిరుపేదలు ఇల్లు మంజూరు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. గాంధీనగర్ గ్రామంలో అధికార పార్టీకి చెందిన బొజ్జం లక్ష్మణ్-లత దంపతులు ఇంద్రమ్మ ఇల్లు తప్పకుండా వస్తుందని ఆశతో పూరి గుడిసెల్లోనే కాపురం ఉంటున్నారు.కాగా వారికి ఒక కొడుకు (రెహమాన్) ఒక బిడ్డ (హారిక) ఉన్న నేపథ్యంలో చిన్నపాటి రేకుల షెడ్డు లో జీవనం సాగిస్తూ ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గాంధీనగర్ అభివృద్ధికి పలు పథకాలను ప్రారంభించారని, అర్హులైన వారికి ఇంద్రమ్మ ఇళ్ల పథకంలో ఇల్లు మంజూరు అయ్యేలా చూడాలని అర్హులైన గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం/ నవంబర్ -10( పీపుల్స్ న్యూస్ ):**ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.నేలకొండపల్లి మండలం గువ్వల గూడెం గ్రామానికి చెందిన అమరనేని అప్పయ్య, తన కుమారుల నుండి మనోవర్తి కోరుతూ దరఖాస్తు చేయగా, జిల్లా సంక్షేమ అధికారికి తగు చర్యల కై కలెక్టర్ ఆదేశించారు.స్థానిక పంపింగ్ వెల్ రోడ్ నుండి కొండి రేఖ, తాను ఇంటర్ చదివి, కంప్యూటర్ కోర్సు చేసినట్లు, అవుట్ సోర్సింగ్ లో ఏదేని ఉద్యోగం ఇప్పించగలరని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం డిఆర్డీవో, పిడి మెప్మా, జిల్లా ఉపాధి అధికారులకు తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఏన్కూరు మండలం, ఏన్కూరు గ్రామానికి చెందిన నున్నా సావిత్రి, తన భర్త నున్నా వెంకయ్య పేర ఉన్నటువంటి వ్యవసాయ భూమిని తనకు తెలియకుండా ఇతరుల పేర పట్టా చేశారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు భూమి అప్పగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్‌కు రాస్తూ నిబంధన ప్రకారం తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మధిర మండలం నాగవరప్పాడు కు చెందిన వాడకుప్పలా నాగార్జున రావు, తన పొలం సర్వే పూర్తి చేసి, సరిహద్దులను గుర్తించారని, గట్టురాళ్లను వేయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మధిర తహసీల్దార్ కు రాస్తూ తగుచర్యకు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలోడిఆర్ఓఏ. పద్మశ్రీ, డి.ఆర్.డి.ఓ. ఎన్. సన్యాసయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పుల్లూరి బాబురావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

### 50 మంది యువకులు బ్లడ్ డొనేట్..



**రేగొండ,నవంబర10(పీపుల్స్ న్యూస్) ::**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గత సంవత్సరం ఎమ్మెల్యే గండ్ర పై ఉన్న అభిమానంతో రేగొండ మండలం రంగయ్యపల్లి గ్రామానికి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పుల్లూరి బాబురావు నేతృత్వంలో మండల కేంద్రంలోని గుడ్ లైఫ్ స్కూల్ ఆవరణంలో జన్మదిన వేడుకలతో పాటు, తన స్వంత నిధులతో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పుల్లూరి బాబురావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు నిర్వహించారు. రక్తదాన శిబిరంలో పార్టీ యువ నాయకులతోపాటు స్వచ్ఛందంగా యువత ముందుకు వచ్చి 50 మంది బ్లడ్ డొనేట్ చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని పుల్లూరి బాబురావు ప్రారంభించారు.ముందుగా ఎమ్మెల్యే గండ్ర బర్తే కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరంలో మండలంలోని సుమారు 50 మంది రక్తదానం చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 100 పడకల హాస్పిటల్ సిబ్బంది రక్తదాన శిబిరంలో రక్తాన్ని సేకరించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని హిమబిందు వైద్య శిబిరంలో సిబ్బందితో కలిసి సేవలందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పుల్లూరి బాబురావు మాట్లాడుతూ.. రక్తదానం వలన ఆపదలో ఉన్న మరో మనిషికి రక్తంతో ప్రాణం పోసిన వారం అవుతామని ఆయన అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పూర్తి చేస్తున్నారని అన్నారు. నిరుపేదల కోసం నిరంతరం కష్టపడి పనిచేసే మనస్తత్వం వల్ల గండ్ర సత్యనారాయణ రావు ఈ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజల ఆశీస్సులు పొంది నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇప్పకాల నరసయ్య, సూధన బొయిన ఓం ప్రకాష్, ఎస్ ఎస్ ఆర్ సంస్థల చైర్మన్ రాష్ట్ర నాయకులు నాయినేని సంపత్ రావు పి ఎస్ సి ఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, కోటంచ ఆలయ చైర్మన్ ముల్కనూరు బిక్షపతి, జిల్లా సీనియర్ నాయకులు మోడం ఉమేష్ గౌడ్ మాజీ ఎంపీపీ, పున్నం లక్ష్మీ రవి, మాజీ జెడ్పిటిసి పత్తి ప్రభాకర్, ఎర్రబెల్లి రవీందర్ రావు, మాజీ ఎంపీటీసీ పట్టెం శంకర్ , బల్గురి రాజు, చిగురు మామిడి కుమారస్వామి, మటిక సంతోష్, పాతపెల్లి సంతోష్, ఉపసర్పంచి రాజు మాజీ ఎస్ఆర్ఎస్పి చైర్మన్ నడిపెల్లి వెంకట్రావు, పొనగంటి వీరబ్రహ్మం, మేకల రవికుమార్, బండారి దేవేందర్, మేకల బిక్షపతి, మైస బిక్షపతి, టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, కోలేపాక సాంబయ్య మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు మహమ్మద్ సాబీర్, ఎస్టీ సెల్ నాయకులు బానోతు రవీందర్, బొజ్జం రవి యూత్ అధ్యక్షులు కోయిల క్రాంతి, గండి తిరుపతి గౌడ్, రంగయ్య పల్లె గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్ ముదురు కొల్ల తరుణ్, కొమ్రరాజు భాస్కర్, పున్నం సాయి, మేకల శివ, చిలువేరు విష్ణు, పున్నం ప్రవీణ్ బోయిని తిరుపతి అచ్చ దేవేందర్ జూపాక అశోక్ తదితరులు యూత్ నాయకులు పాల్గొన్నారు.

## అస్మిత లీగ్ అథ్లెటిక్స్ ఎంపికలు..

### అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూతల సమ్మయ్య.





**రేగొండ,నవంబర్ 10( పీపుల్స్ న్యూస్):**భూపాలపల్లి జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను బయటికి తీయడమే లక్ష్యంగా అస్మిత లీగ్ అథ్లెటిక్స్ ఎంపికలను నిర్వహించామని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూతల సమ్మయ్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సింగరేణి అంబేద్కర్ స్టేడియంలో అండర్ 14 అండర్ 16 బాలికలకు అథ్లెటిక్స్ పోటీల ఎంపికలను అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ చూద్దాం సాంబమూర్తి బండి ప్రసాద్ గౌడ్ గాజర్ల శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించామని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూతల సమ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్నటువంటి క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసి వారికి అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా శిక్షణను అందించాలని సింగరేణి అంబేద్కర్ స్టేడియంలో ఉత్సాహంగా క్రీడా ఎంపికలు చేపట్టమన్నారు. అథ్లెటిక్స్ ఎంపిక కోసం జిల్లా నలుమూలల నుండి 200 మంది బాలికలు క్రీడా ఎంపికల్లో పాల్గొన్నారని సమ్మయ్య తెలిపారు.ఈ యొక్క క్రీడా ఎంపికలకు అబ్జర్వర్లుగా నాగరాజు, విద్యాసాగర్ హాజరయ్యారు. ఈ ఎంపిక ప్రక్రియ కార్యక్రమంలో భూపాలపల్లి ఎస్సై రవళి రెడ్డి, జిల్లా డివైస్ ఓ చిర్రా రఘు పాల్గొని జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ సూదం సాంబమూర్తి బండి ప్రసాద్ కొత్తపల్లి సారంగపాణి గాజర్ల శ్రీనివాస్ ఫిజికల్ డైరెక్టర్లు విజయలక్ష్మి పూర్ణిమ, శ్రీ విద్యా గౌతమి, రవికుమార్ విజయలక్ష్మి పూర్ణిమ శ్రీ విద్యా గౌతమి రవికుమార్ కోతులు రఘువీర్ సంతోష్ లక్ష్మణ్ మేడిపల్లి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్మెంట్ ఆకస్మిక తనిఖీ

**హైదరాబాద్ , క్రైమ్ బ్యూరో, నవంబర్ 10 , (పీపుల్స్ న్యూస్ ) :** సీఎంఆర్ ధాన్యం మళ్లింపు గురించి సమాచారం అందిన వెంటనే, ఆర్సీ పురం యూనిట్‌కు చెందిన అధికారులు పౌర సరఫరాల శాఖతో కలిసి సంగారెడ్డి జిల్లా, పుల్కల్ మండలం, ముదిమాణిక్ (గ్రామం) లోని మెస్సర్స్ విజయ దుర్గ ఆగ్రో ఇండస్ట్రీస్ వద్ద ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో, 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి సుమారు 5,536.800 క్వింటాళ్ల సీఎంఆర్ ధాన్యం (13,842 బస్తాలు) నిల్వ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ రూ. 1,28,45,376 లు ఉంటుందని, మిల్లర్‌పై తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా పౌర సరఫరాల శాఖకు వినతి పత్రం ఇవ్వబడింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్మెంట్ శాఖ ప్రభుత్వ ఆదాయం లీక్ అవ్వకుండా, ప్రభుత్వ నిధులు , సహజ వనరుల దుర్వినియోగాన్ని నిరోధించడానికి కట్టుబడి ఉందని విజిలెన్స్ %d% ఎన్‌ఫోర్స్మెంట్ అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిధులు లేదా వనరుల దుర్వినియోగం లేదా ఏదైనా అక్రమాల గురించి ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 14432 కు సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు



# తిరుమల లడ్డులో నకిలీ నెయ్యి వాడకం పై లంకా దినకర్ సంచలన వ్యాఖ్యలు



**అమరావతి, నవంబర్ 10:** తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు తయారీలో నకిలీ నెయ్యిని వాడటం అనేది క్షమించరాని నేరమని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మెన్ లంకా దినకర్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. వేంకటేశ్వర స్వామి వారి ఆధ్యాత్మికతకు భంగం కలిగించిన వారికి ఏం శిక్ష పడుతుందో చరిత్ర తెలిపిందన్నారు. 2019 నుంచి 2024 మధ్య తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్యాత్మిక విలువలను చెడగొట్టారని విమర్శించారు.టీటీడీని ఆధ్యాత్మిక కేంద్రంగా కాకుండా వారి సహచరులకు ఆదాయ వనరులుగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పరిగణించిందని వ్యాఖ్యలు చేశారు. సీబీఐ విచారణలో నిర్ఘాంతపోయే విధంగా నకిలీ నెయ్యి సప్లై పైన నిజాలు బయటకు వచ్చాయన్నారు. 2019 – 24 మధ్య బోలే బాబా ఆర్గానిక్ డైరీ వారు 68 లక్షల కేజీల నెయ్యిని తిరుమల తిరుపతి దేవస్థానానికి సప్లై చేశారని.. ఈ సంస్థ పాలు కానీ వెన్న కానీ ఒక్క చుక్క కూడా ఎక్కడి నుంచి కూడా సేకరించలేదని తేలిందన్నారు.నకిలీ నెయ్యి తయారు చేయటానికి వాడినటువంటి రసాయనాలు సప్లై చేసిన కంపెనీ వివరాలను సీబీఐ రాబట్టిందని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం నియమించిన టీటీడీ బోర్డు అనేక అక్రమాలకు పాల్పడిన ప్రతి సందర్భంలో వాస్తవాన్ని పదేపదే తాము వచ్చామని.. కానీ నాటి ప్రభుత్వం పట్టించుకోలేదని లంకా దినకర్ విమర్శలు గుప్పించారు.

# విశాఖలో పెట్టుబడుల సదస్సు తొలిరోజు చర్చించే అంశాలివే



**అమరావతి, నవంబర్ 10:** విశాఖలో ఈనెల 14, 15 తేదీలలో జరిగే 30వ పార్టనర్ షిప్ సమ్మిట్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. పార్టనర్ షిప్ సమ్మిట్‌పై (సోమవారం) ఏపీ కేబినెట్ సమావేశంలోనూ చర్చకు వచ్చింది. ఈనెల 14న తొలిరోజు ఓపెనింగ్ ప్లీనరీతో సదస్సు ప్రారంభంకానుంది. ఓపెనింగ్ ప్లీనరీలో తీవ్రమైన ప్రతికూల పరిస్థితులు, ఆర్థిక మందగమనం ఉన్నప్పటికీ భారత్ 65 శాతం వృద్ధి రేటును సాధించిన అంశంపై చర్చ జరుగనుంది.రెండు రోజుల పాటు జరిగే సదస్సులో కేంద్రం ప్రభుత్వం నుంచి మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, అశ్విని వైష్ణవ్, అన్నపూర్ణాదేవి, జితేంద్ర సింగ్‌లు హాజరు కానున్నారు. అలాగే ఈ సదస్సుకు 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన 8 మంది స్పీకర్‌లు ఈ సదస్సులో పాల్గొంటారు. పార్టనర్ షిప్ సమ్మిట్‌లో ఒక ప్లీనరీ సెషన్, సీఐఐ ద్వారా జరిగే టెక్నికల్ సెషన్లు 27, రాష్ట్ర స్థాయిలో సీఐఐతో కలిసి సంయుక్తంగా 11 సెషన్‌లు జరుగనున్నాయి.దేశీయ అంశాలతో 5 సెషన్‌లు, ఒక వీడ్కోలు సెషన్‌లతో సదస్సుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సదస్సు ద్వారా 9 లక్షల 76 వేల 248 కోట్లు పెట్టుబడులు వస్తాయని అంచనా వేయగా.. దాదాపు 7 లక్షల 48వేల 427 మందికి ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది. ఈ సదస్సులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 30 ప్రారంభించనుండగా, 82 ప్రాజెక్టులకు శంఖుస్థాపనకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

# జగన్ అక్రమాస్తుల కేసు కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐ కోర్టు ఆదేశం



**అమరావతి, నవంబర్ 10:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో వ్యక్తి గత హాజరుపై హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్ వెస్టిగేషన్ కి న్యాయస్థానం ఆదేశించింది. ఈనెల 14 లోపు వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని గతంలో జగన్ ను సీబీఐ కోర్టు ఆదేశించింది. న్యాయస్థానం ఇచ్చిన గడువు సమీపిస్తుండడంతో కోర్టులో ఇటీవల జగన్ మెమో దాఖలు చేశారు. వ్యక్తిగత హాజరు మినహాయించాలని పిటిషన్ లో పేర్కొన్నారు. కోర్టు అనుమతిస్తే తాను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని చెప్పారు. జగన్ దాఖలు మెమోపై సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

# ఏపీ, రాజస్థాన్ ప్రమాదాలను సుమోటోగా స్వీకరించిన సుప్రీం



**అమరావతి, నవంబరు10 :** ఇటీవల ఆంధ్రప్రదేశ్, ఏపీలో ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదంలో ఈ ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏపీలో బస్సు దహనమై మరో 19 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. రెండు ఘటనలను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. జస్టిస్ జేకే మహేశ్వరి, విజయ్ విష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం జాతీయ రహదారుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. రాజస్థాన్‌లోని జాతీయ రహదారులపై ఉన్న ధాబాలు, ఇతర సంస్థల సంఖ్యను వివరిస్తూ రెండువారాల్లోగా వివరణాత్మక స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ని ఆదేశించింది. రహదారి పరిస్థితులపై నివేదికను కూడా ఇవ్వాలని చెప్పిందిఈ కేసులో సీనియర్ న్యాయవాది ఏఎస్ నాదకర్ణిని అమికస్ క్యూరీగా నియమించిన ధర్మాసనం.. స్టేటస్ నివేదికను దాఖలు చేయడానికి రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని పార్టీగా చేర్చాలని ఆదేశించింది. రాజస్థాన్ ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు అడ్వకేట్ జనరల్ శివ్ మంగళ్ శర్మ.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కోర్టుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అలాగే, కర్నూలు రోరడ్డు ప్రమాదాన్ని సైతం కోర్టు పరిగణలోకి తీసుకుంది. జాతీయ రహదారి భద్రత, రోడ్డు పక్కన ఉన్న నిర్మాణాల నియంత్రణ కోసం సమన్వయ విధానం అవలంభించడానికి ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని పార్టీగా చేయాలని ఆదేశించింది.దేశంలో రోడ్డు ప్రమాదాలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి.

# రాచకొండ కమిషనరేట్ పరిధిలోని సిటీ ట్రైనింగ్ సెంటర్ కు శంఖుస్థాపన




**రాచకొండ : క్రైమ్ బ్యూరో, నవంబర్ 10, (పీపుల్స్ న్యూస్)** నేరస్తులు సాంకేతికతో కూడిన వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్నందున పోలీసు సిబ్బందికి తదనుగుణంగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లిలో నిర్మించనున్న సిటీ ట్రైనింగ్ సెంటర్ (సిటిసి) కు సోమవారం శంఖుస్థాపన చేశారు. అదేవిధంగా కమిషనరేట్ పరిధిలోని సరూర్ నగర్ లో భరోసా, కమాండ్ కంట్రోల్ సెంటర్ నూతన భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, కమిషనరేట్ పోలీస్ పరిధిలోని డిసిపిలు ఇతర పోలీసు అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా మేడిపల్లిలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులతో సిటీ ట్రైనింగ్ సెంటర్ ను నిర్మించడానికి ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీంతోపాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి పోలీసు సిబ్బంది పిల్లల కోసం మంజూరు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణానికి సిఎస్ఆర్ పథకం ద్వారా సహాయం చేస్తామని హామీ ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్లో పోలీస్ సిబ్బంది పిల్లలతో పాటు ఇతరులకు కూడా 50% సీట్లను కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించినట్లు డిజిపి తెలిపారు. సిటీ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణంతో పోలీస్ సిబ్బంది కోసం వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలను నిర్వహించే అవకాశం ఉందని అన్నారు.. దీనికోసం, జిల్లాలోనూ శిక్షణ కేంద్రాలను నిర్మిస్తున్నామన్నారు. సైబర్ క్రైమ్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోను బలోపేతం చేసి ,వారికి అవసరమైన సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తీవ్రమైన విషయంగా పరిగణించాలన్నారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ వంటి బాధ్యతాయుతమైన డ్రైవింగ్ వాహనదారులు చేయాలని దానికి అవసరమైన కనీస పద్ధతులను పాటించాలని హితువు చెప్పారు. "అర్రైవ్, అలైవ్ " పేరుతో వచ్చే డిసెంబర్ లో వాహనదారులకు, డ్రైవర్లకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నామని, దాని కోసం అన్ని వర్గాలవారు ముందుకు రావాలని డిజిపి కోరారు. ఈ రకమైన రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం పోలీసు బాధ్యత అని అనుకోకుండా, ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే వాటి గురించి చింతించడం తగదని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో రోడ్డు ప్రమాదంలో జరగకుండా బేసిక్ పద్ధతులు పాటించాల్సి ఉందని, ఈ దిశగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంలో స్వచ్ఛంద సంస్థలు, అన్ని వర్గాల వారు తమ వంతు పాత్రను పోషించాల్సిన ఆవశ్యకత ఉందని డిజిపి వివరించారు. రాచకొండ కమిషనరేట్ నూతన భవనం కోసం దాదాపు 50 ఎకరాలకు పైగా భూమిని ప్రభుత్వం కేటాయించేందుకు మాజీ శాసనసభ్యులు ఎం .సుధీర్ రెడ్డి కృషి చేసినందుకు ఆయనకు డిజిపి కృతజ్ఞతలు తెలియజేశారు. రాచకొండ పోలీస్ కమిషనర్ శ్రీ సుధీర్ బాబు మాట్లాడుతూ... మేడిపల్లి లో సిటీ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణానికి దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ ఎం.డి. డాక్టర్ డివి మురళి కృష్ణ ప్రసాద్ ముందుకు రావడం పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. మంచి వాతావరణం లో పోలీస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను అందించేందుకు సిటిసి ఉపయోగపడుతుందని అన్నారు. దివీస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డి.మధుబాబు, సంస్థ జీయం శ్రీ సుబ్బారావు లు మాట్లాడుతూ... పోలీస్ శాఖకు అవసరమైన సహాయం చేసేందుకు సిఎస్ఆర్ పథకంతో సంబంధం లేకుండా చేయూత అందిస్తామని వెల్లడించారు. రాచకొండ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధి గగన్ దీప్ రాచకొండ కమిషనర్ పరిధిలోని డిసిపిలు, అడిషనల్ డిసిపిలు తదితర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళల భద్రత కోసమే భరోసా కేంద్రాల ఏర్పాటు: డిజిపి మహిళల భద్రత కోసం భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర డిజిపి శ్రీ బి.శివధర్ రెడ్డి తెలిపారు. రాచకొండ పరిధిలోని సరూర్ నగర్ ప్రాంతంలో నిర్మించిన భరోసా, విమెన్ సేఫ్టీ కేంద్రాన్ని సోమవారం నాడు డిజిపి ప్రారంభించారు. మహిళా బాధితులకు పూర్తి రక్షణ కల్పించడంతోపాటు , చట్టం ప్రకారం అన్ని రకాల కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు భరోసా కేంద్రాలను సంప్రదించవచ్చు అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు , తెలంగాణ పోలీస్ హౌసింగ్ ఇన్ఫ్రాటిక్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ కార్ప్ లిమిటెడ్ ఎం.డి ఎం రమేష్ , రాచకొండ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డిసిపి టి .ఉషారాణి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు సీపీ(క్రైమ్స్) శ్రీనివాస్ గారు, డీసీపీ(మహిళా భద్రత) లావణ్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.

















హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# అసోంలో బహుభార్యత్వం నిషేధ బిల్లు- దోషులకు ఏడేళ్ల జైలు శిక్ష



**అసోం:** బహుభార్యత్వం నిషేధం దిశగా అసోం అడుగులు వేస్తోంది. దీనికి సంబంధించిన బిల్లును ఈనెల 25న అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని అసోం ముఖ్యమంత్రి బిశ్వశర్వ వెల్లడించారు. ఇది అమల్లోకి వస్తే సంబంధిత కేసుల్లో దోషిగా తేలినవారికి ఏడేళ్లపాటు కఠిన కారాగార శిక్ష ఉంటుందని చెప్పారు. కొత్తగా నిధిని ఏర్పాటు చేసి బాధిత మహిళలకు పరిహారం అందజేస్తామని ఓ మీడియా సమావేశంలో చెప్పారు. అయితే, ఆరో షెడ్యూల్‌లోని ప్రాంతాలకు కొన్ని మినహాయింపులు ఉంటాయన్నారు.'జీవిత భాగస్వామి జీవించి ఉన్నప్పుడు లేదా చట్టపరంగా విడాకులు పొందకుండా మరోసారి వివాహం చేసుకున్నవారిపై ఈ చట్టం వర్తిస్తుంది.ఇలాంటి అక్రమ బహుభార్య వివాహం చేసిన వారికి గరిష్ఠంగా 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించే నిబంధన ఉంటుంది.అదనంగా, ఈ బిల్లు ద్వారా బాధిత మహిళలకు పరిహారం అందించే నిబంధనను కూడా ఉంది. ఇలాంటి వివాహాల వల్ల మహిళలు ఎదుర్కొంటున్న బాధను దృష్టిలో ఉంచుకొని సమాజాన్ని శాస్త్రీయంగా నియంత్రించడమే ఈ చట్టం లక్ష్యం.ఈ బిల్లును నవంబర్ 25న జరిగే అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదం పొందుతాం'అని ఆయన అన్నారు.లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా నూతన బిల్లును తీసుకురానున్నట్లు ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వెల్లడించారు. ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో చారిత్రక బిల్లులను ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. లవ్ జిహాద్, బహుభార్యత్వం, సత్రాల రక్షణ లాంటి కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయని చెప్పారు. ఈ బిల్లులను సభలో పెట్టి చర్చిస్తామని, డ్రాఫ్ట్ బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలిపాక మీడియాకు వివరిస్తామని పేర్కొన్నారు. జిహాద్?కు పాల్పడిన వారికి జీవిత ఖైదు విధించే చట్టాలను తీసుకువస్తున్నట్లు గతేడాది సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. బలవంతపు మత మార్పిళ్ల ద్వారా వివాహం చేసుకోవడాన్ని అడ్డుకునేందుకు చట్టాలు అవసరమని చెప్పారు. కాగా ఇప్పటికే బహుభార్యత్వంపై అసోం ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ అనుమతి లేకుండా ఉద్యోగులు రెండో పెళ్లి చేసుకోకూడదని స్పష్టం చేసింది. ఇది సర్వీస్ నిబంధనలకు వ్యతిరేకమని పేర్కొంది. కొన్ని మతాలు రెండో పెళ్లికి అనుమతి ఇస్తాయని, అయినా సరే ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని వివరించింది. అంతకుముందు చట్ట వ్యతిరేకంగా బాల్య వివాహాలు చేసుకున్న వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంది అసోం ప్రభుత్వం. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఆధారం గా దాదాపు 3వేల మందికి పైగా అరెస్టు చేసింది.మారుమూల ప్రాంతాల్లో అభద్రతతో జీవిస్తున్న స్థానికులకు ఆయుధ లైసెన్సులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు హిమంత బిశ్వ శర్మ తెలిపారు. లైసెన్సల జారీ ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించారు. ముప్పు ఉన్న, మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల నుంచి వచ్చిన డిమాండ్‌ను సమీక్షించిన అనంతరం రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం హిమంత బిశ్వ శర్మ చెప్పారు.

# ఆ రాష్ట్రంలోని ప్రతి స్కూల్లో ఇకపై వందేమాతరం పాడాల్సిందే



**ఉత్తర్ ప్రదేశ్:** ఉత్తర్ ప్రదేశ్‌లో యోగి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో ఇకమీదట వందే మాతరం గేయాన్ని తప్పనిసరిగా ఆలపించాలని సీఎం యోగి ఆదిత్యనా థ్‌సోమవారం తెలిపారు. ఈ మేరకు గోరఖ్‌పుర్‌లో 'ఏక్తా యాత్ర'పేరిట నిర్వహించిన సామూహిక వందేమాతరం కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఇలా ప్రతీ పాఠశాలలో జాతీయ గేయాన్ని పాడటం ద్వారా.. పిల్లలకు చిన్ననాటి నుంచే దేశభక్తితో పాటు జాతీయ గేయంపై గౌరవ భావం వంటివి అలవడతాయన్నారు.కొత్త జిన్నాలకు తెరలేవకుండా.వందేమాతరంను వ్యతిరేకించే వారు దేశ ఐక్యత, సమగ్రతను అవమానించినట్టేనని ఈ సందర్భంగా యోగి అన్నారు. దేశంలో నివసించే ప్రతి పౌరుడూ విధేయతగా, ఐక్యత కోసం పనిచేయాలని కాంక్షిస్తున్నట్టు ఆయన చెప్పారు. కులం, ప్రాంతం, భాషల పేరుతో సమాజాన్ని విభజించే వంటి అంశాలను గుర్తించి ఎప్పటికప్పుడు వాటిని వ్యతిరేకించాలని యోగి సూచించారు. ఇలాంటి విభజనలు కొత్త జిన్నాలను సృష్టించే కుట్రలో భాగమని అని ఆయన చెప్పుకొచ్చారు. దేశంలో నూతన జిన్నాలకు తెరలేపకుండా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చా రు.భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఎందరికో స్ఫూర్తి రగిలించిన 'వందే మాతరం' గేయాన్ని 1875 నవంబర్ 7న బంకిం చంద్ర ఛటర్జీ రచించారు. ఇది తొలిసారిగా 'ఆనంద్‌మఠ్' నవలలో ప్రచురితమైంది. ఈ గేయానికి 2025 నవంబర్ 7 నాటికి 150 వసంతాలు పూర్త య్యాయి. దీనిని ఏడాది పాటు దేశవ్యాప్తంగా ఓ ప్రత్యేక కార్యక్రమంగా నిర్వహించాలని ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పీఎం నరేంద్రమోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. 'వందేమాతరం' అనే పదం ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడం సహా.. నూతన భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుందని మోదీ పేర్కొన్నారు..

# బిహార్‌ను నెంబర్ వన్ రాష్ట్రంగా చేస్తాం



**పాట్నా:** నవంబర్ 14వ తేదీ తర్వాత బిహార్‌ను నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ఆర్జేడీ నేత, మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్‌తెలిపారు. బిహార్‌ను అట్టడుగు స్థాయిలోకి ఎన్డీయే నెట్టేసిందని, పోలింగ్‌కు ముందు ఎన్నికల అధికారులను కేంద్ర మంత్రులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్ మరి కొద్ది గంటల్లోనే జరుగనుండటంతో సోమవారంనాడు మీడియా సమావేశంలో తేజస్వి మాట్లాడారు.'నవంబర్ 14 తర్వాత బిహార్‌ను దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి తీసుకువెళ్తాం. ఆహార ఆధారిత యూనిట్లు, విద్య, వైద్యం, ఉపాధి కల్పన, ఇరిగేషన్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, ఎడ్యుకేషనల్ సిటీలు, ఐటీ హబ్‌లు ఏర్పాటు చేస్తాం. ఏ ఒక్క బిహారీ కూడా ఇతర సిటీలకు వెళ్లాల్సిన పని లేదు' అని తేజస్వి తెలిపారు. ఈసారి చాలా స్పష్టంగా బిహార్‌లో మార్పు కనిపిస్తోందని, ఉద్యోగాలు కల్పించే ప్రభుత్వాన్నే అధికారంలోకి తీసుకురావాలని ప్రజలు బలంగా తీర్మానించుకున్నారని, ప్రజలు చరిత్ర సృష్టించనున్నారని చెప్పారు.డాటా దాచిపెట్టారునవంబర్ 6న తొలి విడత పోలింగ్ జరిగి నాలుగు రోజులైనా గణాంకాలను ఇంతవరకూ ఈసీ బయటకు వెల్లడించలేదని తేజస్వి ఆరోపించారు. గతంలో ఎన్నికల రోజే ఓటింగ్ గణాంకాలను వెల్లడించేవారని, ఇప్పుడు ఎందుకు దాచిపెడుతున్నారని ప్రశ్నించారు. బీజేపీ పాపాలను ఎన్నికల కమిషన్ కప్పిపుచ్చుతోందని, ఎన్నికల కమిషన్ నిర్జీవంగా, బీజేపీకి ఒక ఉపకరణంగా మారిందని విమర్శలు గుప్పించారు. తొలి విడత పోలింగ్‌లో మహిళలు, పురుషుల ఓటింగ్ శాతాన్ని ఎన్నికల కమిషన్ ఎందుకు ప్రచురించలేదో వివరణ ఇవ్వాలని తేజస్వి డిమాండ్ చేసారు. లెక్కలు ఎందుకు దాచిపెడుతున్నారో చెప్పాలన్నారు. వీవీప్యాట్ స్లిప్పులు వీధుల్లో కనిపిస్తున్నాయని, సీసీటీవీ కెమెరాలను మూసిపెట్టి ఉంచుతున్నారని, ఈ అవకతవకలపై ఈసీ వివరణ ఇవ్వాలని అన్నారు.బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్ నవంబర్ 6న ప్రశాంతంగా జరిగింది. 65.08 శాతం పోలింగ్ రికార్డయింది. 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. రెండో విడత పోలింగ్ 123 నియోజకవర్గాల్లో నవం బర్ 11న జరుగనుంది. దీంతో ఓటింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. నవంబర్ 14న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

# భారీ ఉగ్రకుట్ర భగ్నం ఇద్దరు కశ్మీరీ డాక్టర్స్ అరెస్ట్



**గుజరాత్:** దేశంలో ఉగ్రకుట్రలను పోలీసులు భగ్నం చేస్తున్నారు. ఇటీవలే గుజరాత్‌లో ముగ్గురు అను మానితులను ఏటీఎస్ అరెస్టు చేయగా, తాజాగా హరియాణాలో భారీగా ఆయుధ డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో 2900 కిలోల ఐఈడీ బాంబు తయారీ మెటీరియల్, దాడులకు ఉపయోగించే ఇతర పరికరాలు ఉన్నాయి. ఈ కేసులో అరెస్ట్ అయిన ఇద్దరూ డాక్టర్లే కావడం సంచలనంగా మారింది. జమ్మూ కశ్మీర్‌లో అనేకమంది వైద్యులకు ఉగ్రవాదులతో సంబ ంధాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జమ్ముకశ్మీర్-హరియాణా పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి ఈ భారీ ఉగ్రకుట్రను భగ్నం చేశారు. హరియాణా ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ వైద్య కళాశాలలో భారీ ఆయుధ డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో 2 రైఫిళ్లు, ఐఈడీ బాంబు తయారు చేసేందుకు అవసరమైన 2900 కిలోల మెటీరియల్, టైమర్లు ఉన్నాయి. దాదాపు 15 రోజుల క్రితం ఏకే-47 రైఫిల్‌తోపాటు మందుగుండు సామగ్రిని అక్రమంగా కలిగి ఉన్న కేసులో అనంతనాగ్ హాస్పిటల్ వైద్యుడు అదీల్ అహ్మద్ రాథర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తమదైన రీతిలో అతడి డొంకలాగితే భారీ ఉగ్రకుట్ర బయటపడింది. రాథర్ ఇచ్చిన సమాచారం మేరకు హరియాణాలోని అల్‌ఫలాహ్ ఆస్పత్రిలో పనిచేసే మరో డాక్టర్ ముజామిల్ షకీల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడిని తమదైన రీతిలో విచారణ చేయగా ఈ ఆయుధ డంప్ గురించి బయటపడింది. ఆసుపత్రిలో ఈ పేలుడు పదార్థాలను నిల్వ చేసేందుకు సాయం చేసింది షకీల్ అయినప్పటికీ, అతడికి అవి ఎక్కడి నుంచి వచ్చాయో ఇంకా తెలియరాలేదు. ఇద్దరు డాక్టర్లపై యూఏపీఏ కింద కేసులు నమోదు చేసి, జమ్మూకశ్మీర్‌కు తరలించి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# హజ్ కోటాపై భారత్ సౌదీ మధ్య ఒప్పందం




**న్యూఢిల్లీ:**భారత్, సౌదీ అరేబియా మధ్య ద్వైపాక్షిక హజ్ ఒప్పందం కుది రింది. హజ్ కోటాపై ఇరుదేశాలు తాజాగా ఒప్పందం చేసుకు న్నాయి. ఇందులో భాగంగా 2026 సంవత్సరానికిగాను భారత్ నుంచి 1,75,025 మంది యాత్రికులకు సౌదీ అవకాశం ఇచ్చిం ది. జెడ్డాలో జరిగిన కార్యక్రమంలో భారత్ తరఫున మైనార్టీ వ్యవ హారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, సౌదీ మంత్రి తౌఫిక్ బిన్ ఫజ్వాన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.సౌదీలో కిరణ్ రిజిజు పర్యటనమూడు రోజుల సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లిన కిరణ్ రిజిజు, ఆ దేశ మంత్రి తౌఫిక్ బిన్ ఫజ్వాన్?తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఇరుదేశాల మంత్రులు హజ్ యాత్ర సన్నాహాలను సమీక్షించారు. సమన్వ యం, మద్దతు వంటి అంశాల గురించి చర్చించారు. భారతీయ యాత్రికుల కోసం తీర్థయాత్ర ప్రక్రియను మరింత క్రమబద్ధీ కరించడానికి ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించారు. యాత్రి కులకు సౌకర్యవంతమైన తీర్థయాత్ర అనుభవాన్ని నిర్ధారిం చడానికి సౌకర్యాలు, రవాణా, వసతి, ఆరోగ్య సేవలను మెరుగ ఽపరచడంపై చర్చలు జరిపారు. ఈ క్రమంలో భారత్, సౌదీ అరేబియా మధ్య ద్వైపాక్షిక హజ్ ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలో ఇరుపక్షాలు ఒప్పందంపై సంతకాలు చేశాయి.ప్రవాస భారతీయులతో రిజిజు భేటీకిరణ్ రిజిజు ఈ పర్యటన సందర ్భంగా హజ్ యాత్ర%-%2026 కోసం జరుగుతున్న సన్నాహాలను గురించి తెలుసుకోవడానికి జెడ్డాలోని భారత రాయబార కార్యాలయం, కాన్సులేట్ జనరల్ అధికారులతో అంతర్గత సమీక్ష సమావేశాన్ని కూడా నిర్వహించారు. భారతీయ యాత్రికుల సంక్షేమం, సౌకర్యాన్ని నిర్ధారించ డానికి సౌదీ అధికారులతో సమన్వయంగా, సన్నిహితంగా ఉండేందుకు కాన్సులేట్ బృందాలు చేసిన ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. యాత్రి కులకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, సౌకర్యాలపై ప్రత్యక్ష అవగాహన పొందడానికి జెడ్డాలోని టెర్మినల్-1, హరమైన్ స్టేషన్‌తో సహా జెడ్డా, తైఫ్‌లోని కీలకమైన హజ్, ఉమ్రా సంబంధిత ప్రదేశాలను కూడా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పర్యటించారు. అలాగే జెడ్డా, తైఫ్‌లోని ప్రవాస భారతీయులనుతోనూ కాసేపు ముచ్చటించారు.

# పార్టీ పిరాయింపు ఎమ్మెల్యేల కేసు



**న్యూఢిల్లీ:** పార్టీ ఫిరాయించిన తెలంగాణ ఎమ్మెల్యేల కేసుపై విచారణకు మరింత సమయం కావాలని స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును గడువు కోరిన సంగతి తెలిసిందే. గత నెల 25వ తేదీన తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై నవంబర్ 14వ తేదీన సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. కాగా, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టు 3 నెలల గడువు ఇచ్చింది. అక్టోబర్ 31వ తేదీతో 3 నెలల గడువు ముగిసింది. అయితే, స్పీకర్ కార్యాలయం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సంబంధించి వివరణలు, విచారణలు కొనసాగిస్తుండటంతో గడువు కావాలంటూ గడువు పూర్తవ్వటానికి ముందే సుప్రీంకోర్టులో ఫిటిషన్ ఫైల్ చేసింది.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఈ కేసును విచారించే అవకాశం ఉంది. నవంబర్ 14వ తేదికి ఈ కేసు లిస్ట్ అయింది. స్పీకర్ కార్యాలయం అడిగిన విధంగా సుప్రీంకోర్టు మరింత సమయాన్ని ఇస్తుందా.. గడువు సమయంలోగా అనర్హతపై నిర్ణయం తీసుకోనందుకు మందలిస్తుందా అన్నది నవంబర్ 14వ తేదీన తెలియనుంది.

# స్వచ్ఛమైన గాలి కావాలి కాలుష్యం పై ఇండియా గేట్ వద్ద నిరసనలు



**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య తీవ్రతతో గాలి నాణ్యత రోజు రోజుకూ క్షీణిస్తోంది. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ ఢిల్లీ వాసులు ఆందోళనలు చేపట్టారు. వివిధ వర్గాల ప్రజలతో పాటు తల్లిదండ్రులు, పర్యావరణ కార్యకర్తలు ఇండియా గేట్ వద్ద భారీ నిరసనకు దిగారు. ముఖ్యంగా చిన్నారులతో కలిసి అనేక మంది మహిళలు హాజరై, ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు."మాకు ఉన్నది ఒకటే సమస్య. అది స్వచ్ఛమైన గాలి. ఈ సమస్య అనేక ఏళ్లుగా ఉన్నా, ఇప్పటికీ సరైన చర్యలు తీసుకోలేదు. ఇది రాజ్యాంగ హక్కులను అతిక్రమించడమే అవుతుంది. దాదాపు 10 ఏళ్లుగా ఈ సమస్యతో బాధపడుతున్నాం. ప్రజల ఆరోగ్య, హక్కుల గురించి ఎవరూ ఆలోచించడం లేదు. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు మాకు అర్థం కావడం లేదు. మేము శాంతియుతంగా ఇక్కడ నిరసన చేపట్టాం. కానీ పోలీసులు వచ్చి మమ్మల్ని లాకెళ్లి బస్సుల్లో ఎక్కించారు. ఇది రాజకీయ అంశం కాదు. కేవలం స్వచ్ఛమైన గాలి కోసం మాత్రమే పోరాడుతున్నాం."షీలా దీక్షిత్ హయాంలో ఢిల్లీ 'గ్రీన్ క్యాపిటల్'స్వచ్ఛమైన గాలిని అందించడంలో ఢిల్లీ ప్రభుత్వం విఫలమైందని మరో నిరసనకారుడు ఆరోపించారు. మాజీ సీఎం షీలా దీక్షిత్ హయాంలో ఢిల్లీ 'గ్రీన్ క్యాపిటల్'గా ఉండేదని, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల్లో చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై రాజకీయ నాయకులు మాత్రం బాధ్యత వహించకుండా ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారని మండిపడ్డారు

# ప్రచారం కోసం సుప్రీంకోర్టుకు రావొద్దు



**ఢిల్లీ, నవంబర్, 10:** ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు పాల్ మీద దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీడియాలో ప్రచారం కోసం పిటిషన్లు దాఖలు చేస్తున్నారని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. దీంతో మరో మారు కేఏ పాల్‌కు సుప్రీం కోర్టులో చుక్కెదురైనట్లైంది.ఇక, కేసు వివరాల్లోకి వెళ్తే, ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన మెడికల్ కాలేజీల నిర్మాణాలను పీపీపీ మోడ్‌లో పూర్తి చేసి నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే, ఏపీ ప్రభుత్వ నిర్ణయాన్ని కేఏ పాల్. సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. దీనిపై కేఏ పాల్‌పై అత్యున్నత ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేస్తూ. ఈ విషయంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించాలని కేఏ పాల్‌కు సూచించింది.కాగా, ఇప్పటికే కేఏ పాల్ అనేక అంశాల్లో చాలా సార్లు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అయితే, కేఏ పాల్ వేసిన చాలా పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ నేపథ్యంలోనే సుప్రీం కోర్టు పై విధంగా వ్యాఖ్యానించింది. ప్రస్తుత పిటిషన్ తరహాలోనే 2024లో తిరుమలను కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలంటూ సుప్రీం కోర్టులో పాల్ పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం.. పిటిషన్ డిస్మిస్ చేసింది.ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లకు (ఈవీఎం) బదులు.. బ్యాలెట్ పేపర్లను వినియోగించాలంటూ 2024 లో కేఏ పాల్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టేసింది. 2023లో తెలంగాణ సెక్రటేరియట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై సీబీఐ విచారణ జరిపి ంచాలని సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు దేశంలో జరిగే అగ్నిప్ర మాదాలపై సీబీఐతో విచారణ జరిపించాలా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పిటిషన్ కొట్టేసింది.

# మిత్రులే ప్రత్యర్థులు ఆసక్తి కలిగిస్తున్న చతుర్ముఖ పోటీ



**కహల్‌గావ్:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ తుది ఘట్టానికి చేరుకుంది. కీలకమైన రెండో విడత పోలింగ్ మరి కొద్ది గంటల్లోనే (నవంబర్ 11) జరగనుండటంతో అన్నీ పార్టీల్లోనూ ఉత్కంఠ నెలకొంది. తొలి విడత భారీగా పోలింగ్ నమోదు కావడంతో రెండో విడతపై అంచనాలు బలంగానే ఉన్నాయి. ఈసారి పోలింగ్ జరుగుతున్న పలు నియోజకవర్గాల్లో కూటమి భాగస్వామ్య పార్టీల నేతలే ప్రత్యర్థులుగా తలపడుతుండటం ఆసక్తిని కలిగిస్తోంది. కొన్ని చోట్ల టిక్కెట్లు నిరాకరించడంతో రెబల్ అభ్యర్థులు సైతం పోటీలో ఉన్నారు. అలాంటి నియోజకవర్గాల్లో భాగల్‌పూర్ జిల్లాలోని కహల్‌గావ్ నియోజకవర్గం ఒకటి. ఇక్కడ చతుర్ముఖ పోటీ నెలకొనడం ఆసక్తిగా మారింది.కహల్‌గావ్‌లో జేడీయూ అభ్యర్థిగా సుభానంద్ ముఖేష్ పోటీలో ఉన్నారు. ఆయన దివంగత నేత, బిహార్ అసెంబ్లీ మాజీ స్పీకర్ సదానంద్ సింగ్ కుమారుడు. సదానంద్ సింగ్ కాంగ్రెస్ టిక్కెట్‌పై రికార్డు స్థాయిలో తొమ్మిది సార్లు ఇక్కడి నుంచి గెలిచారు. సుభానంద్ ముఖేష్ వృత్తిరీత్యా ఇంజనీర్ కాగా, ఆయన భార్య డాక్టర్. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ టిక్కెట్‌పై పోటీ చేశారు. అయితే బీజేపీ అభ్యర్థి పవన్ కుమార్ యాదవ్ చేతిలో ఓడిపోయారు. ఈ ఏడాది ఆయన జేడీయూలో చేరారు. సీట్ల షేరింగ్ ఒప్పందంలో భాగంగా ఈ నియోజకవర్గాన్ని జేడీయూకు బీజేపీ వదులుకుంది. దీంతో సుభానంద్ ముఖేష్‌కు జేడీయూ టిక్కెట్ ఇచ్చింది. నితీష్ కుమార్ కనుసన్నుల్లో తాను పెరిగాయని, తన తండ్రి వారసత్వం కూడా తనకు ఉందని, తన గెలుపు ఖాయమని సుభానంద్ ధీమా వ్యక్తం చేశారు.

## 15 రోజుల్లో సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలని నోటీసులు జారీ చేసిన పోలీసులు..





**సత్తుపల్లి:** కమీషనర్ ఆఫ్ పోలీస్ ఉత్తర్వుల మేరకు తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ (మెజర్స్) ఎన్ఫోర్స్మెంట్ యాక్ట్ -2013 లోని అంశాల ప్రకారం సోమవారం రోజు అనగా సత్తుపల్లి లోని షాపింగ్ మాల్స్, హోటల్స్, రెస్టారెంట్స్, స్కూల్స్, కాలేజీలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిసి కెమెరాలు పెట్టాలని మరియు ట్రయల్ రూమ్స్, బాత్రూమ్ లలో ఏమైనా స్పై కెమెరాలు ఉన్నాయేమోనని ఆయా మాల్ లు ,హోటల్, ఇతర సంస్థల యజమానులు తనిఖీ చేసుకోవాలని, వారి సంస్థలకు అన్నీ వైపులా కనపడేలా సిసి కెమెరాలు ఉండాలని సత్తుపల్లి సిఐ టి.శ్రీహరి సోమవారం రోజు సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణంలో మీటింగ్ నిర్వహించి ఆయా సంస్థలు, వ్యాపార వర్గాల వారికి సూచించి ,అట్టి సూచనలను ఇచ్చి 15 రోజుల్లోగా అమలు చేయాలని యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వటం జరిగింది.

## తండా వాసికి డాక్టరేట్ పట్టా గిరిజన సమాజానికి గర్వకారణం



**సిద్దిపేట జిల్లా అక్కన్నపేట** అక్కన్నపేట మండలం పంజాగుట్ట తండాకు చెందిన గూగుల్ తిరుపతి నాయక్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలం గాణ బంజారా అనుబంధ సాహిత్యం పై పీహెచ్డీ పూర్తిచేసి డాక్టరేట్ పట్టా అందు కున్నారు మారుమూల గ్రామం నుండి పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గానికి చెందిన ఈ గిరిజన బిడ్డ సాధించిన విజయంతో బంజారా సమాజం గౌరవం మరింత పెరిగింది తిరుపతి నాయక్ సాధన పట్ల తండా యువత హర్షం వ్యక్తం చేశారు బంజారా సాంస్కృతి కట్టుబొట్టు భాష గౌరవాన్ని నిలబెట్టి గిరిజన సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన తిరుపతి నాయక్ కు యువత సన్మానం నిర్వహించారు తిరుపతి నాయక్ సాధన తో గ్రామీణ గిరిజన యువతలో ఉన్నత విద్యపై అవగాహన పెంపొందుతుందని యువత ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో గూగుల్ రాకేష్ నాయక్ వెంకటేష్ నాయక్ పరశురాం నాయక్ కుమార్ అంజన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు

## మోకాళ్ల నొప్పులు ఉన్నవారు పాటించాల్సిన చిట్కాలు.. తీసుకోవాల్సిన ఆహారాలు ఇవే



వయస్సు మీద పడుతున్న కొద్దీ శరీరంలో మినరల్స్ శాతం తగ్గుతుంది. ముఖ్యంగా క్యాల్షియం, ఫాస్ఫరస్, మాంగనీస్ వంటి మిన రల్స్తోపాటు విటమిన్ డి కూడా తగ్గుతుంది. దీంతో సహజంగానే ఎముకలు బలహీనంగా మారుతాయి. దీని ప్రభావం మోకాళ్లలో, కీళ్లలో ముందుగా కనిపిస్తుంది. దీని వల్ల ఆయా భాగాల్లో నొప్పులు వస్తుంటాయి. అయితే వయస్సు మీద పడకపోయినా కొందరికి యుక్త వయస్సులో అయినా సరే పలు ఇతర కారణాల వల్ల మోకాళ్ల నొప్పులు వస్తుంటాయి. అలాగే ఆ ప్రాంతంలో వాపులు కూడా ఉంటాయి. సాధారణంగా మోకాళ్లలో ఉండే పలు రకాల ఎముకలు లేదా నాడులు, కండరాలకు దెబ్బలు తగలడం వల్ల మోకాళ్ల నొప్పులు వస్తుంటాయి. ఈ నొప్పులు అప్పటికప్పుడు రాకపోయినా తరువాత నెమ్మదిగా వచ్చి ఇబ్బందులకు గురి చేస్తాయి. అలాగే ఆస్టియో ఆర్థరైటిస్ లేదా ఆర్థరైటిస్ సమస్య ప్రారంభంలో ఉన్నా, గౌట్ ప్రారంభంలో ఉన్నా, పలు రకాల మందులను దీర్ఘకాలికంగా ఉపయోగిస్తున్నా, శారీరక శ్రమ లేదా వ్యాయామం ఎక్కువ సేపు చేసినా, గంటల తరబడి కూర్చుని ఉన్నా మోకాళ్ల నొప్పులు వస్తుంటాయి. ఈ నొప్పులను తగ్గిం చేందుకు పలు ఇంటి చిట్కాలు పనిచేస్తాయి. అలాగే పలు రకాల ఆహారాలను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. చిట్కాలు. .మోకాళ్ల నొప్పులకు శొంఠి, జీలకర్ర, పుదీనా ఆకుల మిశ్రమం అద్భుతంగా పనిచేస్తుంది. వీటిని 30 గ్రాముల చొప్పున తీసుకోవాలి. మిరి యాలను 15 గ్రాముల మోతాదులో తీసుకోవాల్సి ఉంటుంది. అన్నింటినీ కలిపి మెత్తగా నూరి పొడి చేయాలి. దీన్ని పూటకు అర టీస్పూన్ చొప్పున రోజుకు రెండు పూటలా అర కప్పు నీటిలో కలిపి తీసుకోవాలి. ఇలా చేస్తుంటే కీళ్ల నొప్పులు తగ్గిపోతాయి. అలాగే ఈ నొప్పులకు వెల్లుల్లి కూడా బాగానే పనిచేస్తుంది. వెల్లుల్లి రెబ్బలను రెండు తీసుకుని కాస్త దంచి ఒక టీస్పూన్ తేనెతో కలిపి తీసుకోవాలి. వెల్లుల్లి రెబ్బలను దంచి పాలలో వేసి మరిగించి ఆ పాలను కూడా తాగవచ్చు. ఇలా చేస్తున్నా కూడా మోకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అదేవిధంగా ఆముదం పప్పును తింటుండం వల్ల కూడా మోకాళ్ల నొప్పులు తగ్గిపోతాయి. ఆముదం పప్పును ఒక గింజతో మొదలు పెట్టి రోజుకు ఒక గింజ చొప్పున పెంచుతూ ఏడు రోజుల పాటు తినాలి. తరువాత ఎనిమిదో రోజు నుంచి ఒక్కో గింజను తగ్గించుకుంటూ తినాలి. ఇలా చేస్తున్నా కూడా ఉపయోగం ఉంటుంది.ఇవి కూడా అవసరమే..గసగసాలను నీటిలో నానబెట్టి ఆ నీళ్లను తాగుతున్నా కూడా మోకాళ్ల నొప్పులు తగ్గిపోతాయి. అర టీస్పూన్ శొంఠి పొడి, ఒక టీస్పూన్ నువ్వుల పొడి, అర టీస్పూన్ బెల్లంలను కలిపి ముద్దగా నూరి దాన్ని రోజుకు రెండు సార్లు తీసుకోవాలి. అర కప్పు శొంఠి కషాయంలో రెండు టీస్పూన్ల ఆముదం కలిపి రెండు పూటలా తీసుకోవాలి. అలాగే లేత మునగ ఆకులను నెయ్యిలో వేయించి తింటున్నా కూడా ఈ సమస్య తగ్గుతుంది. ఈత వేర్లకు చెందిన బెరడును కషాయంగా చేసి తాగుతు ండాలి. దీని వల్ల కూడా సమస్య తగ్గుతుంది. మోకాళ్ల నొప్పులు ఉన్నవారు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. ఇవి మనకు ఎక్కువగా చేపలు, అవిసె గింజలు, చియా విత్తనాలు, వాల్ నట్స్లో ఉంటాయి. కనుక ఈ ఆహారాలను తరచూ తినాలి. అలాగే వంటల్లో ఆలివ్ ఆయిల్ను ఎక్కువగా ఉపయోగించాలి. తీసుకోవాల్సిన ఆహారాలు..మోకాళ్ల నొప్పులు తగ్గేందుకు గాను యాంటీ ఆక్సిడెంట్లు, విట మిన్ సి ఉండే ఆహారాలనుఉంటుంది.

## సోంపు గింజలను అంత తేలిగ్గా తీసుకోకండి.. అవి అందించే లాభాలు తెలిస్తే రోజూ తింటారు



భోజనం చేసిన అనంతరం కొందరికి సోంపు గింజలను తినే అలవాటు ఉంటుంది. హోటల్స్ లేదా రెస్టారెంట్లలో ఆహారం తిన్నప్పుడు కచ్చితంగా సోంపు గింజలను ఇస్తారు. వాటిని చాలా మంది ఇష్టంగా తింటారు. అయితే భోజనం చేసిన తరువాత సోంపు గింజలను తినడం వల్ల నోటి దుర్వాసన రాకుండా అడ్డుకోవడమే కాక ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అందుకనే చాలా మంది భోజనం చేసిన తరువాత ఈ గింజలను తింటుంటారు. అయితే వాస్తవానికి సోంపు గింజలు కేవలం ఇవే కాదు, ఇంకా మనకు అనేక లాభాలను అందిస్తాయి. అయితే ఇందుకు గాను సోంపు గింజలను రోజూ తినాల్సి ఉంటుంది. ముఖ్యంగా మధ్యాహ్నం, రాత్రి భోజనం చేసిన అనంతరం ఒక టీస్పూన్ మోతాదులో సోంపు గింజలను తింటుండాలి. దీని వల్ల అనేక పోషకాలు లభిస్తాయి. ఇవి మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచేందుకు సహాయం చేస్తాయి.సోంపు గింజలను తినడం వల్ల కేవలం ఆహారం సులభంగా జీర్ణమై అజీర్తి తగ్గడమే కాదు, ఇతర జీర్ణ సమస్యల నుంచి సైతం ఉప శమనం లభిస్తుంది. ఈ గింజల్లో కార్మినే టివ్ గుణాలు ఉంటాయి. కనుక వీటిని తింటుంటే జీర్ణాశయంలోని కండరాలు ప్రశాంతంగా మారుతాయి. దీంతో పొట్టలో ఉత్పత్తి అయ్యే గ్యాస్ ఎప్పటికప్పుడు బయటకు వెళ్తుంది. గ్యాస్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. కడుపు ఉబ్బరం తగ్గిపోతుంది. సోంపు గింజలను తినడం వల్ల జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి అవుతాయి. ఎంజైమ్ల పనితీరు మెరుగు పడుతుంది. దీని వల్ల మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. అలాగే ఆహారంలో ఉండే పోషకాలను సైతం శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. ఇక ఈ గింజలను రోజూ పనితీరు మెరుగు పడుతుంది.

## మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా, జైలు శిక్ష

**అశ్వారావుపేట:** దమ్మపేట, అశ్వారావుపేట మండలాల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల పెరుగుతున్న ప్రమాదాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. రెండు స్టేషన్ల పరిధిలో ఇటీవల జరిగిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం మత్తులో వాహనాలు నడిపిన 18 మంది వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. వీరిని దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి భవాని వద్ద హాజరుపర్చగా విచారణలో మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు నిర్ధారణ కావడంతో 16 మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైన మరో ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు. తాగి వాహనాలు నడపడం కేవలం చట్ట ఉల్లంఘనే కాదు, అది ప్రాణాంతకమైన చర్య అని న్యాయమూర్తి భవాని తెలిపారు. ఇటువంటి నిర్లక్ష్యపు ప్రవర్తన వల్ల ఎన్నో కుటుంబాలు వీధిపాలు అవుతున్నాయన్నారు. మద్యం మత్తులో వాహనం నడిపిన ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

**మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు**

అశ్వారావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించి బాధ్యతగా నడవాలని సూచించారు. తాగి వాహనం నడపడం ప్రాణహాని కలిగించవచ్చునన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట ఎస్సైలు యయాతిరాజు, సాయి కిషోర్ రెడ్డిలు మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరంగా కొనసాగుతాయన్నారు. ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడమే తమ ప్రధాన లక్ష్యం అన్నారు. వారాంతాలు, పండుగల సమయంలో ప్రత్యేక బృందాలతో చెక్పోస్టులు ఏర్పాటు చేసి వాహనదారులను తనిఖీ చేస్తామని తెలిపారు.

## డ్రగ్స్పై చైతన్యం ర్యాలీతో సందేశం కొత్తగూడెం పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**కొత్తగూడెం :** కొత్తగూడెం పోలీసు శాఖ ఆధ్వర్యంలో “చైతన్యం డ్రగ్స్పై యుద్ధం” పేరుతో విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించే ర్యాలీ ఘనంగా నిర్వహించారు. చుంచుపల్లి జీవి మాల్ ఎదుట నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎస్ఆర్డీజీ స్కూల్ వద్ద ముగిసింది. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ నేతృత్వం వహించారు. ర్యాలీలో విద్యార్థులు “డ్రగ్స్కు నో చెప్పండి”, “మాదకద్రవ్యాలు మన జీవితాన్ని నాశనం చేస్తాయి” అంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. ర్యాలీ అనంతరం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ, “డ్రగ్స్ వాడకం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, అది సమాజాన్నీ దెబ్బతీసే ప్రమాదకర వ్యాధి. యువత భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే డ్రగ్స్ దూరం చేయాలి. తల్లిదండ్రులు పిల్లల






ప్రవర్తన, స్నేహిత వర్గం పట్ల అప్రమత్తంగా ఉండాలి” అని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల హానికర ఫలితాలపై అవగాహన పత్రాలను పంపిణీ చేశారు.ర్యాలీలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రవికుమార్, ఎస్సై ఉమా, పోలీసు సిబ్బంది, స్థానిక విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైరా మున్సిపాలిటీలో దేవుడు కరుణించిన పూజారి కరుణించటం లేదు

- **యామాల గోపాలరావు సిపిఐ మండల కార్యదర్శి**



**వైరా(నవంబర్ 10):-** వైరా మున్సిపాలిటీలో శానిటైజర్ వర్కర్లుగా పని చేస్తున్న వారికి నెలలు గడుస్తున్న ఇంతవరకు జీతాలు చేయకుండా కార్మికుల జీతాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న మున్సిపల్ మేనేజర్ సుధాకర్ రావు .మున్సిపాలిటీ అధికారులు మొత్తం మున్సిపాలిటీ శానిటైజర్ వర్కర్లకి జీతాల మీద సంతకాలు చేసిన సుధాకర్ మాత్రం సంతకాలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తూ ఆ జీతాలు వస్తే ఏంటి నిమ్మలంగా చేస్తాం అంత తొందరేముంది అంటూ నిర్లక్ష్య సమాధానం కార్మికులు అడిగితే చెబుతున్నారు.అలాగే మిమ్మల్ని ఎవరు అడగమంటున్నారు నాకు తెలుసు అంటూ ఒక నియంత లాగా ప్రవర్తించుచు ఉంటున్నారు కార్మికులు ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు చెత్తాచెదారాలు ఎత్తివేసి కడుపు మార్చుకొని పనిచేస్తున్న కానీ నెల నెల జీతాలు ఇయ్యటంలో మేనేజర్
అతి చొరవ చూపుతూ జీతాలు చేయకుండా సంతకాలు పెట్టకుండా వెళ్ళటం తనకే చెల్లుబాటు మున్సిపాలిటీ కమిషనర్ మిగతా అధికారులు మొత్తం జీతాల చెక్కులు మీద సంతకాలు చేసి పది రోజులు అవుతున్న ఒక్క మేనేజర్ సంతకం కోసం పది రోజుల నుండి ఎదురు చూడవలసి వస్తుంది ఇంతవరకు సంతకాలు చేయకుండా ఏదో కుంటి
సాకులు చెబుతున్నాడు ఇలాంటి వారిపై పై అధికారులు చర్యలు తీసుకొని కార్మికులకు జీతాలు వెంటనే వేయించవలనని డిమాండ్ చేస్తున్నాం.


## చిక్కుడు కాయలను తినడం లేదా అయితే ఈ అద్భుతమైన లాభాలను మీరు కోల్పోయినట్లే

మనకు ఏడాది పొడవునా అందుబాటులో ఉండే కూరగాయల్లో చిక్కుడు కాయలు కూడా ఒకటి. ఇవి సాధారణంగా మనకు రెండు రకాలుగా లభిస్తాయి. గింజలు, కాయ లావుగా ఉండే చిక్కుడు కాయలు, ఆయా భాగాలు పలుచగా, వెడల్పుగా ఉండే కాయలు.. ఇలా చిక్కుడు కాయలు రెండు రకాలుగా లభిస్తాయి. మొదటి రకానికి చెందిన చిక్కుడు కాయలను అడవి చిక్కుడు అని కూడా పిలుస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ కాయలు ఎక్కువగా కాస్తాయి. ఇవి ఎంతో రుచిగా ఉంటాయి. ఇక రెండో రకానికి చెందిన చిక్కుళ్లు మనకు అన్ని ప్రాంతాల్లోనూ, అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. అయితే చిక్కుడు కాయలను తినేందుకు చాలా మంది అంతగా ఆసక్తిని చూపించరు. కానీ ఇవి మనకు అనేక పోషకాలను, ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. చిక్కుడు కాయలను తరచూ తింటే అనేక లాభాలను పొందవచ్చు. ఇవి మన శరీరానికి పోషణను అందిస్తాయి. రోగాలు రాకుండా చూస్తాయి.నాన్ వెజ్ తినని వారికి..చిక్కుడు కాయలను తరచూ తినడం వల్ల వృక్ష సంబంధ ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. నాన్ వెజ్ తినని వారికి చిక్కుళ్లను చక్కని ప్రత్యామ్నాయ ఆహారంగా చెప్పవచ్చు. వీటిని తింటే ప్రోటీన్లను సమృద్ధిగా పొందవచ్చు. దీని వల్ల కండరాలకు మరమ్మత్తులు జరుగుతాయి. కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. శారీరక శ్రమ, వ్యాయామం చేసే వారికి చిక్కుళ్లు ఎంతో దోహదం చేస్తాయి. వీటి వల్ల కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి. చక్కని దేహ ధారుఢ్యం



సొంతమవుతుంది. ఇవి శరీరానికి ఎంతో శక్తిని అందించి ఉత్సాహంగా, యాక్టివ్గా ఉండేలా చేస్తాయి. వీటిని తినడం వల్ల నీరసం, అలసట తగ్గుతాయి. బద్ధకం పోతుంది. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. ఇక వీటిని తినడం వల్ల ప్రోటీన్లు, ఫైబర్ను సమృద్ధిగా పొందవచ్చు. అందువల్ల ఈ కాయలను తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు ఎంతగానో సహాయం చేస్తుంది. రక్తహీనతకు..చిక్కుళ్లలో ఉండే ఫైబర్ వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి ఉండదు. ముఖ్యంగా మలబద్ధకం తగ్గుతుంది. చిక్కుళ్లు ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. అందువల్ల వీటిని తింటుంటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణ సమస్యలు రాకుండా చేస్తుంది. చిక్కుళ్లలో అధికంగా ఉండే ఐరన్ వల్ల ఎర్ర రక్త కణాలు వృద్ధి చెందుతాయి. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. రక్తం తక్కువగా ఉన్నవారు తరచూ చిక్కుళ్లను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. అలాగే వీటిని తింటే ఫోలేట్ సైతం సమృద్ధిగా లభిస్తుంది. ఇది గర్భిణీలకు ఎంతో మేలు చేస్తుంది. గర్భస్థ శిశువు ఆరోగ్యానికి, ఎదుగుదలకు సహాయం చేస్తుంది. శిశువుకు పుట్టుక లోపాలు రాకుండా జాగ్రత్త పడవచ్చు.ఎముకల ఆరోగ్యానికి..చిక్కుళ్లలో అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ఇవి మన శరీరానికి శక్తిని అందిస్తాయి. మనం తిన్న ఆహారం నుంచి శక్తి శరీరానికి అందేందుకు దోహదం చేస్తాయి. చిక్కుళ్లను తినడం వల్ల వాటిల్లో ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. రక్తనాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. చిక్కుళ్లలో ఉండే పొటాషియం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. చిక్కుళ్లో మాంగనీస్, కాపర్ సైతం అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల నిర్మాణానికి, సాంద్రత పెరిగేందుకు దోహదం చేస్తాయి. దీని వల్ల ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. ఇలా చిక్కుడు కాయలను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. కనుక ఇకపై చిక్కుళ్లు కనిపిస్తే విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు.

## కడుపు నొప్పిని తగ్గించే అద్భుతమైన ఇంటి చిట్కాలు..



కడుపు నొప్పి అనేది సాధారణ సమస్యే. ఇది వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. జీర్ణ సమస్యలు ఉన్నప్పుడు కొన్ని సార్లు పొట్టలో అసౌకర్యం ఏర్పడి నొప్పికి దారి తీస్తుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం, గుండెల్లో మంట, వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం వంటివి కడుపు నొప్పిని కలగజేస్తాయి. కొన్ని సార్లు అజీర్తి వల్ల కూడా కడుపు నొప్పి వస్తుంది. ఆహారం సరిగ్గా జీర్ణం అవకపోతే పొట్టలో గ్యాస్ తయారై కడుపు నొప్పిని సృష్టిస్తుంది. ఇక కొన్ని సార్లు ఫుడ్ పాయిజనింగ్ అవడం, కారం, మసాలాలు అధికంగా ఉండే ఆహారాలను ఎక్కువగా తినడం, కొన్ని రకాల మందులను వాడడం వల్ల కూడా కడుపు నొప్పి వస్తుంది. ఇది సాధారణ సమస్యే. కనుక దీనికి ఇంగ్లిష్ మెడిసిన్లను వాడాల్సిన పనిలేదు. పలు ఇంటి చిట్కాలను పాటిస్తూ పలు ఆహారాలను తీసుకుంటుంటే ఈ సమస్య సులభంగా తగ్గిపోతుంది. అలాగే జీర్ణ సమస్యల నుంచి సైతం బయట పడవచ్చు.కడుపు నొప్పిని తగ్గించడంలో అల్లం అద్భుతంగా పనిచేస్తుంది. ఒక పాత్రలో నీటిని తీసుకుని అందులో కొద్దిగా అల్లం వేసి బాగా మరిగించాలి. అనంతరం నీళ్లను వడకట్టి గోరు వెచ్చగా ఉండగానే తాగేయాలి. రుచి కోసం అందులో కాస్త తేనెను కలుపుకోవచ్చు. అలాగే పూటకు ఒకసారి ఒక టీస్పూన్ చొప్పున అల్లం రసాన్ని భోజనానికి ముందు రోజుకు మూడు పూటలా తాగాలి. ఇలా చేస్తున్నా కూడా కడుపు నొప్పిని తగ్గించుకోవచ్చు. అల్లంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు కడుపు నొప్పిని తగ్గించి జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే పుదీనా ఆకులు కూడా ఈ సమస్య నుంచి బయట పడేలా చేస్తాయి. కొన్ని పుదీనా ఆకులను తీసుకుని శుభ్రంగా కడిగి నేరుగా అలాగే తినేయాలి. లేదా ఆ ఆకులను నీటిలో వేసి మరిగించి అనంతరం ఆ నీళ్లను అయినా తాగవచ్చు. లేదా పుదీనా ఆకుల నుంచి రసం తీసి కూడా తాగవచ్చు. ఇలా చేస్తున్నా కూడా ఎంతగానో ఉపశమనం లభిస్తుంది.నిమ్మరసం, బేకింగ్ సోడా..కడుపు నొప్పి సమస్య ఉన్నవారు నిమ్మరసం, బేకింగ్ సోడా మిశ్రమాన్ని ప్రయత్నించాలి. ఒక గ్లాస్ నీటిని తీసుకుని అందులో అర టీస్పూన్ నిమ్మరసం, ఒక టీస్పూన్ బేకింగ్ సోడాను వేసి బాగా కలిపి తాగాలి. దీని వల్ల పొట్టలో ఉండే అసౌకర్యం తొలగిపోతుంది. గ్యాస్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. కడుపు నొప్పి తగ్గుతుంది. అలాగే దాల్చిన చెక్క పొడి కూడా ఈ సమస్యకు బాగానే పనిచేస్తుంది. ఇందుకు గాను ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో పావు టీస్పూన్ దాల్చిన చెక్క పొడిని కలిపి తాగాలి. లేదా దాల్చిన చెక్కను వేసి మరిగించిన నీళ్లను అయినా తాగవచ్చు. దీంతో ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. అలాగే భోజనం చేసిన తరువాత సోంపు గింజలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇవి అన్ని రకాల జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. కడుపు నొప్పి నుంచి ఉపశమనం కలిగేలా చేస్తాయి.లవంగాలు, జీలకర్ర..భోజనం చేసిన అనంతరం ఒకటి లేదా రెండు లవంగాలను నోట్లో వేసుకుని బాగా నమిలి మింగాలి. లవంగాల నుంచి వచ్చే రసాన్ని మింగాల్సి ఉంటుంది. దీని వల్ల కూడా సమస్య తగ్గుతుంది. అలాగే జీలకర్రను నీటిలో వేసి మరిగించి అనంతరం ఆ నీళ్లను వడకట్టి తాగుతుండాలి. ఈ చిట్కా కూడా అద్భుతంగా పనిచేస్తుంది. దీని వల్ల గ్యాస్, అజీర్తి తగ్గుతాయి. వాటి కారణంగా వచ్చిన కడుపు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అదేవిధంగా అంజీర్ పండ్లను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో ఉండే ఫైబర్ కడుపు నొప్పిని తగ్గించేందుకు సహాయం చేస్తుంది. జీర్ణ సమస్యల నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. కలబంద గుజ్జును తీసుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇలా ఆయా చిట్కాలను పాటిస్తుంటే కడుపు నొప్పి నుంచి సులభంగా బయట పడవచ్చు. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

# బీహార్‌లో రాహుల్ ఓట్ చోరీ పనిచేసేనా



బీహార్ ఎన్నికలు ఓ రకంగా బిజెపికన్నా రాహుల్‌కే ప్రతిష్టాత్మకంగా భావించాలి. ఓట్ చోరీ పేరుతో మన ఎన్నికల వ్యవస్థను అప్రతిష్టపాలు చేసిన వ్యక్తిగా రాహుల్ చరిత్రలో నిలిచపోయారు. ఆయన మోడీ పాలన పై చేస్తున్న విమర్శలను సహేతుకంగా తీసుకోవచ్చు. కానీ ఓట్ చోరీ పేరుతో వ్యవస్థను బద్నాం చేస్తూ వచ్చారు. ఆయన అమెరికా వెళ్లి వచ్చినప్పుడల్లా ఏదో అంశం మీద రచ్చచేస్తూనే ఉన్నారు. పంజాబ్‌లో రైతులను రెచ్చగొడుతూనే వచ్చారు. అధికార లేమితో కాంగ్రెస్ నానాయాగీ చేస్తోందని చెప్పుకోవచ్చు. అలాగే తమ యూపిఎ పాలనలో అక్రమాలపై నోరు మెదపడం లేదు. బీహార్‌లో కాంగ్రెస్ ఎన్నటికీ విజయం సాధించే అవకాశం లేదు. బీహార్‌లో తొలిద ముగిసింది. రెండోదశ మంగళవారం ఎన్నికలు జరుగబోతు న్నాయి. ఈ క్రమంలో తమదే అధికారం అని చెబుతున్న రాహుల్, ఓడిపోతే ఓట్‌చోరీతో మరింత యాగీ చేయాలన్న బలమైన వ్యూహంతో ఉన్నారు. ఇకపోతే ఇప్పటికే 9సార్లు సిఎంగా గెలిచిన నితీశ్ కుమార్‌కు ఓ రకంగా ఇవి చివరి ఎన్నికలని భావించాలి. గెలిస్తే పదోసారి సిఎంగా ప్రమాణం చేస్తారా లేదా అన్నది చూడాలి. 2020 అసెంబ్లీ ఎన్నికలలో జనతాదళ్ ఓట్ల వాటా 15 శాతంగా ఉన్నది. నితీశ్ మళ్లీ అధికారానికి రావడానికి ఇది విశేషంగా తోడ్పడింది. 2005 నుంచి ప్రతి ఎన్నికల్లోను రెండు వర్గాలు నితీశ్‌కు పూర్తి మద్దతునిస్తున్నాయి. మహిళలు, బాగా వెనుకబడిన కులాలవారు నితీశ్‌కు మద్దతునిస్తున్నారు. మహిళా ఓటర్ల శక్తిని జాతీయ రాజకీయ పక్షాలు కనుగొనక ముందే నితీశ్‌కుమార్ మహిళా ఓటర్ల ఆదరాభిమానాలను బాగా చూరగొన్నారు. మృదుభాషిగా పేరున్న నితీశ్ తన ప్రత్యర్థిగా మారిన స్నేహితుడు, పల్లెటూరి మనిషిలా వ్యవహరించే లాలూప్రసాద్‌కు పూర్తిగా భిన్నమైన వ్యక్తి. ఈ కారణంగానే మహిళా ఓటర్లను నితీశ్ ఆకట్టుకున్నారు. అచంచలమైన కుల సంబంధిత విధేయతలతో పాటు మహిళా ఓటర్ల మద్దతు నితీశ్ విజయాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. 2005లో నితీశ్ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు చదువుకుంటున్న బాలికలు అందరికీ



ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. ఆనాడు లబ్ది పొందిన బాలికలు ఇప్పుడు వయోజన ఓటర్లుగా ఉన్నారు. ఆ మహిళా ఓటర్లే నితీశ్ నాయకత్వానికి, అధికార ప్రాభవానికి వెన్నుదన్నుగా ఉన్నారని చెప్పకతప్పదు. ఈ కారణంగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నితీశ్‌ను ఎన్‌డిఎ పక్షాన ఉంచుకునేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. తనను వ్యతిరేకించిన వారిని క్షమించే అలవాటు లేని మోదీ, ఒకప్పుడు నితీశ్ తనను తీవ్రంగా వ్యతిరేకించారన్న వాస్తవాన్ని పూర్తిగా విస్మరించడం వెనక బీహార్ ప్రయోజనాలే ముఖ్యమని గుర్తించారని చెప్పకతప్పదు. బిహార్‌లో బీజేపీ ఎదుగుదలకు నితీశ్‌తో పొత్తు తప్పనిసరని ప్రధానమంత్రి గ్రహించారు. మరోమారు బీహార్‌లో ఎన్‌డిఎ విజయం సాధిస్తే.. సమీప భవిష్యత్తులో బిహార్‌లో కూడా ఏక్‌నాథ్ షిండే లాంటి తిరుగుబాటు సంభవించే అవకాశం లేకపోలేదు. అయినా ప్రస్తుతానికి మాత్రం బీజేపీ ఎన్నికల విజయాలకు నితీశ్‌కుమార్ ఆవశ్యకత అమితంగా ఉన్నది. లాలూప్రసాద్ యాదవ్‌తో ఉన్న రాజకీయ అనుబంధాన్ని తెగతెంపులు చేసుకుని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనత పార్టీతో నితీశ్ జతకట్టంలో ఆయన స్వార్థం కూడా ఉంది. నిరంతరాయంగా బీహార్ సిఎంగా నిలిచిపోవాలన్న ఆయన కాంక్షను కాదనలేం. రాజకీయ సౌలభ్యం కోసమే ఆయన మళ్లీ మోదీతో చేయి కలిపారు. అలాగని బీజేపీకి నితీశ్ కుమార్ పట్ల ప్రత్యేక ప్రేమ ఏమీ లేదు. 2013లో



ప్రధానమంత్రి పదవికి అవసరమైన అర్హతలు నరేంద్ర మోదీకి లేనేలేవని తొట్టతొలుత నిరసన తెలిపిన నేత నితీశ్‌కుమార్. ఈ విషయాన్ని బీజేపీ మరచిపోయి ఉండదు. అయితే బిహార్‌లో ఎన్డీఏకు సమర్థంగా నేతృత్వం వహించగల నాయకుడు మరొకరు లేరన్న వాస్తవమూ బీజేపీకి బాగా తెలుసు. నితీశ్‌కు ప్రత్యామ్నాయంగా మరెవ్వరూ లేనందునే బీజేపీ ఆయనను ముఖ్యమంత్రిగా కొనసాగనిస్తోంది. వయసు మీదపడడంతో నితీశ్ కుమార్ కూడా తప్పని పరిస్థితుల్లో మోదీయే సర్వం అయిన ఢిల్లీ దర్బార్‌కు విధేయుడుగా ఉంటూ వస్తున్నారు. అయితే మారుతున్న కలానుగుణంగా బిహార్ ఓటర్లలో అత్యధికులు సైతం మౌలిక మార్పులు కోరుకుంటున్నారు. మరి ప్రశాంత్ కిశోర్ నాయకత్వంలోని జన్ సురాజ్ పార్టీకి వారు ఓటు వేస్తారా అన్న చర్చ కూడా సాగుతోంది. తేజస్వి యాదవ్ కూడా గట్టి పోటీ ఇస్తున్నారు. ఇకపోతే బీహార్ ఓటర్ల సవర్ణ రచ్చ కూడా చర్చకు దారితీస్తోంది. ఎంఐఎం కూడా ముస్లిం డామినేట్ ఉన్న ప్రాంతాల్లో బరిలోకి దిగింది. ఈ క్రమంలో బీహార్ ఎన్నికలు ఎవరికి మొగ్గు చూపుతాయి, ప్రజలు ఆలోచన ఏ విధంగా ఉందన్నది కూడా అంతుచిక్కడం లేదు. ఇప్పటికే బిహార్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేయడంలో నితీశ్ రికార్డు సృష్టించారు. ఇప్పటికి మొత్తం తొమ్మిది సార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అనేక పరిమితులు ఉన్నప్పటికీ బిహార్‌కు ఆయన నాయకత్వం తప్పనిసరి అని పలువురు, ముఖ్యంగా బీజేపీ భావిస్తోంది. ఐదు సంవత్సరాల క్రితం కొత్త తరం బిహారీ రాజకీయ నాయకుడు చిరాగ్ పాశ్వాన్‌ను ప్రోత్సహించడం ద్వారా నితీశ్ స్థాయిని తగ్గించేందుకు బీజేపీ ప్రయత్నించింది. నితీశ్ ప్రాధాన్యాన్ని తగ్గించడం ద్వారా జనతాదళ్ (యునైటెడ్) పార్టీ ఓటర్లను తనవైపు తిప్పుకోవాలన్నది బీజేపీ ఎత్తుగడ. గత శాసనసభ ఎన్నికల్లో జనతాదళ్(యు) కేవలం 43 సీట్లు మాత్రమే కైవసం చేసుకోగా బీజేపీ 74 నియోజక వర్గాలలో జయపతాక నెగురవేసింది. అయినప్పటికీ నితీశ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించేందుకు బీజేపీ సంకోచించింది. తమ సొంత అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేసేందుకు సుముఖత చూపలేదు. నితీశ్ కుమార్ అపరచాణక్యుడు. బీజేపీ ఎత్తుగడలను అర్థం చేసుకు న్నారు. ఆ పార్టీతో పొత్తును కొనసాగించడం ప్రమాదకరమని భావించారు. మహారాష్ట్రలో శివసేనను నిలువు నా చీల్చివేసిన రీతిలో బిహార్‌లో తన పార్టీని బీజేపీ చీల్చకుండా ఉంటుందా అని నితీశ్ ఆలోచించారు. అందుకే బిజెపిని తన దగ్గరే పెట్టుకుని జాగ్రత్తగా ఉంటున్నారు. అయితే ఈసారి ఆయన పదోసారి సిఎంగా బాధ్యతలు స్వీకరిస్తారా లేదా అన్నది చూడాలి. ఈక్రమంలో తేజస్వీ యాదవ్ సిఎం కావడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు కాంగ్రెస్ ఘట్‌బందన్ కలసివస్తుందా లేదా అన్నది చూడాలి. అలాగే రాహుల్ ఓట్‌చోరీ ఆరోపణలు ఏమేరకు ఫలితం ఇస్తుందో చూడాలి.

# బీహార్ నాడి ఎవరికి అనుకూలం

- తేజస్వీ పాచిక పారేనా
- ప్రశాంత్ కిశోర్ ప్రభావం చూపేనా

**పాట్నా,నవంబర్10:** మూడున్నర దశాబ్దాల క్రితం మండల్ ఉద్యమంతో ప్రభవించిన నాయకద్వయం లాలూప్రసాద్ యాదవ్, నితీశ్‌కుమార్ ల హవా దగ్గర పడుతోంది. బీహార్‌లోనూ రాజకీయాలు మారుతున్నాయి. లాలూ తనయుడు తేజ్వీ యాదవ్ సైతం రాజకీయాలను ప్రభావితం చేసే దశకు చేరుకున్నారు. ఒకప్పుడు లాలే, నితీశ్‌లు 'బ్రదర్స్ బిహారీ'గా సుప్రసిద్ధమయ్యారు. అయితే పరస్పరం పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్తంవ, భిన్నమైన రాజకీయ ఆలోచనలు వారిలో ఉండేవి. తొలి జనప్రియ నాయకుడుగా అధికార అందలాలు ఎక్కిన లాలూప్రసాద్ యాదవ్ అన్నిరకాల గడ్డి కరిచారు. దీంతో భార్య రబ్రీదేవీని గద్దెపై కూచోబెట్టారు. అద్వానీని అరెస్ట్ చేసి ప్రచారంలోకి వచ్చారు. అయితే గడ్డిదాణా కేసుతో పాటు, అనేక కేసుల్లో జైలుజవీవితం గడిపి ప్రస్తుతం వయసుమీద పడడంతో ఇంటికే పరిమితం అయ్యారు. దీంతో ఇప్పుడు శారీరకంగా బలహీనుడయ్యారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేక పోయారు. పార్టీ బాధ్యతలను పూర్తిగా కుమారుడు తేజస్వి యాదవ్‌కు అప్పగించారు. తేజస్వి నవతరం నాయకుడుగా యువతో మంచి ఫాలోయింగ్ దక్కించుకున్నారు. అయితే తండ్రిలో ఉన్న జన సమ్మోహన శక్తి ఈ యువనేతలో కానరాదు. అనేక ఉచిత పథకాలకు తోడు కాంగ్రెస్ కూటమిలో ఉంటూ అధికార పగ్గాలు అందుకోవాలని ఉవ్వీళ్లూరుతున్నారు. 1970 దశకంలో జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో జరిగిన విద్యార్థి యువజన ఉద్యమం నుంచి పుట్టుకు వచ్చిన నాయకుడు నితీశ్‌కుమార్. ఆయనా ఇప్పుడు వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ ఇద్దరూ ఒకప్పుడు కలసి రాజకీయాలు చేశారు. తరవాత విడివడి ఎవరి దారి వారు చూసుకున్నారు. ఇకపోతే బిహార్ ప్రజలను ఆకట్టుకోగల సమర్థ నాయకత్వం బిహార్‌లో బీజేపీకి లేదు. దీంతో ఇక్కడ బిజెపి ఒంటరిగా అధికారం దక్కించుకునే పరిస్థితి లేదు. దీంతో నితీశ్ నీడ ఎదుగుతూ వస్తోంది. భారత జాతీయ కాంగ్రెస్ బీహార్‌లో పూర్తిగా తుడిచి పెట్టుకుపోయిందనే చెప్పాలి. ఇప్పుడు ఈ పార్టీ దాదాపు అచేతన స్థితిలో ఉన్నది. ఇక యువ నాయకుడు ప్రశాంత్ కిశోర్ బిహారీలను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. జన్ సురాజ్ పార్టీతో ఈ వ్యూహకర్త ఎలాంటి అలజడి సష్టిస్తారా అన్నది చూడాలి. అయితే కులమే నిర్ణయాత్మక అంశంగా ఉన్న బిహార్ రాజకీయాలలో ఈ యువనేత



జయపతాక ఎగురవేయగలడా సంప్రదాయ అధికార నిర్మాణాలు, సామాజిక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఈ కొత్త నేత బిహార్ సమాజంలో మౌలిక మార్పులు తీసుకువస్తానని వాగ్దానం చేస్తున్నారు.ప్రజా జీవితంలో నైతిక విలువలకు నిబద్ధమైన నేతగా పేరుపొందిన నితీశ్‌కుమార్ ఇప్పుడు తన రాజకీయ మనుగడను కాపాడుకోవడంపైనే దృష్టి పెట్టారు. సైద్ధాంతిక విశ్వాసాల స్థానంలో అవకాశవాద రాజకీయాలు ప్రబలిపోయాయి. బిహార్‌లో సుదీర్ఘకాలంగా ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ జోలికి ఏ విధంగానూ పోయేందుకు బీజేపీ సాహసించడంలేదు. బహిరంగంగాను, అంతర్గతంగాను సీనియర్ నాయకుడుగా ఆయన్ని గౌరవిస్తోంది. బిహార్‌లోని బీజేపీ శ్రేణుల్లో పాతకాలం నాటి అగ్రకులాల ఆధిపత్యం ఇప్పటికీ బలీయంగా ఉన్నది. 2015లో బీజేపీ బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో సొంతంగా అన్ని స్థానాలకూ పోటీ చేసింది. మోదీ హవా ఉధృతంగా ఉన్న ఆ కాలంలో కూడా బీజేపీ చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించలేకపోయింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో సొంతంగా మెజారిటీ సాధించలేకపోవడంతో నితీశ్‌కుమార్‌ను బీజేపీ ఏమీ చేయలేకపోతోంది. సంకీర్ణ రాజకీయ ధర్మాన్ని అనుసరిస్తోంది. తనకు మద్దతు నిచ్చిన ప్రతి పార్టీ పట్ల సానుకూల వైఖరితో వ్యవహరించడాన్ని బీజేపీ అలవరచుకున్నది. 2029 సార్వత్రిక ఎన్నికలకు ఇంకా వ్యవధి ఉన్నప్పటికీ ప్రస్తుత దశలో నితీశ్‌ను తొలగించడం శ్రేయస్కరం కాదని బీజేపీ భావిస్తోంది. మొత్తంగా ఇప్పుడు త్రిముఖ పోటీ జరుగుతోంది. మంగళవారం తుదిదశ ఎన్నికలు జరుగున్నాయి. ప్రజలు ఎవరిని ఆదరిస్తారో..ఎవరిని తిరస్కరిస్తారో 14న తేలనుంది.

# దక్షిణాఫ్రికాలు జి20 సదస్సు బహిష్కరణ

- అమెరికా ప్రకటనపై మండిపడ్డ సౌతాఫ్రికా ప్రభుత్వం



**వాషింగ్టన్,నవంబర్10:** దక్షిణా ఫ్రికాలో నిర్వహించనున్న జీ20 సదస్సును బహిష్కరిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం సంచలనంగా మారింది. అమెరికా తరఫున ఒక్క అధికారి కూడా జీ20 సదస్సుకు హాజరు కాబోరని ట్రంప్ ప్రకటించడంపై దక్షిణాఫ్రికా ప్రభుత్వం మండిపడింది. ట్రంప్, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో చేసిన విమర్శలపై దక్షిణాఫ్రికా ప్రభుత్వం, పాలక పార్టీ ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'అమెరికా నాయకులు చేసిన ప్రకటనలు పూర్తిగా అవాస్తవాలు. వారిది సామ్రాజ్యవాద జోక్యం. దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష లేదు. వర్ణవివక్ష సృష్టించిన అసమతుల్యతలను పరిష్కరించడానికే దక్షిణాఫ్రికా చట్టాలు పని చేస్తాయి. సామ్రాజ్యవాద సరసాలను మేము సరదాగా తీసుకోము. అమెరికా పాల్గొనకపోయినా సమ్మిట్ కొనసాగుతుంది. ట్రంప్ వాదనలు, కట్టుకథలను మేము తిరస్కరిస్తున్నాము. మా సార్వభౌమాధికారం పట్ల ట్రంప్ యంత్రాంగానికి ఎలాంటి గౌరవమూ లేదు. వారు మమ్మల్ని అమెరికా ఉపదేశం అని భావిస్తున్నారు' అంటూ ఏఎన్‌సీ సెక్రటరీ జనరల్ ఫికిలే ముబాలులా విమర్శించారు. క్షిణాఫ్రికా ప్రభుత్వం శ్వేత జాతి రైతులతో క్రూరంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ట్రంప్ జీ20 శిఖరాగ్ర సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు . నవంబర్ 22-23 తేదీల్లో దక్షిణాఫ్రికా వేదికగా ఈ సదస్సు జరగబోతోంది. ఆఫ్రికానెర్ కమ్యూనిటీ (దక్షిణాఫ్రికాలోని శ్వేతజాతి రైతులు)పై హింస, దాడులు, భూములు, పొలాల స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్న వారికి దక్షిణాఫ్రికా ప్రభుత్వం మద్దతు ఇస్తోందని ట్రంప్ ఆరోపించారు. అలాంటి దేశంలో జీ20 సదస్సు జరగడం అవమానకరమని, ఆ సదస్సుకు అమెరికా తరఫు నుంచి ఎవరూ హాజరుకాబోరని ట్రంప్ స్పష్టం చేశారు.

# 40 రోజుల పాటు నిలిచిపోయిన ప్రభుత్వ కార్యకలాపాలు

- షట్‌డౌన్ నుంచి బయటపడే దశలో అమెరికా

**వాషింగ్టన్,నవంబర్10:** అమెరికాలో నెలకొన్న ప్రభుత్వ షట్‌డౌన్ మేఘాలు వీడిపోనున్నాయి. దీనికి అనుకూలంగా ఆ దేశ సెనెట్ ఓటింగ్ జరిగింది. కొందరు డెమోక్రాట్లు కూడా అనుకూలంగా ఓటు వేయడంతో 40 రోజుల పాటు నిలిచిపోయిన ప్రభుత్వ కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కానున్నాయి. అమెరికా ప్రభుత్వానికి నిధుల విడుదలకు సంబంధించిన బిల్లులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, కాంగ్రెస్‌కు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మొదలైన షట్‌డౌన్ ఆదివారం నాటికి 40వ రోజుకు చేరుకుంది. దేశవ్యాప్తంగా విమాన సేవలకు అంతరాయం కలగడంతో ఈ ప్రతిష్టంభనను తొలగించడానికి సెనెటర్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా షట్‌డౌన్ ముగించే దిశగా తొలిఅడుగు పడింది. ట్రంప్, రిపబ్లికన్లు ప్రతిపాదించిన ఓ డీల్‌కు కొందరు డెమోక్రాట్లు సానుకూలంగా స్పందించారు. చివరి నిమిషంలో టెక్సాస్ సెనెటర్ జాన్ కార్నిన్ ఓటుతో తీర్మానానికి అనుకూలంగా 60 ఓట్లు వచ్చాయి. సెనెట్‌లో రిపబ్లికన్ సభ్యుల సంఖ్య 53 కాగా.. డెమోక్రాట్ల సంఖ్య 45, ఇద్దరు స్వతంత్రులు ఉన్నారు. అక్కడ బిల్లు ఆమోదం పొందాలంటే 60 ఓట్లు రావాలి. ఇప్పుడు కనీసం ఎనిమిది మంది డెమోక్రాట్లు మద్దతు ఇచ్చారు.అమెరికాలో షట్‌డౌన్ మొదలైతే ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేం.



# కేరళలో కూలిన వాటర్ ట్యాంకర్

- ఆయా ప్రాంతాల్లో పలు ఇళ్లలోకి చేరిన నీరు
- హఠాత్ పరిణామంతో భయాందోళనలో ప్రజలు

**కొచ్చి,నవంబర్10:** కేరళ వాటర్ అథారిటీ ఫీడర్ ట్యాంక్ సోమవారం తెల్లవారుజామున ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో ఆయా ప్రాంతాల్లో పలు ఇళ్లలోకి నీరు చేరింది. నీటి తాకిడికి పలు ఇళ్లు కూలిపోయాయి. దీంతో అనేక ఇళ్లు వరదలో చిక్కుకున్నాయి. ఈ హఠాత్ పరిణామంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నీరు ఉధృతంగా రావడంతో పలు ఇళ్ల పైభాగాలు కూలిపోయాయని.. అనేక వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయని అధికారులు పేర్కొన్నారు. కేరళలోని తమ్మనం అనే ప్రాంతంలో ఉన్న కేడబ్ల్యూఏ నీటి ట్యాంక్ కూలడంతో 1.38 కోట్ల లీటర్ల నీరు ఒక్కసారిగా జనావాసాలపై గుమ్మరించి నట్లు పడిపోయింది. తెల్లవారుజామున 2 గంటలకు కేడబ్ల్యూఏ ఫీడర్ పంప్ హౌస్‌లోని వాటర్ ట్యాంక్‌లో కొంత భాగం కూలిపోవడం తో ఈ సంఘటన జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న ఇళ్లల్లోకి భారీగా నీరు చేరడంతో అనేక ఎలక్ట్రిక్ పరికరాలు, ఫర్నిచర్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. సమీపంలోని ఆరోగ్య కేంద్రంలోకి నీరు చేరడంతో పెద్ద మొత్తంలో మందులు, వైద్య పరికరాలు పాడైనట్లు అధికారులు తెలిపారు.

# తెలంగాణ గీతం రచించిన అందెశ్రీకి ఘనంగా నివాళులు



**ఓదెల: నవంబర్ 10** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం లోని కొలనూరు రైల్వేట్ దగ్గర తెలంగాణ ఉద్యమకార్ల ఫోరమ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ,ఆనాడు తెలంగాణ ఉద్యమం ఉదృతంగా జరుగుతున్న సందర్భంలో జయ జయహే తెలంగాణ గీతం రచించి తెలంగాణ ప్రజల అభినందనలు పొందిన గొప్ప వ్యక్తి, గత ప్రభుత్వం గుర్తించలేదు. ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఆ గీతాన్ని రాష్టియ గీతాంగా ప్రకటించాడు. వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకున్నాడు. తెల్లవారుజామున ఆయన మరణించాడు అయన ఆత్మకు శాంతి కలగాలని అయన ఫొటోకు పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది . ఈ కార్యక్రమం లో కందుల అశోక్ పటేల్, గాజుల శివశంకర్, సాతురి రాజేశం, కర్రే లక్ష్మారెడ్డి, కర్కా మోహన్ రెడ్డి, మేరె శంకరయ్య, శీలం మల్లారెడ్డి, కొంగరి శంకరయ్య, కర్రే ప్రభాకర్ రెడ్డి, సాధాకర్ రెడ్డి, గుండేటి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖేడ్ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో ఘనంగా ఉర్దూ దినోత్సవం



**నారాయణఖేడ్ : నవంబర్ 10, :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని మైనారిటీ బాలుర ఉన్నత పాఠశాలలో అల్లామా ఇక్బాల్ జన్మదిన సందర్భంగా అంతర్జాతీయ ఉర్దూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాములు మాట్లాడుతూ.. అల్లామా ఇక్బాల్ సేవలను స్మరించుకుంటూ పిల్లలు కూడా మంచిగా చదువుకొని ఉన్నత స్థాయి కి ఎదగాలాని కోరారు. ఈ సందర్భంగా పాఠ శాల ప్రధానోపాధ్యాయులు రాములు, పాఠశాల కో–ఆర్డినేటర్ జాకీర్, ఉపాధ్యాయులు కలిసి ఉర్దూ ఉపాధ్యాయులు ఐనా మరూఫ్ అలీ, అక్బర్, ఇస్రత్ సిద్దిఖాలను ఘనంగా సన్మానించారు.
కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్డీఓ



**గుర్రంపోడు: నవంబర్ 10,**
నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను దేవరకొండ రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ రమణా రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాట్లను, జరుగుతున్న ప్రక్రియను పర్యవేక్షించారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.తాలు, తేమ లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని కోరారు.ధాన్యం తూకం వేసిన తర్వాత, సంచుల రవాణా కోసం తగినన్ని వాహనాలను సిద్ధంగా ఉంచాలని రవాణా కాంట్రాక్టర్లకు సూచించారు. ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లు కప్పడం, కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో డబ్బులు చెల్లించడం, నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయడం, ప్యాడీ క్లీనర్లు ఏర్పాటు చేయడం వంటి విషయాలను, తేమ శాతం, నాణ్యత విషయంలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని స్పష్టం చేశారు.కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే లేదా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈయన వెంట ఎమ్మార్వో శ్రీనివాసు, ఏవో మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

# కిటకిటలాడుతున్న శివాలయాలు



**పార్వతీపురం మన్యం జిల్లా : నవంబర్ 10 :** పార్వతీపురం నుండి సుమారు 9 కిలోమీటర్ల దూరంలో సంగం వలస పంచాయతీ పిట్టలవలస గ్రామం వద్ద శ్రీ శ్రీ ఉమా నీలక ంఠేశ్వర స్వామి దేవస్థానం పురాతనమైన ఆలయముగా గుర్తించగా సుమారు 500 సంవత్సరాల నాటి ఆలయముగా పురోహితులు తెలియజేశారు. ఈరోజు కార్తీక మాసం మూడవ సోమవారం కావడంతో భక్తులు తాకిడి పెరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుండి పట్టణాల నుండి శివుని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు. ఈ శివాలయం గుడిలో అన్ని దేవుళ్లను ప్రతిష్టించారు.

# అధికారిక లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు

**హైదరాబాద్:** ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావును సీఎం రేవంత్ ఆదేశించారు.ప్రజాకవి, ప్రకృతి కవిగా సుప్రసిద్ధులైన అందెశ్రీ సోమవారం ఉదయం కన్నుమూశారు. ఆదివారం రాత్రి లాలాగూడలోని తన నివాసంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను గాంధీ దవాఖానకు తరలించారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఉదయం 7.25 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. 64 ఏండ్ల అందెశ్రీ 1961, జూలై 18న ఉమ్మడి వరంగల్ జిల్లా రేబర్తిలో జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. మాయమైపోతున్నడమ్మా గీతంతో గుర్తింపు తెచ్చుకున్నారు. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రగీతంగా గుర్తించింది.






IMMEDIATE

GOVERNMENT OF TELANGANA
GENERAL ADMINISTRATION (POLL.B) DEPARTMENT

FAX/WIRELESS MESSAGE CRASH UNCLASS

TO
THE COLLECTOR AND DISTRICT MAGISTRATE, HYDERABAD.
THE COLLECTOR AND DISTRICT MAGISTRATE, RANGA REDDY.
THE COLLECTOR AND DISTRICT MAGISTRATE, MEDCHAL MALKAJGIRI.
THE COMMISSIONER OF POLICE, CYBERABAD.
THE COMMISSIONER OF POLICE, HYDERABAD.
THE COMMISSIONER, I&PR DEPARTMENT

INF.: THE DIRECTOR GENERAL OF POLICE, TELANGANA, HYDERABAD. (BY HAND)
THE PRL SECY TO CM (BY HAND)

FROM
THE CHIEF SECRETARY TO GOVERNMENT, TELANGANA, HYDERABAD.

FAX/WIRELESS MESSAGE NO.1756/POLL.B/A1/2025 DATED: 10.11.2025

GOVERNMENT DEEPLY REGRETS TO ANNOUNCE THE DEMISE OF SRI ANDE SRI, POET AND LYRICIST ON 10-11-2025, AT HYDERABAD (.) GOVERNMENT HAS DECIDED TO ACCORD FUNERAL WITH POLICE HONOURS TO THE DEPARTED POET (.) THE COLLECTOR AND DISTRICT MAGISTRATE, HYDERABAD IS THEREFORE REQUESTED TO MAKE NECESSARY ARRANGEMENTS IN COORDINATION WITH COLLECTOR AND DISTRICT MAGISTRATE RANGAREDDY / MEDCHAL MALKAJGIRI FOR THE FUNERAL WITH POLICE HONOURS IN CONSULTATION WITH THE FAMILY MEMBERS OF THE DEPARTED POET DULY ASCERTAINING THE FULL DETAILS OF THE DATE, TIME AND PLACE OF PERFORMING LAST RITES (.) COMMISIONERS OF POLICE CONCERNED ARE REQUESTED TO MAKE NECESSARY ARRANGEMENTS FOR TRAFFIC, BANDOBUST AND SECURITY AND POLICE HONOURS FOR THE FUNERAL (.) COMMISSIONER, I&PR IS REQUESTED TO ARRANGE FOR MEDIA COVERAGE OF FUNERAL AND DEPUTE A PHOTOGRAPHER FOR THE COVERAGE (.)

FOR CHIEF SECRETARY TO GOVERNMENT

# మండలరెవిన్యూ కార్యాలయం లో 2020 నుండి పెండింగ్ లో ఉన్న దృవీకరణ పత్రములు జారీ చేయాలని

- కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ కు వినతి పత్రం
- సిపీఎం పార్టీ.సిర్పూర్ నియోజకవర్గం కార్యకర్త
- ముంజం ఆనంద్ కుమార్



**.కొమరం బీమ్ ఆసిఫాబాద్,:నవంబర్ 10**
.కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం కాగజ్ నగర్ మండల రెవిన్యూ కార్యా లయమునందు కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల దృవీకరణ పత్రములు 2020 నుండి చాల దృవీకరణ పత్రములు పెండింగులో ఉన్నందున,ప్రజల కు ఏమి చేయాలో తోచక నిస్సహాయ స్థితిలో ఉన్నారని, కార్యాలయ అధికారులు ఎవరు డబ్బులు ఇస్తే వారివే చేయడం,మిగత వారి దృవీకరణ పత్రములు చేయకపోవడం వలన వందల దృవీకరణ పత్రములు పెండింగులో ఉన్నాయని,ఉన్నతాధికారులు మీసేవ ద్వారా వచ్చిన దృవీకరణ పత్రము లను గురించి సమీక్ష నిర్వహించక పోవడం వలన, తహసిల్దార్ నిమ్మకు నీరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నా రని,పైన తెలిపిన సమస్య తీవ్రతను గ్రహించి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి పెండింగ్ లో ఉన్న దృవీకరణ పత్రమ ులు, అన్ని జారీచేసేలా తగు చర్యలు తీసుకో వాలని కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో వసాకే సాయి, కూచి పూడి ఏసు కుమార్, తిమోతి తదితరులు పాల్గొన్నరని సీపీఎం పార్టీ సిర్పూర్ నియోజ కవర్గం కార్యకర్త ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉల్లాస్ శిక్షణతో సంపూర్ణ అక్షరాస్యత గ్రామ సంఘంగా మారాలి



**కొమరం బీమ్ ఆసిఫాబాద్:నవంబర్ 10**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండలం ఆదర్శ మండల సమాఖ్య లో ఉల్లాస్ అక్షర వికాసం వయోజన విద్యా అవగాహన కార్యక్రమం ద్వారా ప్రతి వివో సంఘం అక్షరాస్యత యువ సంఘంగా మారాలని ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఓరుగల్లు మహా సమాఖ్య సీనియర్ సిఆర్పీలు కవిత, భారతి గ్రామ సంఘాల లీడర్లకు వివోఏ లకు అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీలు మాట్లాడుతూ అన్ని గ్రామాలలో నిరాక్ష రాస్యుల్ని గుర్తించి 100% శాతం అక్షరాస్యత సాధించేలా గ్రామ సంఘం సభ్యురాలు, మండల సమాఖ్య సభ్యురాలు కృషి చేయాలని సూచించారు. చదువుకుంటే కలిగే లాభాలు, చదువు లేకపోతే కలిగే నష్టాలు సమస్యల, గురించి వివరించి వారికి చదువుతో పాటు సంతకాలు కూడా వారికి రావాలని తెలియజేశారు. మహిళలకు చదువు ప్రాముఖ్యత గురించి తెలిపారు. గ్రామ సంఘాల వారి పాత్ర ఏమిటి, మండల సమాఖ్య బాధ్యత ఏమిటి అని చార్ట్ రూపకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య లీడర్లు జి. రాజేశ్వరి అధ్యక్షురాలు, సిహెచ్ పద్మ కార్యదర్శి, కే మమత కోశాధికారి, వివో లీడర్స్, సీసీలు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

# ఆకుతోటపల్లి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం వద్ద జరిగిన నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ మద్దతు



**రంగారెడ్డి జిల్లా, ఆమనగల్ : నవంబర్ 10,**
రంగారెడ్డి జిల్లాఆమన గల్లు మండలంలోని ఆకుతోటపల్లి సమీపంలో ఉన్న సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు డా. పత్య నాయక్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.పత్య నాయక్ మాట్లాడుతూ నిబంధనల మేరకు ప్రతీ ఒక్క రైతు నుండి పత్తిని కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పించాలని పత్తి కొనుగోలు చేయాలన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పత్తి తేమ 12 శాతం ఉంటే కొనుగోలు చేసి వారికి మద్దతు ధరను కల్పించాము.అదేవిధంగా ప్రజా ప్రభుత్వమంటూ రైతులను మభ్యపెడుతున్నారని వెంటనే పత్తిని కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని సీసీఐ సెంటర్ ఇంచార్జి రాజీవ్ మరియు సూపరింటెండెంట్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్,పంతు నాయక్,రమేష్ నాయక్,యూత్ వింగ్ ప్రెసిడెంట్ దేరంగుల వెంకటేష్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ లండం యాదయ్య,ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ రమేష్ నాయక్,వరికుప్పల గణేష్,మహేష్ నేత,గణ్య నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు





**మద్నూర్: నవంబర్ 10,** కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో గుడాల్వర్ సవిత గారి ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారురాలు గుడాల్వర్ సవిత గారిని అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ:– ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు వాస్తవ రూపం దాలుస్తున్నాయన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జుక్కల్ నియోజకవర్గానికి ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా మంజూరు కానీ విషయాన్ని గుర్తు చేశారు.అయితే ఇప్పుడు మన జుక్కల్ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని, కొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహప్రవేశం జరుగుతుండగా మరికొన్ని వివిధ నిర్మాణ దశల్లో ఉన్నట్లు తెలిపారు.పేద ప్రజల సొంతింటి కల ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో సాధ్యమైందని అన్నారు. నిరుపేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా ప్రభుత్వం అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నదని చెప్పారు. జుక్కల్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.నియోజ కవర్గంలో ఒక్క పూరి గుడిసె కూడా లేకుండా ప్రతీ ఒక్కరికీ పక్కా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలన్నదే తన ఆశయం అని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పునరుద్ఘాటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో కృషి చేస్తున్న ప్రభుత్వ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ శాఖ అధికారులు అందరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక మండల అధ్యక్షులు దరస్ వార్ సాయిలు, సీనియర్ నాయకులు సిహెచ్. హన్మండ్లు స్వామి, మేనూరు మాజీ సర్పంచ్ విట్టల్ గురూజీ, సంతోష్ మేస్త్రి, గుడాల విట్టల్, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

మంగళవారం, నవంబర్ 11, 2025 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 10

## సేవా తరుణి ఆధ్వర్యంలో మైక్ సెట్,పుస్తకాల పంపిణీ



తొర్రూరు :లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి క్లబ్ అధ్యక్షురాలు లయన్ తుమ్మూరు శ్రీదేవి రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని నాంచారి మడూర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలకు రూ.16 వేల విలువగల మైక్ సెట్,10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను క్లబ్ తరఫున పంపిణీ చేశారు.క్లబ్ సభ్యురాలు లయన్ అనుపమా రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆమె ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న మడూరు పాఠశాలలో రూ.3 వేల విలువగల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.6,7 తరగతి విద్యార్థులకు నోట్ బుక్స్,8,9 తరగతి విద్యార్థినీ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేశారు.అదే పాఠశాలలో చదువుతున్న విష్ణు అనే విద్యార్థికి ఐఐటి ఎగ్జామ్ ఫీజు కట్టి ఆ అబ్బాయి ఐఐటీలో సెలెక్ట్ అయ్యే విధంగా ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థుల చేతుల మీదుగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.డిస్టిక్ జీఎల్ టి కోఆర్డినేటర్ లయన్ డాక్టర్ వి శారద సహకారంతో మెంటల్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్ అవేర్నెస్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీరన్న,డిస్టిక్ జీఎల్టి కోఆర్డినేటర్ లయన్ డాక్టర్ వేలూరి శారద, ట్రెజరర్ లయన్ వేముల మంజుల,లయన్ స్వాతి, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటి ధృవపత్రాన్ని అందుకున్న విద్యార్థి విష్ణు



తొర్రూరు :ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక కోర్సులను పరిచయం చేసేందుకు స్కూల్ కనెక్ట్ పేరిట ఐఐటి మద్రాస్ 8 వారాల పాటు నిర్వహించే 10 రకాల ఆన్ లైన్ కోర్సులను ఈ విద్యా సంవత్సరంలో తొలి బ్యాచ్ లో పదో తరగతి విద్యార్థులకు లభించింది. దీంతో మండలంలోని నాంచారి మడూరు జయంతి కాలనీ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి పి. విష్ణువర్ధన్ పాఠశాల ఉపాధ్యాయురాలు ఎన్.అనుపమ సహకారంతో డేటా సైన్స్ పరిచయం.ఆర్టిఫిషియల్ ఇంటిలిజేన్స్ కోర్సులో చేరారు. ఆగస్టు 4న ఆన్ లైన్ పాటలు ప్రారంభమై, సెప్టెంబర్ 29 ముగిశాయి. ఆ తర్వాత ఆన్ లైన్ లోనే పరీక్షలు జరిగాయి. తాజాగా ఫలితాలు వచ్చాయి. ఈ కోర్సును విజయవంతంగా పూర్తి పూర్తిచేసుకుని ధృవపత్రాన్ని అందుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరన్న తెలిపారు.పాఠశాల ఉపాధ్యాయులు విష్ణువర్ధన్ అభినందించారు.


## నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన

- దోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్



మరిపెడ :మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని బోత్తల తండా గ్రామానికి చెందిన బోడ రాందాస్ నాయక్, లక్ష్మీతార ల కుమారుడు, (విజయ్ వెడ్స్ సంధ్య గార్ల) రిసెప్షన్ కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన.డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్ మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ గుడిపూడి నవీన్ రామడుగు అచ్యుత్ రావు వారి వెంట డిఎస్ రవిచంద్ర నాయక్ గుగులోతు వెంకన్న , పానుగోతు వెంకన్న పరశురాములు , జాటోతు బాలాజీ, వస్రాం పేపర్ శ్రీను మక్సుద్ , హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు..

## మరోసారి షాక్ ఇచ్చిన బంగారం, వెండి.. ఒకేరోజు భారీగా పెరిగిన ధరలు



పసిడి ధరలు కొనుగోలుదారులకు మరోసారి షాక్ ఇచ్చాయి. సోమవారం మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పరిగాయి. 24 క్యారెట్ల పసిడి రూ.1,300 పెరిగి తులానికి రూ.1,25,900 కి చేరుకుంది. వెండి సైతం రూ.2,460 పెరిగి కిలో ధర రూ.1,55,760కి చేరుకుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అమెరికా ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటం, డాలర్ విలువ పడిపోవడంతో పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. దాంతో డిమాండ్ పెరిగి ధరలు పెరిగాయి. ఫెడరల్ రిజర్వ్ తదుపరి సమావేశంలో వడ్డీ రేటు తగ్గుతుందనే అంచనాలు కూడా బంగారం ధరలకు మద్దతు ఇస్తున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లోని కమోడిటీ నిపుణుడు సౌమిల్ గాంధీ తెలిపారు.వెండి ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. శుక్రవారం కిలోకు రూ.1,53,300 నుంచి ప్రస్తుతం రూ.1,55,760కి చేరాయి. ప్రపంచ మార్కెట్లో బంగారం, వెండి ధరలు కూడా పెరిగాయి.

# మార్పే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ సేవలు

- పింగిలి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి








తొర్రూరు :జాతీయ సేవా పథకం కార్యకర్తలంతా సామాజిక సేవే పరమావధిగా పనిచేయాలని హనుమకొండ పింగిలి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి చంద్రమౌళి అన్నారు.తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, యూనిట్ విభాగాల ఆధ్వర్యంలో మండలంలోని చెర్లపాలెం గ్రామంలో కొనసా గుతున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిరం సోమవారం తో ముగి సింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాములు అధ్యక్షతన నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వాల్యా నాయక్, డాక్టర్ సుజాత లతో కలిసి ప్రొఫెసర్ చంద్రమౌళి మాట్లాడారు.సామాజిక సేవతోనే పరిపూర్ణ పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) దోహదపడుతుందన్నారు. సమాజ మార్పు కోసం విద్యార్థులు కృషి చేయాలని కోరారు. విద్యతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా. పాల్గొ నడం. ఆహ్వానించదగిందన్నారు. విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలని కోరారు.వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి పోచయ్య మాట్లాడుతూ.జాతీయ సేవా పథకం విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికి దోహదపడుతుందని, ప్రత్యేక క్యాంపుల ద్వారా విద్యార్థులు అనేక సామాజిక అంశాలు నేర్చుకుంటారని తెలిపారు. అనం తరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, రిటైర్డ్ హెచ్ఎంలు ఏ. కృష్ణా౦డ్డి, ఏ. రంగారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శాంతి కుమార్ , ఐ క్యూ ఏసీ కోఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డా క్టర్ ఆర్. సునీల్, పాఠశాల ఇన్చార్జ్ హెచ్ఎం తనూజ, యా కూబ్ అలీ, విద్యార్థులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# బాదంపాలను ఇలా సహజసిద్ధంగా తయారు చేసి తాగండి.. ఎన్నో లాభాలు కలుగుతాయి



బాదంపప్పును తినడం వల్ల ఎన్ని ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. బాదంపప్పును గుప్పెడు మోతాదులో తీసుకుని రాత్రంతా నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయం వాటిని పొట్టు తీసి తినాలి. దీని వల్ల అనేక లాభాలు కలుగుతాయి. ఆరోగ్యంగా ఉండేందుకు, పోషకాలు సరిగ్గా లభించేందుకు గాను బాదంపప్పును రోజూ తినాలని పోషకాహార నిపుణులు, వైద్యులు సూచిస్తుంటారు. అయితే బాదంపప్పును రోజూ తినడం ఇబ్బందిగా ఉందని భావించే వారు బాదంపాలను ఒకేసారి తయారు చేసి వాటిని నిల్వ చేసుకుని రోజూ కాస్త మోతాదులో తాగవచ్చు. ఇది చాలా సులభతరమైన పనే కాదు, రోజూ బాదంపప్పును తిన్నంత లాభాన్ని అందిస్తుంది. పైగా బాదం పప్పు సులభంగా జీర్ణం కాని వారు బాదంపాలను తయారు చేసుకుని తాగవచ్చు. దీని వల్ల అవి సులభంగా జీర్ణమవుతాయి. అనేక పోషకాలను, ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి బాదంపాలను చాలా సులభంగా తయారు చేయవచ్చు. బాదంపప్పును కనీసం 10 నుంచి 12 గంటల పాటు నీటిలో నానబెట్టాలి. లేదా రాత్రంతా నీటిలో నానబెట్టాలి. ఒక కప్పు బాదంపప్పును అలా నానబెట్టిన తరువాత వాటిని పొట్టు తీసి మిక్సీలో వేసి కాసిన్ని నీళ్లు పోసి మెత్తగా పట్టుకోవాలి. దీంతో బాదంపాలు రెడీ అవుతాయి. ఇలా ఒక కప్పు బాదంపప్పులతో సుమారుగా 5 కప్పుల మేర బాదంపాలను తయారు చేయ వచ్చు. ఈ పాలను నిల్వ చేసి రోజూ 100 ఎంఎల్ మోతాదులో అయిపోయే వరకు తాగవచ్చు. ఈ విధంగా చాలా సులభంగా బాదంపాలను తయారు చేసి తాగవచ్చు. అయితే మార్కెట్‌లో మనకు బాదంపాలు లభిస్తాయి. వాటిని తాగవచ్చు కదా అని చాలా మందికి సందేహం వస్తుంది. కానీ ఆ పాలలో బాదంపప్పుల శాతం చాలా స్వల్పంగా ఉంటుంది. పైగా చక్కెర, ఇతర కృత్రిమ పదార్థాలను అందులో కలుపుతారు. కనుక ఆ పాలు శ్రేయస్కరం కాదు. బాదంపాలను ఇంట్లోనే సహజసిద్ధంగా తయారు చేసుకుని తాగాల్సి ఉంటుంది. దీంతో అనేక లాభాలను పొందవచ్చు.బరువు తగ్గేందుకు.. బాదం పాలను తాగడం వల్ల క్యాలరీలు చాలా స్వల్పంగా లభిస్తాయి. ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు ఉంటాయి కనుక ఈ పాలను తాగితే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. దీని వల్ల బరువు తగ్గడం చాలా తేలికవుతుంది. అధిక బరువును తగ్గించుకోవాలని చూస్తున్నవారు కచ్చితంగా రోజూ బాదంపాలను తాగుతుంటే ఎంతగానో ప్రయోజనం లభిస్తుంది. అలాగే ఈ పాలను తాగడం వల్ల క్యాల్షియం అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. విరిగిన ఎముకలు త్వరగా అతుక్కునేలా చేస్తుంది. ఈ పాలలో ఉండే మెగ్నిషియం కండరాలకు మేలు చేస్తుంది. కండరాల నొప్పులను తగ్గించి కండరాలు ప్రశాంతంగా మారేలా చేస్తుంది. ఈ పాలలో మాంగనీస్, విటమిన్ కె, ఇ, ప్రోటీన్లు, జింక్, కాపర్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎముకల నిర్మాణానికి సహాయం చేస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఇన్‌ఫెక్షన్లను తగ్గేలా చేస్తాయి.శిరోజాల సంరక్షణకు. .బాదంపాలను తాగడం వల్ల శిరోజాలకు ఎంతో మేలు జరుగుతుంది. జుట్టు రాలడం తగ్గుతుంది. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా ఆరోగ్యంగా ఉంటాయి. సాధారణ పాలు కొందరికి అలర్జీలను కలిగిస్తాయి. పాలను తాగలేకపోతారు. అలాగే సాధారణ పాలు కొందరికి జీర్ణం కావు. దీని వల్ల అలాంటి వారు కూడా పాలను తాగలేకపోతుంటారు. కానీ అలాంటి వారందరూ బాదంపాలను తాగవచ్చు. ఇవి అలర్జీలను కలిగించవు. పైగా సులభంగా జీర్ణం అవుతాయి. దీంతోపాటు అనేక పోషకాలను అందిస్తాయి. కనుక పాలు అంటే అలర్జీ ఉన్నవారు బాదంపాలను తాగవచ్చు. ఇక బాదంపాలను తాగడం వల్ల విటమిన్ డి అధిక మొత్తంలో లభిస్తుంది. విటమిన్ డి లోపం ఉన్నవారు రోజూ ఈ పాలను తాగుతుంటే ఉపయోగం ఉంటుంది. బాదం పాలను తాగడం వల్ల అందులో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్లు, ప్రోటీన్లు షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు దోహదం చేస్తాయి. దీని వల్ల డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఇలా బాదంపాలను తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# హై బిపి పేషెంట్స్ ఇవి తింటే చాలా డేంజర్..



ప్రపంచవ్యాప్తంగా అధిక రక్తపోటు కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ డేటా ప్రకారం, దాదాపు 4 మందిలో ఒకరు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. అధిక రక్తపోటు గుండెపై ఒత్తిడిని పెంచుతుంది, ఇది గుండెపోటు, మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదాన్ని పెంచుతుంది. ఈ సమస్య కేవలం వృద్ధులలో మాత్రమే కాకుండా, యువతలో కూడా కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణాలు సరైన ఆహారం తీసుకోకపోవడం, ఒత్తిడి, నిద్ర లేకపోవడం, ఊబకాయం, వ్యాయామం చేయకపోవడమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.అధిక రక్తపోటు అభివృద్ధి చెందడానికి ఆహారం ప్రధాన కారణం. కాబట్టి, ఈ సమస్యతో బాధపడేవారు ఆహారాన్ని నియంత్రించడం చాలా ముఖ్యం. ఆరోగ్యకరమైన ఆహారం తినడం వల్ల మందుల అవసరాన్ని తగ్గించవచ్చు. బయటి భోజనం, జంక్ ఫుడ్, ఇన్‌స్టంట్ ఫుడ్‌తో కూడిన భోజనం శరీరంలో సోడియం, చెడు కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది, ఇది రక్తపోటు వేగంగా పెరగడానికి దారితీస్తుంది. అందువల్ల, అధిక రక్తపోటు ఉన్న రోగులు వారి ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.హై బిపి పేషెంట్స్ ఏవి తినకూడదు?అధిక రక్తపోటు ఉన్నవారు ముందుగా ఉప్పు ఉన్న ఆహారాలకు దూరంగా ఉండాలని నిపుణులు వివరిస్తున్నారు. చిప్స్, ఊరగాయలు, ప్రాసెస్ చేసిన మాంసాహారాలు, ఇన్‌స్టంట్ నూడుల్స్ , ప్యాక్ చేసిన సూప్‌లు వంటి వాటిలో సోడియం అధికంగా ఉంటుంది. ఈ ఆహారాలు రక్త నాళాలను కుదిస్తాయి, రక్తపోటు వేగంగా పెరగడానికి కారణమవుతాయి. అధికంగా వేయించిన ఆహారాలు, బేకరీ ఉత్పత్తులు, అధిక చక్కెర కలిగిన స్వీట్లు కూడా గుండెపై ఒత్తిడిని పెంచుతాయి. మాంసం, ట్రాన్స్ ఫ్యాట్స్ ఉన్న ఫాస్ట్ ఫుడ్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం కూడా హానికరం. కార్బోనేటేడ్ పానీయాలు, పిజ్జా, బర్గర్లు, ఫ్రెంచ్ ఫ్రైస్ కూడా అధిక రక్తపోటు ఉన్నవారికి మంచివి కాదు. కాబట్టి, వీటిని తినడం మానేసి వీలైనంత ఎక్కువగా తక్కువ సోడియం కలిగిన ఆహారాలను తినండి.

# త్వరలో మరిన్ని గమ్యస్థానాలకు విమానాలను నడుపనున్న ఆకాశ ఎయిర్‌లైన్స్




ఆకాశ ఎయిర్ త్వరలో మరికొన్ని దేశీయ, అంతర్జాతీయ రూట్‌లో విమానాలను ప్రారంభించనున్నది. ఈ మేరకు బోయింగ్ నుంచి విమానాలను త్వరగా తీసుకురావాలని ఆశియస్తున్నట్లుగా సీనియర్ ఎయిర్‌లైన్ అధికారి సోమవారం తెలిపారు. ఆకాసా ఎయిర్‌లైన్స్ 2022 ఆగస్టులో తొలిసారిగా కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రస్తుతం ఆ కంపెనీకి 30 విమానాలు ఉన్నాయి. 24 దేశీయ, మరో ఆరు అంతర్జాతీయ గమ్యస్థానాలకు విమానాలను నడుపుతుంది. త్వరలోనే ఢిల్లీ నుంచి మరికొన్ని అంతర్జాతీయ విమానాలను ప్రారంభిం చనున్న ట్లు ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రవీణ్ అయ్యర్ పేర్కొన్నారు. ఎయిర్‌లైన్ ప్రస్తుతం ఢిల్లీ నుంచి ప్రతిరోజూ 24 విమానాలను నడుపుతోంది. సింగపూర్, ఉజ్బెకిస్తాన్, ఇండోనేషియా, వియత్నాం, తాష్కెంట్‌తో సహా వివిధ విదేశీ గమ్యస్థానాలకు విమానాలను నడపాలని ఎయిర్‌లైన్ యోచిస్తుందని అయ్యర్ ఓ బ్రీఫింగ్‌లో చెప్పారు. ఆకాశ ఎయిర్ ప్రస్తుతం ఆరు అంతర్జాతీయ నగరాలకు విమానాలను నడుపుతోంది. ఇందులో దోహా (ఖతార్), జెడ్డా, రియాద్ (సౌదీ అరేబియా), అబుదాబి (యూఏఈ), కువైట్ సిటీ, ఫుకెట్ (థాయిలాండ్) ఉన్నాయి. ఎయిర్‌లైన్ మొత్తం 226 బోయింగ్ 737 మాక్స్ విమానాలను ఆర్డర్ చేసింది. అయితే, డెలివరీలో జాప్యం జరుగుతున్నది. బోయింగ్ ఉత్పత్తిని పెంచుతున్నందున కంపెనీకి వేగంగా విమానాలు వస్తాయని ఆశిస్తున్నట్లుగా అయ్యర్ తెలిపారు. అనుబంధ ఆదాయ వృద్ధిపై సంతోషంగా ఉన్నామని.. లోడ్ ఫ్యాక్టర్, విమాన ఛార్జీల పరంగా ప్రస్తుతం సమతుల్యత ఉందని ఆయన వివరించారు.

# తండ్రి ఫుట్‌పాత్ వ్యాపారి కూతురు వరల్డ్ ఛాంపియన్



సమాన అవకాశాలు కల్పిస్తే ప్రతిభలో తామేమీ తీసిపోమని చాటుతున్నారు ఈ కాలం అమ్మాయిలు. 'జెంటిల్మన్ ఆట'గా ముద్రపడిన క్రికెట్‌లోనూ రాణిస్తూ ఔరా అనిపిస్తున్నారు. తగిన ప్రోత్సాహం, ఆర్థిక తోడ్పాటు లభిస్తే తమ కలను సాకారం చేసుకొని.. రాబోయే తరానికి స్ఫూర్తిగా నిలుస్తామని నిరూపిస్తున్నారు. ఇటీవల వన్డే వరల్డ్ కప్ సాధించిన భారత క్రికెటర్లలో చాలామందిది ఇలాంటి కథ. కానీ, అందరిలో కామన్ పాయింట్ ఏంటంటే.. ఫ్యామిలీ మద్దతు ఉండడం. ఫుట్‌పాత్ వ్యాపారి అయిన తండ్రి చాలీచాలని సంపాదనతో ఈ రోజు దేశం గర్వించదగ్గ ప్లేయర్‌గా మారింది రాధా యాదవ్ . చిన్నప్పుడు 'అబ్బాయిలతో కలిసి క్రికెట్ ఆడుతావా?' అనే ప్రశ్నల నుంచి 'నీ ఆట సూపర్' అనే ప్రశంసలు అందుకుంటున్న రాధా స్ఫూర్తిదాయక ప్రస్థానమిది.ప్రపంచకప్ ఛాంపియన్‌గా ప్రశంసలు, రివార్డులు అందుకున్న భారత మహిళా క్రికెటర్లు విజయ గర్వాన్ని ప్రదర్శించడం లేదు. మహిళల క్రికెట్టా? అనే చిన్న చూపును తుడిచేసిన శక్తులుగా గర్వపడుతున్నారు. అవును.. రాధా యాదవ్ కూడా చిన్నప్పుడు ఎన్నో విమర్శలు ఎదుర్కొంది. కానీ, ఇప్పుడు తాను విశ్వ విజేతగా నిలవడానికి కుటుంబమే కారణమంటోంది తను. చిన్నప్పుడు పేదరికం కష్టాలు తెలియకుండా పెంచిన తల్లిదండ్రులు, అడుగడుగునా అండగా నిలిచిన సోదరులను మరువలేనని అంటున్న రాధ స్వరాష్ట్రం మహారాష్ట్ర. ముంబైలోని కండీవలీ ప్రాంతానికి చెందిన ఆమె.. వరల్డ్ కప్ విజేతగా ఆదివారం వడోదర చేరుకోగా అపూర్వ స్వాగతం లభించింది.వరల్డ్ కప్ విక్టరీని ఆస్వాదిస్తున్న రాధ చరిత్రాత్మక వరల్డ్ కప్ విజయం, తన కుటుం బం గురించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది. 'వరల్డ్ కప్ విజయం అనేది చాలా పెద్దది. టీమిండియా విశ్వ విజేతగా నిలవడం మహిళా క్రికెట్‌లో గొప్ప మార్పులకు శ్రీకారం చుడుతుందని నమ్ముతున్నా. ఒకప్పుడు మహిళా క్రికెట్ మ్యాచ్‌లు చూసేందుకు ఎవరూ వచ్చేవారు కాదు. కానీ, ఇప్పుడు మాకంటూ అభిమానులు ఉన్నారు. వరల్డ్ కప్ ట్రోఫీతో ముంబై చేరుకున్నాక మాకు లభించిన అపూర్వ స్వాగతాన్ని మర్చిపోలేను' అని రాధ తెలిపింది.పాలు, కూరగాయలు అమ్ముతూ'ఫైనల్ సమయంలో దేవుడా ఈ వరల్డ్ కప్ మాకు అందివ్వు అని దేవుడిని ప్రార్థించాను. సెమీ ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించడంతో మాలో ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో అందరం సర్వశక్తులు ఒడ్డాలనుకున్నాం. ప్రతిఒక్కరం వంద శాతం మెరుగ్గా ఆడాలని అనుకున్నాం. ఆ దేవుడి ఆశీస్సులు ఉండడంతో అనుకున్నట్టే వరల్డ్ కప్ సాధించాం' అని ఫైనల్ రోజును గుర్తు చేసుకున్న తన ఫ్యామిలీ గురించి మాట్లాడుతూ.. 'మాది ముంబైలోని కండీవలీ అనే ప్రాంతం. నాన్న ఓం ప్రకాశ్ ఫుట్‌పాత్ మీద పాలు, కూరగాయలు అమ్మేవారు. నేను క్రికెట్ ఇష్టపడడం చూసి నాన్న ప్రోత్సహించారు. సోదరులు మోను, దీపక్‌లు ప్రోత్సహించడమే కాదు నాకు బౌలింగ్ చేసేవారు. మా సోదరి సోని కూడా మద్దతుగా నిలవగా నేను ఆటను సీరియస్‌గా తీసుకున్నా.అయితే.. ఇరుగుపొరుగు, బంధువులు మా నాన్నతో మీ కూతురు అబ్బాయిలతో క్రికెట్ ఆడుతోంది. పెళ్లి చేసి పంపకుండా ఆటలు ఆడిస్తున్నావా?' అని అనేవారు. కానీ, ఆయన వారి మాటలు పట్టించుకోకుండా 'బిడ్డా.. నువ్వు ఆడు. పెద్ద క్రికెటర్ అవ్వు' అని ఆశీర్వదించేవారు' అని వెల్లడించిన రాధ .. 19 ఏళ్ల వయసులో బీసీసీఐ కాంట్రాక్ట్ సాధించింది. అప్పుడు వచ్చిన డబ్బులతో తండ్రికి చిన్న షాపు పెట్టించింది. కూతురిని కొడుకులా పెంచి.. స్వేచ్ఛగా ఎదగనిస్తే కుటుంబానికి అండగా నిలుస్తుందని నమ్మిన రాధ తండ్రి నమ్మకం నిజమైంది. నవంబర్ 2న భారత జట్టు వరల్డ్ కప్ ట్రోఫీతో మైదానంలో చేసుకున్న సంబురాల్లో రాధ తండ్రి ఓం ప్రకాశ్ కూడా పాల్గొన్నారు. కోచ్ అన్మోల్ మజుందార్ ట్రోఫీని అందించగా తలపై పెట్టుకొని చాలా మురిసిపోయారాయన. తన కూతురి విజయాన్ని ఆయన మనసారా ఆస్వాదించిన వీడియో నెట్టింట వైరలవుతోంది.

# గిప్టుల పేరుతో ఫ్రీ పబ్లిసిటీ




హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత మహిళా క్రికెట్ జట్టు నవంబర్ 2న ఫైనల్‌లో సౌతాఫ్రికాను ఓడించి తొలిసారిగా వరల్డ్ కప్ టైటిల్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని ఐసీసీ నుండి వచ్చిన రూ.40 కోట్ల ప్రైజ్ మనీతో పాటు, బీసీసీఐ రూ.51 కోట్ల బహుమతిని ప్రకటించింది. పలు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నగదు ప్రకటిస్తున్నాయి. ఈ వాతావరణంలో భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ విజేత జట్టుకు ఓ ముఖ్యమైన హెచ్చరిక చేశారు. బహుమతు లుగా ఇచ్చిన వాగ్దానాలు నెరవేరకపోతే నిరాశ చెందవద్దని ఆయన మహి ళా క్రికెటర్లకు సూచించారు.భారత మహిళా జట్టు వరల్డ్ కప్ విజయం తర్వాత దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సునీల్ గావస్కర్ మిడ్-డే పత్రికలో రాసిన తన కాలమ్‌లో మహిళా క్రికెటర్లకు ఒక హెచ్చరిక చేశారు. "ఆటగాళ్లకు ఒకటే హెచ్చరిక.. మీకు వాగ్దానం చేసిన కొన్ని బహుమతులు అందకపోతే నిరాశ చెందకండి." భారతదేశంలో విజేతల ప్రచారం కోసం యాడ్ ఏజెన్సీలు, బ్రాండ్‌లు, వ్యక్తులు హడావుడి చేసి, విజేతల భుజాలపై ఫ్రీ పబ్లిసిటీ పొందడానికి ప్రయత్నిస్తారని గవాస్కర్ పేర్కొన్నారు.ఓ సారి టీమ్‌కు శుభాకాంక్షలు చెప్పే పేజీ నిండా ప్రకటనలు, హోర్డింగ్‌లను పరిశీలించండి. వారు టీమ్ లేదా ఆటగాళ్లకు స్పాన్సర్‌లు కాకపోతే, వారంతా కేవలం తమ బ్రాండ్‌ను లేదా తమను తాము ప్రమోట్ చేసుకోవడానికి మాత్రమే ప్రయత్నిస్తున్నారని, దేశానికి గౌరవం తెచ్చిన వారికి ఏమీ ఇవ్వడం లేదని గవాస్కర్ విమర్శించారు. గవాస్కర్ 1983లో భారత్ తొలి వన్డే ప్రపంచ కప్ గెలిచిన జట్టులో సభ్యుడు. ఆ సమయంలో తమ జట్టుకు ఎదురైన అనుభవాలను ఆయన మహిళా క్రికెటర్లకు గుర్తు చేశారు.1983 ప్రపంచ కప్ విజయం తర్వాత కూడా తమ జట్టుకు అనేక వాగ్దానాలు చేశారని, అప్పట్లో మీడియాలో పెద్ద ఎత్తున కవరేజ్ కూడా వచ్చిందని గవాస్కర్ గుర్తు చేసుకున్నారు. "అయితే, ఆ వాగ్దానాలలో చాలావరకు ఎప్పుడూ నెరవేరలేదు" అని ఆయన స్పష్టం చేశారు. మీడియాను నిందించలేమని, ఎందుకంటే వారు కేవలం పెద్ద పెద్ద ప్రకటనలను చూపించడంలో సంతోషించారు తప్ప, ఈ వ్యక్తులు తమను కూడా వాడుకుంటున్నారని వారికి తెలియదని గవాస్కర్ వ్యాఖ్యానించారు.బహుమతుల వాగ్దానాలు నెరవేరకపోయినా, నిరాశ చెందవద్దని గవాస్కర్ మహిళా జట్టుకు ధైర్యం చెప్పారు. "ఒక సాధారణ భారతీయ క్రికెట్ ప్రేమికుడి ప్రేమ, అభిమానం మా అతిపెద్ద సంపద అని 1983 జట్టు సభ్యులు మీకు చెబుతారు. మీరు మైదానంలోకి అడుగుపెట్టినప్పుడు అది మీ సంపద అవుతుంది" అని గవాస్కర్ పేర్కొన్నారు. చివరగా, మహిళా జట్టుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ.. 'దేశం మీ గురించి గర్వపడుతోంది. జై హింద్!' అని తమ కాలమ్‌ను ముగించారు.

# జురెల్‌కు బెర్త్ ఖరారే



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో జరుగబోయే రెండు టెస్టుల సిరీసకు ముందు వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ అద్భుత ఫామ్‌ను చాటుకున్నాడు. దక్షిణాఫ్రికా 'ఎ' జట్టుతో జరిగిన రెండో అనధికార టెస్టులో అతను రెండు ఇన్నింగ్స్‌లోనూ అజేయ శతకాలతో ఆకట్టుకున్నాడు. దీంతో ఈనెల 14 నుంచి జరిగే తొలి టెస్టులో అతడికి తుది జట్టులో చోటు ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొంది. గతంలో పంత్ గాయం కారణంగా ఇంగ్లండ్ పర్యటనలో ఐదో టెస్టు, విండీసతో రెండు టెస్టులకు జురెన్ ప్రధాన కీపర్‌గా వ్యవహరించాడు. అయితే పంత్ ఇప్పుడు గాయం నుంచి కోలుకుని టెస్టు జట్టులో వైస్‌కెప్టెన్ హోదాలో ఉన్నాడు. కాబట్టి కీపర్‌గా పంత్ కొనసాగడం ఖాయమే. అయితే ఫామ్‌లో ఉన్న జురెల్‌ను ఎక్కడ ఆడించాలనేది కోచ్ గంభీర్‌కు సవాల్ కానుంది. దేశవాళీ సీజన్ ఆరంభమైనప్పటి నుంచి అతడి చివరి 8 ఫస్ట్‌క్లాస్ ఇన్నింగ్స్‌ల్లో 631 రన్స్ సాధించాడు. ఈనేపథ్యంలో జురెల్‌ను బెంచీకే పరిమితం చేస్తే విమర్శలు తప్పవు.తొలి టెస్టులో జురెల్‌ను స్పెషలిస్ట్ బ్యాటర్‌గా బరిలోకి దించితే ఎవరి స్థానంలో ఆడతాడనేది చర్చనీయాంశ ంవుతోంది. ఇందుకు వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌లలో ఒకరిని తప్పించాల్సి ఉంటుంది. అయితే చివరి టెస్టులో సాయి హాఫ్ సెంచరీ సాధించాడు. ఇక మిగిలింది నితీశ్ కుమార్ చోటే. స్వదేశీ పిచ్‌లపై అతడి బౌలింగ్ జట్టుకు పెద్దగా అవసరం పడకపోవచ్చు. అలాగే జురెల్ ఫామ్‌తో పోలిస్తే నితీశ్‌ను తుది జట్టులోకి తీసుకుని ఆడించడం కష్టమే. దీనికి తోడు నితీశ్ గతనెలలో విండీసతో జరిగిన తొలి టెస్టులో కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే బౌలింగ్ వేశాడు. ఇక రెండో టెస్టులో బ్యాటింగ్‌లో 43 పరుగులు చేసినా.. ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో నితీశ్ స్థానంలో జురెల్‌ను ఆడించడం ఖాయంగానే కనిపిస్తోంది. ఒకవేళ అదే జరిగితే 1986లో కిరణ్ మోరే, చంద్రకాంత్ పండిట్‌ల తర్వాత భారత తుది జట్టులో ఇద్దరు స్పెషలిస్ట్ కీపర్లు బరిలోకి దిగినట్టవుతుంది.ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి?రెండో అనధికార టెస్టులో భారత్ 'ఎ' విధించిన 417 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 'ఎ' ఛేదించడం భారత టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆలోచనలో పడేసింది. సిరాజ్, ఆకాశ్, ప్రసిద్ధ్, కుల్దీపలాంటి బౌలర్లను దీటుగా ఎదుర్కొని భారీ ఛేదనను పూర్తి చేయడంతో బౌలింగ్ లైన్‌పపై కోచ్ దృష్టి సారించాడు. ప్రధాన పేసర్లుగా జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్‌లు ఆడడం దాదాపు ఖాయమే. ఇక బ్యాటర్‌గా జురెల్‌ను తీసుకుంటే ముగ్గురు స్పిన్నర్లు జడేజా, సుందర్, కుల్దీప్ తుది జట్టులో ఉంటారు.

# మీరు ఉద్యోగం మానేసిన తర్వాత మీ పీఎఫ్ ఖాతా క్లోజ్ అవుతుందా




ప్రభుత్వ సామాజిక భద్రతా సంస్థ అయిన ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ వ్యవస్థీకృత రంగ ఉద్యోగుల కోసం ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ పథకాలను నిర్వహిస్తుంది. ఉద్యోగం చేస్తున్నప్పుడు, పదవీ విరమణ తర్వాత ఖాతాల నుండి ఉపసంహరణలకు సంబంధించి కొన్ని నియమాలను సవరించింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఉద్యోగం కోల్పోయిన తర్వాత లేదా నిరుద్యోగిగా మారిన తర్వాత పీఎఫ్ ఖాతా నుండి 75% బ్యాలెన్స్‌ను ఉపసంహరించుకోవచ్చు. అయితే 25% వెంటనే ఉపసంహరించుకోలేము. దాని కోసం ఒక సంవత్సరం పాటు వేచి ఉండాల్సి ఉంటుంది. కానీ ప్రజల మదిలో మెదులుతున్న ఒక ప్రశ్న ఏమిటంటే, ఉద్యోగం కోల్పోయిన తర్వాత ఈపీఎఫ్‌వో ??ఖాతాను మూసివేస్తారా? డిపాజిట్లపై వడ్డీ రాదా? నియమాలు ఏమి చెబుతు న్నాయో తెలుసుందాం.మీ ఉద్యోగాన్ని వదిలేసిన తర్వాత కూడా సభ్య త్వం కొనసాగుతుందా? నిబంధనల ప్రకారం, మీరు ఒకసారి ఉద్యోగం మారిన తర్వాత మీ సభ్యత్వం గడువు ముగియదు. అంటే మీరు మీ ఉద్యోగాన్ని విడిచిపెట్టిన తర్వాత కూడా మీ సభ్యత్వం కొనసాగుతుంది. మీరు మీ మొత్తం పీఎఫ్ మొత్తాన్ని ఉపసంహరించుకునే వరకు ఇది కొనసాగుతుంది.మీకు ఎంతకాలం వడ్డీ లభిస్తుంది?మీరు మీ ఉద్యోగాన్ని వదిలివేసి మీ ఖాతాకు ఎటువంటి సహకారాలు జమ కాకపోతే, మీకు మూడు సంవత్సరాల పాటు వడ్డీ అందుతూనే ఉంటు ంది. నిబంధనల ప్రకారం. వరుసగా మూడు సంవత్సరాలు ఖాతాకు ఎటువంటి సహకారం అందించకపోతే ఆ ఖాతాను "నిష్క్రియం"గా పరిగణిస్తారు. తర్వాత ఖాతాపై వడ్డీ పెరగడం ఆగిపోతుంది: ఉదాహ రణకు, ఒక వ్యక్తి జూన్ 2022లో తన ఉద్యోగాన్ని వదిలివేసి ఆ తర్వాత కొత్త విరాళాలు చెల్లించకపోతే జూన్ 2025 వరకు వడ్డీ పెరుగుతూనే ఉంటుంది. ఆ తర్వాత, వడ్డీ ఆగిపోతుంది.వడ్డీ చెల్లింపులు:నిలిచిపోవడం అంటే మీ డబ్బు పోయిందని అర్థం కాదని అర్థం చేసుకోవడం ముఖ్యం. మీ అసలు, గత వడ్డీ లో సేఫ్‌గా ఉంటాయి. ఆన్‌లైన్‌లో క్లెయిమ్ దాఖలు చేయడం ద్వారా మీరు ఎప్పుడైనా ఈ డబ్బును ఉపసంహరిం చుకోవచ్చు.మీరు కొత్త ఉద్యోగంలో చేరి కొత్త ఈపీఎఫ్ ఖాతాను తెరిస్తే మీ పాత పీఎఫ్ బ్యాలెన్స్‌ను మీ ఉపయోగించి బదిలీ చేయవచ్చు. బదిలీ తర్వాత మీ సభ్యత్వం, విరాళాలు మళ్లీ యాక్టివ్‌గా మారతాయి. ఇది మీ సర్వీస్ వ్యవధి నిరంతరంగా పరిగణించబడటమే కాకుండా మీరు వడ్డీని సంపాదిస్తూనే ఉన్నారని నిర్ధారిస్తుంది.

# అరెకరం భూమి ఉన్నా



సాగు అందరూ చేస్తారు. కానీ మార్కెట్‌కు తగ్గట్టు.. ఏ పంటకు మంచి ధర ఉంటుందో ముందుగానే అంచనా వేసి ఒక ప్లానింగ్‌తో కొందరు మాత్రమే ట్రెండీ పంటను సాగుచేస్తారు. అలాంటి వాళ్లే అరెకరం భూమితో కూడా కోట్లు సంపాదిస్తారు. అలాంటి పంట గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ముఖ్యంగా యువ రైతులకు ఈ ఐడియా బాగా నచ్చే అవకాశం ఉంది. పైగా ఈ పంటను మాజీ సీఎం పండించి బాగా సంపాదించారు. ఇంతకీ ఆ పంట ఏంటి అనే వివరాలు ఇప్పుడు చూద్దాం..మన దేశంలో క్యాప్సికం సాగు వేగంగా విస్తరిస్తోంది. ఆకుపచ్చ, పసుపు, ఎరుపు మూడు ప్రధాన రకాల క్యాప్సికంను విస్తృతం గా పండిస్తున్నారు. వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. క్యాప్సికం ప్రత్యేకత ఏమిటంటే మార్కెట్ డిమాండ్‌కి అనుగుణంగా రైతులు తాము పండించాలనుకునే రంగును ఎంపిక చేసుకోవచ్చు. ఆకుపచ్చ క్యాప్సికానికి ధర తక్కువే అయినా ఎక్కువగా అమ్ముడుపోతుంది. అలాగే ఎర్ర క్యాప్సికానికి ధర ఎక్కువ. రైతులు ఒకే పొలంలో మూడు రకాల క్యాప్సికంను పండించి, ధరల్లో హెచ్చుతగ్గులు ఉన్నా.. మంచి ఆదాయం పొందవచ్చు.ఇక తెలంగాణలో క్యాప్సికం సాగు విషయానికి వస్తే.. హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంత వాసులు ఈ పంటను ఎక్కువగా పండిస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ కూడా తన ఫామ్ హైజ్‌లో క్యాప్సికం సాగు చేశారు. ఇవి విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అర ఎకరం భూమిలో క్యాప్సికం సాగు చేయ దానికి రూ.15,000 నుండి రూ. 20,000 వరకు ఖర్చవుతుంది, కానీ పంట పూర్తయ్యే సరికి రూ.1 లక్ష నుండి రూ.1.5 లక్షల వరకు లాభం వస్తుంది. ఇది సాంప్రదాయ పంటలతో పోలిస్తే చాలా ఎక్కువ రాబడి. వేసవిలో కొంత ఎక్కువ జాగ్రత్త అవసరమైనప్పటికీ, సరైన నీటి సరఫరా, సకాలంలో ఎరువులు వేసినట్లయితే పంట ఆరోగ్యంగా ఉంటు ది.క్యాప్సికం సాగు ప్రారంభించడానికి రైతులు ముందుగా భూమిని లోత ంగా దున్ని, ఆవు పేడ, వర్మీ కంపోస్ట్‌తో చేసిన ఎరువులు కలపాలి. అనం తరం గట్లు తయారు చేసి వాటిపై ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లు వేస్తారు. ఆ షీట్లలో క్రమంగా రంధ్రాలు చేసి మొక్కలను నాటుతారు. నాటిన తర్వాత క్రమం తప్పకుండా నీటిపారుదల చేస్తే రెండు నెలల్లోనే పండ్లు మొద లవుతాయి. పండ్లు సిద్ధమైన వెంటనే మార్కెట్లోకి పంపవచ్చు. ప్రస్తుతం ఎరుపు క్యాప్సికం కిలో ధర రూ.100 వరకు ఉండగా, ఆకుపచ్చ క్యాప్సికం రూ.40%-%రూ నుంచి రూ.60 వరకు అమ్ముడవుతోంది.

# లాభాలతో ప్రారంభమైన సూచీలు



గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు ఈ వారాన్ని లాభాలతో ప్రారంభించాయి. కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో సూచీలు లాభాల బాటలో సాగుతున్నాయి. మెటల్, బ్యాంకింగ్ రంగాల్లో కొనుగోళ్లు పాజిటివ్‌గా మారాయి. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతున్నాయి.గత సెషన్ ముగింపు (83, 216)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభాల్లోకి ఎంటర్ అయింది. ప్రస్తుతం ఉదయం 10:15 గంటల సమయంలో సెన్సెక్స్ 348 పాయింట్ల లాభంతో 83, 565 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 104 పాయింట్ల లాభంతో 25, 596 వద్ద కొనసాగుతోందిసెన్సెక్స్‌లో నేషనల్ అల్యూమినియం, నైకా, టోరెంట్ ఫార్మా, భారత్ డైనమిక్స్, యూనో మిండా మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి. ట్రెంట్, అంబర్ ఎంటర్‌ప్రైజెస్, ఎన్‌సీసీ, ఎల్‌ఐసీ ఇండియా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ మొదలైన షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 198 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 132 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.69గా ఉంది

# అలర్ట్ మళ్లీ భారీగా పెరిగిన బంగారం



బంగారం ధరలు ఇటీవల కాలంలో భారీగా పెరిగిన విషయం తెలిసిందే.. రికార్డు స్థాయిలో పెరుగుతూ వచ్చిన పసిడి ధరలు.. ఆ తర్వాత తగ్గుతూ వచ్చాయి.. లక్షా 30 వేల మార్క్ దాటిన పసిడి ధరలు.. దాదాపు 20 రోజుల్లో రూ.10వేల వరకు తగ్గాయి. అయితే.. గత నాలుగు రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు.. సోమవారం మళ్లీ పెరిగాయి.. వాస్తవానికి బంగారం, వెండి ధరల్లో నిత్యం హెచ్చు తగ్గులు చోటుచేసుకుంటాయి.. ఒక్కో రోజు బంగారం, వెండి ధర పెరిగితే.. మరికొన్ని రోజులు తగ్గుతూ వస్తాయి. తాజాగా.. బంగారం ధర భారీగా పెరిగింది. 10 గ్రాముల పసిడిపై రూ.1200 మేర ధర పెరిగింది.పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. సోమవారం (నవంబర్ 10 2025) ఉదయం నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి..24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1200 మేర పెరిగి.. రూ.1,23,220 గా ఉంది.22 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాములపై రూ.1100 మేర రేటు పెరిగి.. రూ.1,12,950 గా ఉంది.వెండి కిలోపై రూ.2,500 ఐర ధర పెరిగి.. రూ.1,55,000 లుగా ఉంది.తెలుగు రాష్ట్రాల్లో, ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఇలా.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,23,220 ఉంటే.. 22 క్యారెట్ల 10గ్రాముల ధర రూ.1,12,950 ఉంది.. కిలో వెండి ధర రూ.1,67,000 లుగా ఉంది.విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,23,220, 22 క్యారెట్ల ధర రూ.1,12,950 గా ఉంది.. కిలో వెండి ధర రూ.1,67,000 లుగా ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,23,370, 22 క్యారెట్లు రూ.1,13,100 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,55,000లుగా ఉంది.ముంబైలో 24 క్యారెట్ల ధర రూ.1,23,220, 22 క్యారెట్లు రూ.1,12,950 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,55,000 లుగా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,24,480, 22 క్యారెట్ల ధర రూ.1,14,100 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,67,000లుగా ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,23,220, 22 క్యారెట్ల ధర రూ.1,12,950 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,55,000 లుగా ఉంది.

# ఆలస్యంగా తెలిసొచ్చింది నాజీవితంలో అది ఎప్పుడూ చేయలేదు

గతంలో పోల్చితే పెళ్లి తర్వాత సినిమాలు బాగా తగ్గించేశాడు శర్వానంద్. గతేడాది అతను నటించిన మనమే సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ మూవీ యావరేజ్ గానే నిలిచింది. ప్రస్తుతం బైకర్ అనే సినిమా చేస్తున్నాడు అలాగే నారి నారి నడుమ మురారి అనే సినిమా షూటింగ్ లో బిజీగా ఉంటున్నాడు ఛార్మింగ్ స్టార్. దీంతో పాటు శర్వా చేతిలో మరో రెండు సినిమాలున్నాయి. ఇదిలా ఉంటే శర్వానంద్ హిట్ కొట్టి చాలా కాలం అయ్యింది. కాగా 2023 జూన్ లో రక్షితా రెడ్డి అనే అమ్మాయితో కలిసి పెళ్లిపీటలెక్కాడు శర్వానంద్. వీరి దాంపత్య బంధానికి ప్రతీకగా గతేడాది పండంటి ఆడ బిడ్డ వారి జీవితంలోకి అడుగు పెట్టింది. తమ గారాల పట్టీకి లీలా దేవీ మైనేని అని పేరు పెట్టారు శర్వా దంపతులు.చిరంజీవి రికార్డును రెండు రోజుల్లో బీట్ చేసిన చరణ్.. యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న తండ్రి కొడుకులు ఇదిలా ఉంటే ఇటీవలే శర్వానంద్ బక్కచిక్కిన బాడీతో కనిపించి షాక్ ఇచ్చాడు. సిక్స్ ప్యాక్ బాడీతో కనిపించి అదరగొట్టారు. శర్వానంద్ ఎంతో ఇంతలా మారిపోయాడు అని చాలా మంది ఆరా తీశారు. తాజాగా దీని పై ఓ క్లారిటీ ఇచ్చారు శర్వానంద్. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శర్వా మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని నా కూతురు పుట్టాకే తెలిసొచ్చిందని చెప్పుకొచ్చాడు శర్వా.. నా శరీరం, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని నిర్ణయించుకున్నాను.. నా కుటుంబం కోసం స్ట్రాంగ్ గా ఉండాలని నిర్ణయించుకున్నా..దొరికేసింది మావ..!! పెద్ది సాంగ్‌లో ఈ చిన్నదాన్ని గమనించారా..? ఆమె ఎవరంటే నాకు 2019లో ఓ యాక్సిడెంట్ జరిగింది. ఆ యాక్సిడెంట్ లో నా చేతికి సర్జరీ అయింది. మెడిసిన్ లో భాగంగా యాంటిబయాటిక్స్ వాడటం వల్ల ఎప్పుడూ బాగా ఆకలేసేది. దాంతో నేను విపరీతంగా బరువు పెరిగిపోయాను. ఏకంగా 92 కిలోలకు చేరాను. అప్పుడు నాకు తెలియదు.. నేను ఎంత మారిపోయాననేది చాలా ఆలస్యంగా అర్థమైంది. యాక్టివ్‌గా ఉండేందుకు రెండేళ్ల క్రితం వాకింగ్ ప్రారంభించాను, ఇప్పుడిలా ఉన్నాను అని చెప్పుకొచ్చాడు శర్వానంద్..నా జీవితంలో వర్కవుట్స్ చేసింది లేదు. నా కూతురు పుట్టిన తర్వాతే నేను స్ట్రాంగ్ గా ఉండాలని నిర్ణయించుకున్నా అని చెప్పుకొచ్చాడు. ఇదిలా ఉంటే కొద్దిరోజుల క్రితం శర్వా దంపతులు విడిపోతున్నారని వార్తలు వచ్చాయి. ఇప్పుడు శర్వా చేసిన కామెంట్స్ తో ఆ రూమర్స్ కు చెక్ పడింది.



# చిరంజీవి రికార్డును రెండు రోజుల్లో బీట్ చేసిన చరణ్





మెగా హీరోలు చిరంజీవి, రామ్ చరణ్ పోటాపోటీగా సినిమాలు చేస్తున్నారు. కొడుకుకు ఏ మాత్రం తగ్గకుండా మెగాస్టార్ సినిమాలు చేస్తూ రాణిస్తున్నారు. ఇప్పటికే చిరంజీవి రెండు సినిమాలు లైనప్ చేశారు. డైరెక్టర్ వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.ఇందులో ఆషిక రంగనాథ్, త్రిష హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీపై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. ఇప్పటికే రిలీజ్ అయిన సాంగ్స్, టీజర్ ఆకట్టుకున్నాయి. ఈ సినిమాతోపాటు డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓప్రాజెక్ట్ చేస్తున్నారు చిరంజీవి. ఇందులో నయనతార కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ మీసాల పిల్లతో మెగాస్టార్ చిరంజీవి ఇంటర్నెట్‌ను షేక్ సింగిల్ మీసాల పిల్లతో మెగాస్టార్ చిరంజీవి ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ ఎనర్జిటిక్ మెలోడీ ఇన్స్టంట్ చార్ట్‌బస్టర్‌గా మారడమే కాకుండా, తెలుగు పాటకు దేశవ్యా ప్తంగా అరుదైన ఘనతను సాధించింది. విడుదలైన కొద్ది రోజుల్లోనే, మీసాల పిల్ల యూట్యూబ్ మ్యూజిక్ ఇండియాలో టాప్ ప్లేస్ కు చేరుకుం ది.మీసాల పిల్ల సాంగ్ యూట్యూబ్ లో 50మిలియన్ వ్యూస్ సాధించింది. సోషల్ మీడియాలో విపరీతంగా రీల్స్ వైరల్ అవుతున్నాయి. ఇక ఇప్పుడు ఈ సాంగ్ ను మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ బీట్ చేశారు. చరణ్ ప్రస్తుతం పెద్ది అనే సినిమా చేస్తున్న విషయం. బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ సినిమా నుంచి మొదటి సాంగ్ కూడా రిలీజ్ చేశారు. చిక్కిరి చిక్కిరి అనే సాంగ్ ను రిలీజ్ చేశారు.ఈ సాంగ్ ఇప్పుడు యూట్యూబ్ ను షేక్ చేస్తుంది. ఏఆర్ రెహమాన్ కంపోజ్ చేసిన ఈ సాంగ్.. భారీ వ్యూస్ ను సొంతం చేసుకుంటుంది. కేవలం రెండు రోజుల్లోనే.. మీసాల పిల్ల సాంగ్ ను బీట్ చేసేసింది. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా చికిరి చికిరి రీల్స్ కనిపిస్తున్నాయి. 35 గంటల్లో 50 మిలియన్లను క్రాస్ చేసింది. 50 మిలియన్ వ్యూస్ తెచ్చుకోవడానికి 'మీసాల పిల్ల' పాటకి 3 వారాలు పడితే, 'చికిరి చికిరి' సాంగ్ రెండు రోజుల్లోనే యాభై మిలియన్లకు పైగా వ్యూస్ సాధించింది. అయితే పెద్ది సాంగ్ నాలుగు భాషల్లో రిలీజ్ చేశారు. పైగా అది వీడియో సాంగ్.. కానీ చిరంజీవి సాంగ్ తెలుగులోనే రిలీజ్ అయ్యింది. అది కూడా లిరికల్ ఏది ఏమైనా తండ్రి కొడుకులు సోషల్ మీడియాను ఊపేస్తున్నారు.

# 11 మందితో డేటింగ్



సినీరంగంలో ఆమె టాప్ హీరోయిన్. తెలుగుతోపాటు హిందీలో అనేక చిత్రాల్లో నటించి మెప్పించింది. కకానీ కెరీర్ మంచి ఫాంలో ఉన్నప్పుడే ఎదురైన ప్రేమ ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. అప్పట్లోఆమె దాదాపు 11 మందిని ప్రేమించినట్లు వార్తలు వినిపించాయి. కానీ ఏ ప్రేమ కూడా వివాహ దశకు చేరుకోలేదు. తరువాత, ఆమె 24 సంవత్సరాల వయసులో తల్లి అయిన తర్వాత మరింత వార్తల్లో నిలిచింది.. ఆమె మరెవరో కాదు నటి సుష్మితా సేన్. అప్పట్లో ఆమె పేరు కొందరు హీరోలు, వ్యాపారవేత్తలతో ముడిపడి ఉంది. గతంలో ఓ ఇంటర్వ్యూలో సుష్మితా మాట్లాడుతూ.. 'నా జీవితం తెరిచిన పుస్తకం లాంటిది. మీరు జీవితంలో ఏ నిర్ణయాలు తీసుకున్నా.. ఆ నిర్ణయాలు బాధాకరమైనవి కావచ్చు. కానీ జీవితంలో ప్రతి నిర్ణయం మీకు ఏదో నేర్పుతుంది..' అంటూ చెప్పుకొచ్చింది.అప్పట్లో సుష్మిత పేరు లలిత్ మోడీ, సంజయ్ నారంగ్, రణదీప్ హుడా, ఇంతియాజ్ ఖత్రి, వసీం అక్రమ్, ముదస్సర్ అజీజ్ వంటి 11 మందితో ప్రేమలో పడిందని అప్పట్లో టాక్ నడిచింది. 'మిస్ యూనివర్స్' టైటిల్ గెలుచుకున్న సుష్మితా సేన్ వరుస సినిమాలతో ఇండస్ట్రీని ఏలేసింది. సుష్మితా సేన్ %యు% ప్లాట్‌ఫామ్‌లో కూడా తనకంటూ ఒక పేరు తెచ్చుకుంది. 'తాలి' , 'ఆర్య' చిత్రాలతో సుష్మితా సేన్ తన విజయ శిఖరాగ్రానికి చేరుకుంది. విభిన్న కథలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది.కానీ ఇప్పటికీ సుష్మితా ఒంటరిగానే ఉండిపోయింది. ఆమె వివాహం చేసుకోవడానికి ఇష్టపడలేదు. ఇద్దరు అమ్మాయిలను దత్తత తీసుకుని వారి బాగోగులు చూసుకుంటుంది. ప్రస్తుతం సుష్మితా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంది. అలాగే ఓటీటీలో పలు వెబ్ సిరీస్ చేస్తుంది.

# గత్తరలేపిన చిట్టి ఏం వేయ్యారం రా బాబు



హైదరాబాదీ అమ్మాయి ఫరియా అబ్దుల్లా.. 2021లో తెలుగులో వచ్చిన జాతిరత్నాలు సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది ఈ పొడుగుకాళ్ల సుందరి. సినిమాల్లోకి రాకముందు మోడలింగ్, థియేటర్ ఆర్టిస్ట్‌గా, యూట్యూబర్‌గా పలు వీడియోలు చేసింది. అలాగే ఓ వెబ్ సిరీస్ లోనూ నటించింది. హైదరాబాదీ అమ్మాయి ఫరియా అబ్దుల్లా.. 2021లో తెలుగులో వచ్చిన జాతిరత్నాలు సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది ఈ పొడుగుకాళ్ల సుందరి. సినిమాల్లోకి రాకముందు మోడలింగ్, థియేటర్ ఆర్టిస్ట్‌గా, యూట్యూబర్‌గా పలు వీడియోలు చేసింది. అలాగే ఓ వెబ్ సిరీస్ లోనూ నటించింది. హైదరాబాదీ అమ్మాయి ఫరియా అబ్దుల్లా.. 2021లో తెలుగులో వచ్చిన జాతిరత్నాలు సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది ఈ పొడుగుకాళ్ల సుందరి. సినిమాల్లోకి రాకముందు మోడలింగ్, థియేటర్ ఆర్టిస్ట్‌గా, యూట్యూబర్‌గా పలు వీడియోలు చేసింది. అలాగే ఓ వెబ్ సిరీస్ లోనూ నటించింది. అఖిల్ హీరోగా నటించిన మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ సినిమాలో చిన్న పాత్ర చేసింది. అలాగే నాగార్జున, నాగ చైతన్య బంగార్రాజు సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది. ఆతర్వాత లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్. రవితేజ రావణాసుర, రీసెంట్ గా అల్లరి నరేష్ హీరోగా నటించిన ఆ ఒక్కటీ అడక్కు సినిమాలు చేసింది.అఖిల్ హీరోగా నటించిన మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ సినిమాలో చిన్న పాత్ర చేసింది. అలాగే నాగార్జున, నాగ చైతన్య బంగార్రాజు సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది. ఆతర్వాత లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్. రవితేజ రావణాసుర, రీసెంట్ గా అల్లరి నరేష్ హీరోగా నటించిన ఆ ఒక్కటీ అడక్కు సినిమాలు చేసింది.కానీ ఈ సినిమాలు ఫరియా అబ్దుల్లా సక్సెస్ తెచ్చిపెట్టలేదు. ఇక ఇప్పుడు మత్తు వదలరా 2 సినిమాలో నటించింది. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా గ్లామరస్ గా కనిపించి మెప్పించింది. ఈ సినిమాతో సెకండ్ హిట్ అందుకుంది. ఇక సోషల్ మీడియాలో ఈ బ్యూటీ ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ ఆకట్టుకుంటుంది. కానీ ఈ సినిమాలు ఫరియా అబ్దుల్లా సక్సెస్ తెచ్చిపెట్టలేదు. ఇక ఇప్పుడు మత్తు వదలరా 2 సినిమాలో నటించింది. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా గ్లామరస్ గా కనిపించి మెప్పించింది. ఈ సినిమాతో సెకండ్ హిట్ అందుకుంది. ఇక సోషల్ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ ఆకట్టుకుంటుంది. ఈ మధ్యకాలంలో తన అందాలతో ఆకట్టుకుంటోంది ఈ బ్యూటీ. హాట్ హాట్ ఫొటోలతో సోషల్ మీడియాలో హీట్ పుట్టిస్తోంది ఈ అమ్మడు. సినిమాల స్పీడ్ తగ్గించింది ఈ అమ్మడు. కానీ సోషల్ మీడియాలో మాత్రం అరాచకం చేస్తుంది ఈ వయ్యారి భామ. ఈ మధ్యకాలంలో తన అందలతో ఆకట్టుకుంటోంది ఈ బ్యూటీ. హాట్ హాట్ ఫొటోలతో సోషల్ మీడియాలో హీట్ పుట్టిస్తోంది ఈ అమ్మడు. సినిమాల స్పీడ్ తగ్గించింది వయ్యారి భామ. తాజాగా ఫరియా అబ్దుల్లా సోషల్ మీడియా ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గ్లామర్ డోస్ పెంచి కుర్రాళ్లను కవ్విస్తుంది ఈ ముద్దుగుమ్మ. ఈ భామ ఫోటోలకు నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా ఫరియా అబ్దుల్లా సోషల్ మీడియా ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గ్లామర్ డోస్ పెంచి కుర్రాళ్లను ముద్దుగుమ్మ. ఈ భామ ఫోటోలకు నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

# డబుల్ ఎలిమినేషన్ డ్రామా



బిగ్ బాస్ తెలుగు సీజన్ 9లో ఆదివారం ఎపిసోడ్ పూర్తి స్థాయిలో డ్రామా, ఎమోషన్స్‌తో నిండిపోయింది. రాము రాథోడ్ స్వయంగా హౌస్‌ను వీడిన తర్వాత కూడా మరో ఎలిమినేషన్ జరగడం షాక్ ఇచ్చింది. వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్‌గా ఎంట్రీ ఇచ్చిన సాయి శ్రీనివాస్ ఈ వారం హౌస్ నుండి ఎలిమినేట్ అయ్యాడు. ఆడియన్స్ ఓటింగ్ ప్రకారం బాటమ్‌లో ఉన్న సాయి సీజన్‌కు గుడ్‌బై చెప్పాల్సి వచ్చింది. ఈ వారం దివ్య, సుమన్ శెట్టి రెబల్స్‌గా హౌస్‌లో సీక్రెట్ టాస్క్‌లు చేశారు. వారి దొంగతనాలు, అల్లరి వీడియోలను నాగార్జున ప్రదర్శించారు. ముఖ్యంగా సుమన్ శెట్టి నటన అందరినీ ఆకట్టుకుంది. పాల ప్యాకెట్ దొంగతనం తర్వాత అమాయకంగా నటిస్తూ హౌస్‌మేట్స్‌ను మోసం చేసిన విధానం ప్రేక్షకులను, నాగ్‌ను కూడా ఇంప్రెస్ చేసింది.నాగార్జున, కంటెస్టెంట్స్‌ను విడివిడిగా పిలిచి టైటిల్ గెలవడానికి ఎవరు దగ్గరగా ఉన్నారు? ఎలిమినేషన్‌కు ఎవరు దగ్గరలో ఉన్నారు? అని అడిగారు. అందరి అభిప్రాయాల ప్రకారం తనూజ, ఇమ్మాన్యుయేల్ టైటిల్‌కు చేరువగా ఉన్నారని తేలింది. ఇద్దరికీ తలా 5 ఓట్లు వచ్చాయి. అదే సమయంలో భరణి, సాయి ఎలిమినేషన్ జోన్‌లో ఉన్నారని అందరూ పేర్కొన్నారు. నామినేషన్లలో ఉన్న కంటెస్టెంట్స్‌లో చివరికి భరణి, సాయి మిగిలారు. గార్డెన్ ఏరియాలో వీరిద్దరి ముందు రెండు బొమ్మ ట్రైన్స్‌తో టాస్క్ సెటప్ సిద్ధం చేశారు. ఎవరి ముందు ట్రైన్ టన్నెల్ నుంచి బయటకు రాకుండా ఆగిపోతే, ఆ కంటెస్టెంట్ ఎలిమినేట్ అవుతారని నాగ్ తెలిపారు. చివరికి సాయి ట్రైన్ ఆగిపోవడంతో, అతను ఎలిమినేట్ అయ్యాడు.తనూజ వద్ద ఉన్న గోల్డెన్ బజర్‌ను ఉపయోగిస్తే సాయి సేఫ్ అవుతాడు, భరణి అవుట్ అవుతాడు అని నాగార్జున ప్రకటించారు. దీంతో సాయి ఎలిమినేట్ కాగా, భరణి మరోసారి ఎలిమినేషన్ గండం నుంచి తప్పించుకున్నాడు. ఈ ఎపిసోడ్‌తో బిగ్ బాస్ హౌస్‌లో ఫైనల్ రేస్‌కి సంబంధించిన క్లారిటీ వచ్చిందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. నాగార్జున మాటలతో తనూజ, ఇమ్మాన్యుయేల్ ఫైనలిస్టులుగా ఉండే సూచనలున్నాయని భావిస్తున్నారు. మొత్తం మీద, ఈ వారాంతం ఎపిసోడ్ బిగ్ బాస్ సీజన్ 9లో అత్యంత ఆసక్తికరమైన మలుపుగా మారింది.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com